

'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 298

శుక్రవారం 19-1-2024


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




మ్యూజికల్ ఫౌంటెన్ & ఉద్యానవనం




అంబేద్కర్ జీవిత విశేషాలతో 36 కుడ్య చిత్రాలు


అంబేద్కర్ చైత్య మ్యూజియం

డా॥ బి. ఆర్. అంబేద్కర్ గారి విగ్రహం ప్రత్యేకతలు

- డా॥ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహం ఎత్తు 125 అడుగులు
- కింద పీఠం (పెడస్టల్) ఎత్తు 81 అడుగులు
- పెడస్టల్ సైజు 3,481 చదరపు అడుగులు
- పెడస్టల్ తో కలిపి విగ్రహం మొత్తం ఎత్తు 206 అడుగులు
- పెడస్టల్ లో జీ+2తో గదుల నిర్మాణం
- బౌద్ధ వాస్తు శిల్పకళలోని కాలచక్ర మహా మండల డిజైన్ తో పీఠం ఏర్పాటు..
- పీఠం (పెడస్టల్) మొత్తం జీ+2 ఐసొసిలెస్, ట్రెపీజియం ఆకారంలో ఆర్సీసీ నిర్మాణం..
- రాజస్థాన్ పింక్ శాండ్ స్టోన్ తాపడంతో పెడస్టల్ నిర్మాణం..

డా॥ బి. ఆర్. అంబేద్కర్ స్వరాజ్ మైదాన్ ప్రత్యేకతలు


- రూ. 404 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా స్వరాజ్ మైదాన్ ను తీర్చిదిద్దిన జగనన్న ప్రభుత్వం
- 18.81 ఎకరాల స్వరాజ్ మైదానంలో ఆహ్లాదకరమైన ఉద్యానవనం..
- పర్యాటకులను ఆకర్షించేలా, అంబేద్కర్ జీవిత విశేషాలు తెలియచేసి వారి ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొందేలా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్..
- డా. అంబేద్కర్ గారి జీవిత విశేషాలను వివరించే కుడ్య చిత్రాలతో కూడిన కొలనేడ్..
- 2వేల మంది కూర్చునేలా కన్వెన్షన్ సెంటర్..
- 8వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫుడ్ కోర్టు..
- చిన్నారులు ఆడుకోవటానికి ప్లే ఏరియా..
- స్మృతివనం ఆవరణలో మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్లు, స్మృతివనం చుట్టూ ఉదయం, సాయంకాల వేళల్లో వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ చేసుకునేలా ప్రత్యేక మార్గాలు..




కాలచక్ర మహా మండపం



విహార ఆంఫి థియేటర్



14' ఎత్తు x 22' పొడవు నెమలి ఆకృతి



జీవ కళ ఉట్టిపడే మైనపు విగ్రహాలు

జగనన్న ప్రభుత్వంలో సామాజిక సాధికారత ఒక నినాదం కాదు, అది రాష్ట్ర ప్రభుత్వ విధానం ..

డా. మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

శుక్రవారం 19-1-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 298

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



ఆరో టైటిల్ లక్ష్యంగా..

నేటి నుంచి అండర్-19 ప్రపంచకప్.. రేపు బంగ్లాదేశ్‌తో భారత్ ఢీ - స్పోర్ట్స్‌లో



విమానయానం ఉజ్వలం

7 ఏళ్లలో మరో 50 విమానాశ్రయాలు.. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య - బిజినెస్‌లో



గర్భగుడిలోకి రామ్‌లల్లా

అయోధ్యలోని భవ్య మందిరంలోని గర్భగుడిలోకి రామ్‌లల్లా విగ్రహాన్ని చేర్చారు. బాలుడి రూపంలో శ్రీరాముడు దర్శనమివ్వనున్నారు.

వివరాలు 6లో ▸



22న 'సగం రోజు సెలవు'

దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు ఈ నెల 22న సగం రోజు సెలవు ప్రకటించారు.

వివరాలు 6లో ▸



ఇరాన్‌పై పాక్ ప్రతీకార దాడి

ఇరాన్‌పై పాక్ ప్రతీకార దాడులకు దిగింది. రాకెట్లు, డ్రోన్లతో చేసిన దాడుల్లో 9 మంది ఉగ్రవాదులు హతమైనట్లు తెలిపింది.

వివరాలు 6లో ▸



గుజరాత్‌లో ఘోర ప్రమాదం

గుజరాత్‌లోని వడోదర శివారులో ఉన్న చెరువులో పడవ మునగడంతో 14 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు మరణించారు.

వివరాలు 6లో ▸

సంపూర్ణ సామాజిక న్యాయం

8 అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానాలకు సమన్వయకర్తలను నియమించిన సీఎం జగన్

వైఎస్సార్‌సీపీ నాలుగో జాబితాను ప్రకటించిన మంత్రి బొత్స సత్యనారాయణ

మొత్తంగా 58 శాసనసభ, 10 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల నియామకం

- వివరాలు 3లో



విజయవాడలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సామాజిక న్యాయ మహాశిల్పం

'సామాజిక' సారథి

అంబేడ్కర్ ఆశయ సాధన బాటలో సీఎం వైఎస్ జగన్

రాష్ట్రంలో 56 నెలలుగా సామాజిక విప్లవ చైతన్యం

కేబినెట్ నుంచి స్థానిక సంస్థల దాకా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకే

నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం ఆ వర్గాలకే రిజర్వేషన్

- చట్టం చేసి మరీ అవకాశాలు కల్పించడం దేశంలో ఇదే ప్రథమం
- సంక్షేమ పథకాల ద్వారా డీబీటీతో పేదల ఖాతాల్లోకి రూ.2.46 లక్షల కోట్లు
- ఇందులో 75 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఖాతాల్లోకే
- నగదు బదిలీయేతర పథకాల ద్వారా పేదలకు మరో రూ.1.67 లక్షల కోట్లు
- స్వాతంత్ర్యం నాటి నుంచి ఇప్పటిదాకా రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు
- ఇందులో 2.07 లక్షల ఉద్యోగాలు గత 56 నెలల్లో ఇచ్చినవే
- అందులోనూ 80 శాతం ఉద్యోగాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే
- విద్య, ఆర్థిక, రాజకీయ సాధికారతతో రాణిస్తున్న బడుగులు, మహిళలు
- సామాజిక న్యాయంలో సీఎం జగన్ దేశానికే ఆదర్శమంటున్న సామాజికవేత్తలు

2లో

సామాజిక న్యాయ మహాశిల్పం..

నేడు జాతికి అంకితం

అంబేడ్కర్ స్మృతివనం పనులు పూర్తి

సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నేడు ఆవిష్కరణ

4లో

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్ చెక్కును అందజేస్తున్న సీఎం జగన్



చరిత్ర ఎరుగని సాహసం..

ఏకంగా 31.19 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

వడివడిగా 22.25 లక్షల గృహ నిర్మాణాలు

పావలా వడ్డీకే రూ.35 వేలు రుణాలుగా ఇప్పిస్తున్నాం

లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.47 కోట్ల వడ్డీని జమ చేసిన సీఎం

సాక్షి, అమరావతి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా, ఎవరూ సాహసించని రీతిలో అక్కచెల్లెమ్మలకు ఏకంగా 31.19 లక్షల ఇళ్ల స్థలాలు ఇవ్వగలిగామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఇంటి స్థలం, ఇల్లు రూపంలో ప్రతి నిరుపేద అక్కచెల్లెమ్మకు రూ.20 లక్షల వరకు విలువైన ఆస్తిని ఇవ్వగలిగే గొప్ప అవకాశాన్ని దేవుడు తనకు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం కింద 4,07,323 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలపై

మిగతా 2వ పేజీలో ▶



కాకినాడలో భారీ ఎల్‌ఎన్‌జీ

ఫ్లోటింగ్ టెర్మినల్

- రూ.8,300 కోట్లతో ఏర్పాటు చేయనున్న నార్వేకు చెందిన క్రౌన్ ఎల్‌ఎన్‌జీ
- ఏడాదికి 7.2 మిలియన్ టన్నుల ఎల్‌ఎన్‌జీ దిగుమతి
- దేశంలోనే రెండో అతిపెద్ద ఎల్‌ఎన్‌జీ టెర్మినల్‌గా ఏర్పాటు
- క్రౌన్ ఎల్‌ఎన్‌జీ సీఈవో స్వపన్ కతారియా వెల్లడి

11లో

బాబు తోడుదొంగ ఈశ్వరన్ ఔట్

- పదవులు, పార్టీకి సింగపూర్ మంత్రి రాజీనామా
- 27 తీవ్ర అభియోగాలతో చార్జ్‌షీట్లు దాఖలు
- కనీసం ఏడేళ్ల జైలు శిక్ష ఖాయమంటున్న నిపుణులు
- అమరావతి భూదోపిడీలో చంద్రబాబు పార్టనర్ ఈశ్వరన్
- స్టార్టప్ ఏరియా పేరిట రియల్ ఎస్టేట్ లావాదేవీలు
- సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం అంటూ బురిడీ
- బాబు బినామీ కంపెనీ ద్వారా గూడుపుఠాణి

10లో



తన పార్టనర్ సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో చంద్రబాబు(ఫైల్)

జూ.ఎన్టీఆర్ ఫ్లెక్సీలు

తీసేయండి

- ఎన్టీఆర్ ఘాట్ వద్ద బాలకృష్ణ ఆదేశం.. తొలగించిన అనుచరులు
- తిరిగి ఏర్పాటు చేసేందుకు జూ.ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రయత్నం
- హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఉద్రిక్తత

- వివరాలు 10లో

ఉచ్ఛ నీచాల్లేని వ్యక్తి

చంద్రబాబు

- నాడు ఎన్టీఆర్ నుంచి పదవిని లాక్కొన్న గజ దొంగ
- నేడు ఓట్ల కోసం నక్కజిత్తుల వేషాలు.. వీటిని ప్రజలు తిప్పికొడతారు
- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజం

- వివరాలు 10లో

రికార్డు స్థాయిలో

పాస్‌పోర్ట్ సేవలు

- రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పాస్‌పోర్టు సేవలు కొనసాగుతున్నాయి. రోజురోజుకు దరఖాస్తులు పెరుగుతుండటంతో విశాఖ రీజనల్ పాస్‌పోర్టు కేంద్రం కిక్కిరిసిపోతోంది. రోజుకు 1,290 అపాయింట్‌మెంట్లు ఇస్తున్నారు. 2023లో 1,98,577 పాస్‌పోర్టులు జారీ చేసినట్లు అధికారులు చెప్పారు.

- వివరాలు 5లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

కూలి పనులు మాని వస్త్రాలు నేస్తున్నాం



మేం చేనేత కార్మికులం. మగ్గంపై వస్త్రాలు నేసి, ఆ ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. గత ప్రభుత్వాలు నేత కార్మికులను పట్టించుకోకపోవడం నూలు కొనుగోలుకు సబ్సిడీ ఇవ్వకపోవడం, పెట్టుబడి సాయం చేయకపోవడంతో వారంతా కులవృత్తికి దూరమయ్యారు. అప్పు చేసి ముడి సరుకు కొనుగోలు చేసి నేను నా భార్య కష్టపడి మగ్గం నేస్తే పెట్టుబడి, వడ్డీలు పోను రోజుకు రూ.500లు మిగలడం కష్టమయ్యేది. లాభం లేక పొట్టకూటి కోసం వ్యవసాయ కూలి పనులకు, సిమెంట్ కాంక్రీటు పనులకు, కంపెనీల్లో పనుల కోసం వలస పోవాల్సి వచ్చింది. భార్యభర్తలం ఎండలో కష్టపడితే రోజుకు రూ.700లు వచ్చేది. అలవాటు లేకపోయినా పొట్టపోషణకోసం ఆ పనులు చేయాల్సి వచ్చేది. దేవుడు జగనన్న రూపంలో వచ్చాడు. తాను అధికారంలోకి వస్తే చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకు వస్తానని ప్రకటించారు. పాదయాత్రలో నేతన్నల కష్టాలు స్వయంగా చూశారు. నేతన్నలకు నెలకు రూ.2 వేల చొప్పున పెట్టుబడి సాయం ఇస్తామన్నారు. సీఎం అయిన వెంటనే మూడు మాసాలు తిరక్కుండానే నేతన్న నేస్తం పథకం కింద నెలకు రూ.2 వేల చొప్పున ఏడాదికి సరిపడా రూ.24 వేలు ఒకే విడతలో మా ఖాతాల్లో జమ చేశారు. ఐదేళ్లనుంచి నిరాటంకంగా ఈ సాయం అందిస్తున్నారు. ఇప్పటివరకు రూ.1.20 లక్షలు నా ఖాతాల్లో జమయ్యాయి. ఇప్పుడు మేము ఎంచక్కా కుల వృత్తికి దగ్గరయి, అప్పు చేయకుండా ముడిసరుకు కొనుగోలుచేసి వస్త్రాలు తయారు చేసి విక్రయించుకుంటున్నాం. రోజుకు సుమారు వెయ్యి రూపాయల ఆదాయం వస్తోంది. ఇంటివద్దే ఉంటూ ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఈ ప్రభుత్వం చేసిన సాయాన్ని ఎన్నటికీ మరువలేం.

– మాదెం రాజు, నక్కపల్లి, అనకాపల్లి జిల్లా
(ఆచంట రామకృష్ణ, విలేకరి, నక్కపల్లి, అనకాపల్లి జిల్లా)

వ్యవసాయానికి ఇప్పుడు చింత లేదు



మాది వ్యవసాయ కుటుంబం. కొల్లేరు తీరంలోని కాళింగగూడెంలో నాకు ఎకరంన్నర సొంత భూమి ఉండగా మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ఈ ప్రాంతంలో వ్యవసాయం కత్తిమీద సాములా ఉండేది. ముంపునకు ముందు.. సాగుకు వెనుక అన్న చందంగా ఉండేది. కొల్లేరు ముంపుతో ఖరీఫ్ సాగు నష్టపోతుండగా, తుఫాన్ల వల్ల రబీ సాగు కోల్పోయేవాళ్లం. కౌలు కూడా చెల్లించలేని దుస్థితిలో తినడానికి ఒక్క గింజైనా మిగిలేది కాదు. ప్రతి ఏటా అధిక వడ్డీలకు సొమ్ము తెచ్చి పెట్టుబడులు పెట్టి సాగు చేసినా చేతికి చిల్లిగవ్వ దక్కేది కాదు. అప్పుల ఊబిలో కూరుకుపోయేవాళ్లం. పిల్లల్ని చదివించలేక, పండగలు ఆనందంతో జరుపుకోలేక నానా అవస్థలూ పడేవాళ్లం. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కష్టాలు చాలావరకూ తొలగిపోయాయి. సొంత భూమికి రైతు భరోసా సొమ్ము ఏటా రూ. 13,500లు వంతున వస్తోంది. పంట నష్ట పరిహారం, బీమా సొమ్ములు ఏటా అందుతున్నాయి. పండించిన పంటకు మద్దతు ధర లభిస్తోంది. పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్మిన రెండు, మూడు రోజులకే సొమ్ము బ్యాంకు అకౌంట్‌లో పడిపోతోంది. నాకు ఇద్దరు కుమార్తెలున్నారు. ఒక పాపకు అమ్మ ఒడి సొమ్ము ఏటా రూ. 15వేలు వంతున నా భార్య అకౌంట్‌లో జమవుతోంది. మరో పాపకు విద్యాదీవెన, వసతి దీవెన వర్తిస్తోంది. ఇద్దరు పిల్లల చదువుకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా ఉంది. ఇప్పుడు సంతోషంగా జీవనం గడుపుతున్నాం. మా లాంటివారిని ఆదుకుంటున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– తమ్మినేని రంగారావు, కాళింగగూడెం, ఆకివీడు మండలం
(బి.ఆర్.కోటేశ్వరరావు, విలేకరి, ఆకివీడు)

వ్యాపారం చేస్తూ బతుకుతున్నాం



నేను, నా భర్త మానుకొండ రామారావుతో కలసి గతంలో కూలిపనులు చేసుకుని జీవనం సాగించేవాళ్లం. మాకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె నిషికి ఐదు నెలల క్రితం వివాహం చేశాం. కుమారుడు ప్రసన్న కుమార్ ఐటీఐ చదువుతున్నాడు. చిన్న కుమార్తె రూప ఇంటర్ పూర్తి చేసింది. ముగ్గురికీ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందించిన ఆర్థికసాయంతోనే చదివించగలిగాం. కూలి పనులకు వెళ్లలేక మూడేళ్ల క్రితం ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం సత్తెన్నగూడెంలో ఇంటి వద్దే ఒక చిన్న పచారీ కొట్టు పెట్టాను. అప్పు చేసి, పెట్టుబడి పెట్టి వ్యాపారాన్ని అతి కష్టం మీద నడిపేదాన్ని. చేతిలో చిల్లిగవ్వ లేక, వ్యాపారం సజావుగా సాగక, కుటుంబ పోషణ భారమైన సమయంలో వైఎస్సార్ ఆసరా పథకం నా కుటుంబాన్ని ఆదుకుంది. ఏడాదికి 15,357 చొప్పున మూడు దఫాలుగా ఇప్పటి వరకు నా పొదుపు ఖాతాలో రూ.46,071 జమ అయ్యింది. దీనికి తోడు జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు చొప్పున రెండు దఫాలుగా రూ.20 వేలు సాయం అందింది. ఈ నగదు వ్యాపార అవసరాలకు ఎంతగానో ఉపయోగపడింది. ఈ దుకాణానికి అద్దె, కరెంటు బిల్లు పోను నెలకు సుమారు రూ.12 వేలు ఆదాయం వస్తోంది. – మానుకొండ శ్రీలత, సత్తెన్నగూడెం, ద్వారకాతిరుమల మండలం
(యండమూరి నాగవెంకట శ్రీనివాస్, విలేకరి, ద్వారకాతిరుమల)



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

బడుగులపై సీఎం ప్రేమకు నిదర్శనం

మరో విశ్వకర్మగా సీఎం జగన్
దేశంలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా ఖ్యాతి
వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: విజయవాడ నడిబొడ్డున 206 అడుగుల బీఆర్ అంబేడ్కర్ మహావిగ్రహం రూపకల్పనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో విశ్వకర్మగా చరిత్రలో నిలిచిపోతారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి అభివర్ణించారు. దేశ చరిత్రలోనే మహాఘట్టంగా నిలిచిపోయే అంబేడ్కర్ మహా విగ్రహం ఆవిష్కరణ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరగనుందని, ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు అంబేడ్కర్ సిద్ధాంతాలకు అభిమానించే వారు, దళితులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన సుమారు 1.50 లక్షల మంది హాజరుకానున్నారని పేర్కొన్నారు. 'సామాజిక న్యాయ మహాశిల్పం' ఆవిష్కరణ, సామాజిక సమతా సంకల్ప సభ కార్యక్రమాల ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి విజయసాయిరెడ్డి గురువారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో మరెక్కడా లేనివిధంగా రూపొందించిన ఈ మహాశిల్పం నుంచి జీవకళ ఉట్టిపడుతోందన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగించే వారిలో దేశంలోనే ముందుండే సీఎం జగన్ అధికారంలోకి వచ్చి కేవలం నాలుగున్నరేళ్ల కాలంలోనే దళితుల కలను సాకారం చేశారన్నారు. ఈ మహా విగ్రహం సీఎం జగన్‌కు బడుగు, బలహీన వర్గాల మీద ఉన్న ప్రేమాభిమానాలను ప్రతిబింబిస్తోందన్నారు. అంబేడ్కర్ స్మృతివనం దేశంలోనే గొప్ప పర్యాటక కేంద్రంగా అవతరించనుందని చెప్పారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మ్యూజియంలో అంబేడ్కర్ బాల్యం, విద్యాభ్యాసం, ఇతర ఘట్టాలకు సంబంధించి చిత్రాల్లో జీవం ఉట్టిపడుతోందన్నారు. విజయసాయిరెడ్డి వెంట మంత్రులు మేరుగు నాగార్జున, కె.నారాయణస్వామి, జోగి రమేష్, ఎంపీలు నందిగం సురేష్, కేశినేని నాని, మాజీ మంత్రులు సుచరిత, వెలంపల్లి శ్రీనివాస్, డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నేత దేవినేని అవినాశ్ ఉన్నారు.

'సామాజిక' సారథి

అంబేడ్కర్ ఆశయ సాధన బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలాన్ని పుణికిపుచ్చుకుని పరిపాలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 56 నెలలుగా ఆవిష్కరించిన సామాజిక మహా విప్లవంతో రాష్ట్రమంతటా సాధికారత ప్రతిధ్వనిస్తోంది. రాష్ట్రంలో ఏ రంగంలో చూసినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు సింహభాగం అవకాశాలతో దూసుకెళుతుండటం ఇందుకు నిదర్శనం. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజే సామాజిక న్యాయమంటే నినాదం కాదు.. అనుసరించాల్సిన విధానమని జగన్ స్పష్టం చేశారు. తొలి మంత్రివర్గం ఏర్పాటులోనే దీన్ని రుజువు చేశారు. అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రతి అడుగులో ఆచరిస్తూ సామాజిక న్యాయం చేయడంలో సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారని సామాజికవేత్తలు ప్రశంసిస్తున్నారు.

రాజ్యాధికారంలో వాటా..

2019 ఎన్నికల్లో 50 శాతం ఓట్లు సాధించి 151 శాసనసభ స్థానాలు (86.28 శాతం), 22 లోక్‌సభ స్థానాల్లో (88 శాతం) వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తొలి మంత్రివర్గం నుంచే సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టారు. 25 మందితో ఏర్పాటైన క్యాబినెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 14 మందికి (56 శాతం) స్థానం కల్పించారు. రాజ్యాధికారంలో సింహభాగం వాటా ఇచ్చారు. ఐదుగురు డిప్యూటీ సీఎంలలో నలుగురికి (80 శాతం) ఆయా వర్గాల నుంచే అవకాశం కల్పించారు. దేశ చరిత్రలో తొలిసారిగా ఎస్సీ మహిళను హోంశాఖ మంత్రిగా నియమించారు. శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారామ్‌కు అవకాశం కల్పించగా శాసన మండలి ఛైర్మన్‌గా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎస్సీ వర్గానికి చెందిన కొయ్యే మోషేన్ రాజుకు అవకాశమిచ్చారు. మండలి డిప్యూటీ ఛైర్ పర్సన్‌గా మైనార్టీ వర్గానికి చెందిన మహిళ జకియా ఖానంకు అవకాశమిచ్చారు. 2022 ఏప్రిల్ 11న పునర్‌వ్యవస్థీకరణ ద్వారా 25 మందితో ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో సామాజిక న్యాయంలో ముఖ్యమంత్రి జగన్ మరో అడుగు ముందుకేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి ఏకంగా 17 మందికి (70 శాతం) మంత్రివర్గంలో స్థానం కల్పించారు. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో బీసీ వర్గానికి చెందిన ఒక్కరిని కూడా రాజ్యసభకు పంపించలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర కోటాలో 8 స్థానాలు ఖాళీ కాగా అందులో నలుగురు బీసీలను (50 శాతం) సీఎం జగన్ రాజ్యసభకు పంపారు. శాసన మండలిలో వైఎస్సార్ సీపీకి 43 మంది ఎమ్మెల్సీలు ఉండగా వీరిలో 29 మంది (68 శాతం) బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారే కావడం గమనార్హం. 2014–19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీకి 48 ఎమ్మెల్సీ స్థానాలు దక్కితే చంద్రబాబు కేవలం 18 పదవులు (37 శాతం) మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చారు.

స్థానిక సంస్థల్లో సంచలనం..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం జగన్ ఉత్తర్వులు జారీ చేస్తే దీనిపై చంద్రబాబు హైకోర్టులో టీడీపీ నేతలతో కేసులు వేయించారు. దాంతో బీసీలకు రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గాయి. టీడీపీ కుట్రలు చేసి రిజర్వేషన్లు తగ్గించినప్పటికీ పార్టీ పరంగా తాము 34 శాతం కంటే ఎక్కువే ఇస్తానని సీఎం జగన్ ప్రకటించారు. ఆ మేరకు స్థానిక సంస్థలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అత్యధికంగా పదవులిచ్చారు. రాష్ట్రంలో 648 మండలాలకు ఎన్నికలు జరగ్గా 637 చోట్ల వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. మండల పరిషత్ అధ్యక్ష పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 67 శాతం ఇచ్చారు. 13 జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులలో ఏకంగా 9 పదవులు (69 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు ఇచ్చారు. రాష్ట్రంలో 14 మున్సిపల్ కార్పొరేషన్లలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. 14 మేయర్ పదవుల్లో 12 పదవులను (86 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చారు. 87 మున్సిపాల్టీలలో ఎన్నికలు జరగ్గా 84 చోట్ల వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలకు 58 మున్సిపల్ ఛైర్మన్ పదవులు (69%) ఇచ్చారు.

చారిత్రక చట్టం..

నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చారిత్రక చట్టం చేసి మరీ ఆయా వర్గాలకు ముఖ్యమంత్రి జగన్ పదవులు ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఆ వర్గాలకు రిజర్వేషన్ చేస్తూ చట్టం చేయడం దేశంలో ఇదే తొలిసారి. 196 వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లను నియమించగా అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 117 పదవులు (60 శాతం) ఇచ్చారు. వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో 137 ఛైర్మన్ పదవులలో 79 పదవులు(58 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చారు. 137 ప్రభుత్వ కార్పొరేషన్ పదవులకు సంబంధించి 484 నామినేటెడ్ డైరెక్టర్ పదవులుంటే 280 పదవులు(58 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే ఇచ్చారు. బీసీ వర్గాలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు, ఎస్సీలకు ప్రత్యేకంగా 3 కార్పొరేషన్లు, ఎస్టీలకు 1 కార్పొరేషన్ ఏర్పాటు చేసి వాటికి ఆయా వర్గాల వారినే ఛైర్మన్లుగా నియమించారు. ఆ కార్పొరేషన్లలో ఆయా వర్గాలకు 684 డైరెక్టర్ పదవులు ఇచ్చారు. ఆలయ బోర్డులు, ఆలయ ఛైర్మన్ పదవుల్లో సగభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే ఇచ్చారు. దాదాపు 7,006 ఆలయ బోర్డు మెంబర్ల పదవుల్లో 3,503 అంటే సగం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే ఇచ్చారు.

ఆర్థిక తోడ్పాటు..

సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ఆర్థికంగా చేయూత ఇవ్వడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఆర్థిక సాధికారత సాధించేలా సీఎం జగన్ బాటలు వేశారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా నగదు బదిలీ(డీబీటీ) రూపంలో రూ.2.46 లక్షల కోట్లను పేదల ఖాతాల్లో జమ చేయగా ఇందులో 75 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే చేరాయి. ఇక ఇతర పథకాల ద్వారా (నాన్ డీబీటీ) రూ.1.67 లక్షల కోట్ల మేర ప్రయోజనాన్ని చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా పేదలకు రూ.4.13 కోట్ల మేర లబ్ధి కలిగింది. ఈ నిధులను సద్వినియోగం చేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఆర్థిక సాధికారత సాధించాయి.

పేద బిడ్డలకు పెద్ద చదువులు..

నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా అభివృద్ధి చేసిన సీఎం జగన్ పేద పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా ఇంగ్లిషు మీడియం బోధనను ప్రవేశపెట్టారు. విప్లవాత్మక సంస్కరణలతో నాణ్యమైన విద్య అందిస్తున్నారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు విద్యా సాధికారత సాధించేందుకు మార్గం సుగమం చేశారు. స్వాతంత్య్రం వచ్చిననాటి నుంచి రాష్ట్రంలో ఇప్పటిదాకా 4 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయగా అందులో గత 56 నెలల్లో భర్తీ చేసినవే 2.07 లక్షల ఉద్యోగాలున్నాయి. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే 80 శాతం ఉద్యోగాలు దక్కాయి. దీన్ని పరిశీలిస్తే ఆయా వర్గాలు విద్యా సాధికారత సాధించినట్లు స్పష్టమవుతోంది.

మహిళా సాధికారతలో అగ్రగామి..

వైఎస్సార్ ఆసరా, చేయూత లాంటి పథకాల ద్వారా సీఎం జగన్ మహిళలకు ఆర్థికంగా తోడ్పాటు అందించారు. రాష్ట్రంలో 30.76 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.75,670 కోట్ల విలువైన ఇంటి స్థలాలను ఇవ్వడమే కాకుండా పక్కా ఇళ్లను సైతం నిర్మించి ఇస్తూ వారి సొంతింటి కలను సాకారం చేశారు. కేబినెట్ నుంచి స్థానిక సంస్థల వరకూ మహిళలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారు. హోంమంత్రిగా ఎస్సీ మహిళకు, మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా మైనార్టీ మహిళకు అవకాశం కల్పించారు. నామినేటెడ్ పదవులు, పనులు 50% మహిళలకే ఇవ్వాలని దేశ చరిత్రలో తొలిసారిగా చట్టం చేసి మరీ మహిళలకు న్యాయం చేశారు. మహిళా సాధికారతలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచింది.

చరిత్ర ఎరుగని సాహసం..

▶ మొదటి పేజీ తరువాయి

వడ్డీని రీయింబర్స్ చేస్తూ రూ.46.90 కోట్ల మొత్తాన్ని సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులను ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు.

అక్కచెల్లెమ్మలకు మంచి చేస్తూ..

దేవుడి దయతో ఈ రోజు మరో మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. నవరత్నాలు –పేదలందరికీ ఇళ్లు పథకం లబ్ధిదారులైన 12,77,373 మంది అక్కచెల్లెమ్మలకు ఒక్కొక్కరికి రూ.35 వేలు చొప్పున పావలా వడ్డీకే రుణాలిప్పించాం. వాటికి సంబంధించి తొలి దఫాలో 4,07,323 మందికి పావలా వడ్డీ కింద ఇవాళ సుమారు రూ.47 కోట్లు జమ చేస్తున్నాం. ప్రతి ఆర్నెల్లకు ఒకసారి ఈ కార్యక్రమం చేపడతాం. గతంలో సున్నా వడ్డీ డబ్బులు అక్కచెల్లెమ్మలకు విడుదల చేసినప్పుడు 5,43,140 మందికి దాదాపు రూ.54 కోట్లు విడుదల చేశాం. ప్రతి అక్కచెల్లెమ్మకు మంచి చేస్తూ పావలా వడ్డీకే రూ.35 వేలు రుణం అందించడం ద్వారా ఇళ్ల నిర్మాణం పురోగతిని వేగవంతం చేస్తున్నాం. బ్యాంకుల దగ్గర నుంచి పొందిన రుణాలను 9 నుంచి 11 శాతం వరకు వడ్డీతో తిరిగి చెల్లించే కార్యక్రమం అక్కచెల్లెమ్మలు సక్రమంగా చేయాలి. అది వారి బాధ్యత. అలా అక్కచెల్లెమ్మలు కట్టిన వడ్డీ సొమ్మును తిరిగి వారికి అందించే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది. ఈ క్రమంలో అక్కచెల్లెమ్మలకు నికరంగా రూ.35 వేలపై పావలా వడ్డీ మాత్రమే పడుతుంది.



లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విలువైన స్థిరాస్తి..

రాష్ట్రంలో ఇప్పటికే 22.25 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్ర చరిత్రలో ఇది ఎక్కడా, ఎప్పుడూ చూడని విధంగా చేపడుతున్నాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.2.70 లక్షలు ఖర్చవుతుంది. మరో రూ.లక్ష మౌలిక సదుపాయాల కోసం అదనంగా ఖర్చవుతుంది. ఇంటి నిర్మాణం, మౌలిక వసతుల కోసం దాదాపు రూ.3.70 లక్షలు ఖర్చు అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో రూ.1.80 లక్షలు నేరుగా అక్కచెల్లెమ్మలకు ఇస్తున్నాం. మరో రూ.35 వేలు పావలా వడ్డీకి రుణాలను అందుబాటులోకి తెచ్చాం. దాదాపు రూ.15 వేలు ఖరీదు చేసే ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నాం. సిమెంట్, మెటల్ ఫ్రేమ్స్ లాంటి వివిధ రకాల నాణ్యమైన వస్తువులను మార్కెట్ ధర కన్నా తక్కువకు సబ్సిడీపై అందించడం ద్వారా రూ.40 వేల దాకా ప్రయోజనం చేకూరుస్తున్నాం. మనం ఇచ్చిన ఇంటి స్థలం మార్కెట్ విలువ ప్రాంతాన్ని బట్టి కొన్ని జిల్లాల్లో రూ.15 లక్షల పైచిలుకు ఉంది. ఈ విలువ మీద ఇళ్లు, మౌలిక సదుపాయాల విలువలను కలిపితే ప్రతి అక్కచెల్లెమ్మకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ ఆస్తిని తోబుట్టువుగా సమకూరుస్తున్నాం. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఏపీ గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ షర్మిలారెడ్డి, సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, ప్రత్యేక కార్యదర్శి బి.ఎండీ.దీవాన్ మైదిన్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ డాక్టర్ లక్ష్మీ షా, సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్, మెప్మా ఎండీ వి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోటిమంది.. జయహో జగనన్నా



పిల్లాపాపలతో కలిపి సుమారు కోటిమంది అక్కచెల్లెమ్మలకు శాశ్వత చిరునామా కల్పిస్తున్న గొప్ప యజ్ఞం జగనన్న ఇళ్ల నిర్మాణం. ఒక గ్రామం ఏర్పడాలంటే సుమారు 50 నుంచి 100 సంవత్సరాలు పడుతుంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద రెండున్నర ఏళ్లలో 17 వేల జగనన్న కాలనీల రూపంలో కొత్త ఊళ్లను నిర్మించడం ఇదే ప్రథమం. ఇది దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ముఖ్యమంత్రి జగన్‌కు మినహా మరెవరికీ ఇది సాధ్యం కాదు. ప్రభుత్వం 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి 22 లక్షల గృహ నిర్మాణాలు చేపట్టగా ఇప్పటికే 9 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తై నిరుపేద మహిళలు పిల్లాపాపలతో సంతోషంగా జీవిస్తున్నారు. కోటిమంది జయహో జగనన్నా అని నినదిస్తున్నారు. పేదలకు పక్కా గూడు కల్పించే ఈ మహా యజ్ఞం ఎంత మంది మారీచులు అడ్డుపడినా ఆగదు.

– జోగి రమేష్, గృహ నిర్మాణ శాఖా మంత్రి

ఓ ఆడబిడ్డకు ఇంకేం కావాలి?



ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఇంటి కోసం తిరిగి తిరిగి అలిసిపోయా. ఈ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకోగానే స్థలం మంజూరైంది. వెంటనే పట్టా ఇచ్చారు. విశాఖలో అడుగు భూమి లేని నాకు ఈ రోజు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల విలువైన స్థలాన్ని, ఇంటిని కూడా అందించారు. ఇదంతా నమ్మలేకపోతున్నా. మాకిచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణానికి ఎన్నో విధాలుగా అండగా నిలిచారు. బ్యాంకు ద్వారా పొందిన రుణానికి వడ్డీ కూడా మీరే కడుతున్నారు. కాలనీలో రోడ్లు, కరెంట్, నీళ్లు అన్నీ ఇచ్చారు. ఒక ఆడపిల్లకు అన్నగా మీరు (సీఎం జగన్) చేయాల్సిందంతా చేశారు. ఇంతకంటే ఏం కావాలి? మా పాపకు అమ్మ ఒడి వస్తోంది. నేను పొదుపు సంఘం ద్వారా లబ్ధి పొందా. కరోనా సమయంలో ఎంతో ఆదుకున్నారు. మళ్లీ మీరే మాకు సీఎంగా రావాలి.

– హైమావతి, లబ్ధిదారు, విశాఖపట్నం

ద్వారకను తలపించేలా కాలనీలు



మేం తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డాం. గుంటూరు జిల్లా పేరేచర్ల జగనన్న కాలనీలో నాకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలం విలువ రూ.10 లక్షలు ఉంటుంది. దానికి తోడు ఇల్లు కట్టుకోవడానికి కూడా సాయం చేశారు. ఎన్ని జన్మలెత్తినా మీ (సీఎం జగన్) రుణం తీర్చుకోలేం. కాలనీలో కరెంటు, రోడ్లు, వాటర్ అన్ని సౌకర్యాలున్నాయి. ఏడాదిన్నరగా ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లోనే ఉంటున్నా. మా కాలనీలో లైటింగ్, ఆర్చ్ గేట్ కట్టారు. లైటింగ్ చూడటానికి రెండు కళ్లు సరిపోలేదు. అప్పట్లో శ్రీకృష్ణుడు ద్వారక కట్టిస్తే అన్ని కులాలు కలిసి బతికేవారట.ఇప్పుడు జగనన్న కాలనీలు కూడా ద్వారక లాంటివే. తల్లిదండ్రులు జన్మనిస్తే మీరు మాకు జీవితమిచ్చారు. మీలాంటి సీఎంను గతంలో ఎన్నడూ చూడలేదు. మా పిల్లలను స్కూల్‌కు పంపితే అన్నీ ఇస్తున్నారు. గవర్నమెంట్ స్కూల్‌లో చదివిస్తున్నానని గర్వంగా చెబుతున్నా. మా ఇంట్లో రేషన్ బియ్యం తింటాం. రేషన్ బండి ఇంటి ముందుకే వస్తోంది. ఏ ప్రయాస లేకుండా సరుకులు తీసుకుంటున్నాం.

– స్వర్ణ సింధూర, లబ్ధిదారు, గుంటూరు

మీ సంకల్పం గట్టిది



పదేళ్లు అద్దె ఇంట్లో ఉన్నాం. కిరాయి కట్టలేక చాలా ఇబ్బందులు పడ్డాం. మీరు తెచ్చిన సచివాలయాల వ్యవస్థతో రూపాయి ఖర్చు పెట్టకుండా ఇంటి స్థలం ఇచ్చారు. సొంతిల్లు కట్టుకునేందుకు రూ.35 వేలు బ్యాంకు రుణం అందించారు. ఆ వడ్డీ భారం మాపై పడకుండా మీరు తీసుకున్న నిర్ణయానికి హ్యాట్సాఫ్. నా ఇంటి స్థలం ఇప్పుడు రూ. 5 లక్షలు ఉంది. భవిష్యత్‌లో రూ.10 లక్షలు కూడా కావచ్చు. ఈ ప్రభుత్వంలో నాకు రేషన్ కార్డు కూడా మంజూరైంది. ఏ పథకం కావాలన్నా సులభంగా అందుతోంది. మా పాపకు అమ్మ ఒడి వస్తోంది. మా అత్తయ్య చేయూత డబ్బులతో చీరల వ్యాపారం చేస్తోంది. మామకు వృద్ధాప్య పింఛన్ ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నారు. గతంలో పింఛన్ కోసం ఎంతో ప్రయాసలు పడ్డాం. పేద మహిళ లక్షాధికారి కావాలన్న మీ (సీఎం జగన్) సంకల్పం గొప్పది. మీ ద్వారా నా కుటుంబం రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధి పొందింది.

– వహిదా ఖానం, లబ్ధిదారు, కడప

సుప్రీం కోర్టు తీర్పును వక్రీకరించలేదు

ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి



నెల్లూరు (బారకాసు): చంద్రబాబు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తాను వక్రీకరించలేదని రాష్ట్ర ప్రభుత్వ అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చెప్పారు. ఆయన గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. టీడీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ విసిరిన సవాల్ స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కేసులో పొందుపరిచిన అంశాలు వాస్తవమని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని కనకమేడల సవాల్ విసిరారని, ఆయన రాజ్యసభ సభ్యత్వం కొన్ని రోజులే ఉన్నందున, ఇప్పుడు ఆయన సవాల్ విసరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను కేవలం చట్టాల గురించి మాత్రమే మాట్లాడుతున్నానని, చంద్రబాబు కేసులో ప్రభుత్వం అంతా చట్ట ప్రకారమే వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. నోట్ ఫైల్స్ సెక్రటేరియట్లో తగలబడిపోయాయని, వాటిని ఆర్థిక శాఖ నుంచి రిట్రీవ్ చేశామని తెలిపారు. చంద్రబాబు పాల్పడిన నేరానికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని, దీనిపై టీడీపీ నేతల రాద్ధాంతం అర్థం లేనిదని అన్నారు. ప్రాథమిక సాక్ష్యాధారాలు సేకరించిన తరువాతే చంద్రబాబును అరెస్టు చేశారని తెలిపారు. కేసుకు సంబంధించి ప్రభుత్వ ప్రతినిధిగా అన్ని సాక్ష్యాధారాలతోనే తాను మాట్లాడుతున్నానని అన్నారు. చంద్రబాబు కేసు వివరాలు చెబుతుంటే కొందరు తనని చంపుతామని బెదిరిస్తున్నారని, ఇది ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ప్రముఖ రాజకీయ నాయకుడు నిందితుడిగా ఉన్నారని, ఈ స్కాంలో రూ.371 కోట్ల మేర ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని, దీంతో రిమాండ్ రిపోర్టులో చంద్రబాబును నిందితుడిగా చేర్చడం జరిగిందని అన్నారు. బెయిల్ వచ్చినంత మాత్రాన చంద్రబాబు నిర్దోషి కాదన్నారు. ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి సాక్ష్యాలను పరిశీలించిన తరువాతే రిమాండ్‌కు ఇచ్చారన్నారు. సాక్ష్యాలు లేకుంటే న్యాయమూర్తి రిమాండ్ విధించకుండా వదిలేసి ఉండేవారు కదా అని అన్నారు. చంద్రబాబు ఇతర నిందితులతో కలసి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. రిమాండ్ రిపోర్టులో జోక్యం చేసుకోబోమని సుప్రీం కోర్టు న్యాయమూర్తి స్పష్టం చేశారని తెలిపారు. కొన్ని పచ్చ పత్రికల్లో ఈ కేసుకు సంబంధించి రాసిన రాతలు రోతగా ఉన్నాయన్నారు. ఇలా వక్రీకరించి రాయడం ప్రజల్ని తప్పుదోవ పట్టించడమేనని చెప్పారు. రిమాండ్ రిపోర్టు లేకపోతే తెప్పించుకుని చదవాలని హితవు పలికారు.

సంపూర్ణ సామాజిక న్యాయం

ఒక ఎంపీ, 8 అసెంబ్లీ స్థానాలకు సమన్వయకర్తలను నియమించిన సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ నాలుగో జాబితాను ప్రకటించిన మంత్రి బొత్స
- మొత్తంగా 58 శాసనసభ, 10 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల నియామకం



సాక్షి, అమరావతి: సంపూర్ణ సామాజిక న్యాయం, ప్రజాదరణే గీటు రాయిగా 8 శాసనసభ స్థానాలు, ఒక లోక్‌సభ స్థానానికి పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో జాబితాను ఖరారు చేశారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ పరిష్కరిస్తూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లి ప్రజల మన్ననలు అందుకొన్న నేతలకు పెద్దపీట వేశారు. సామాజిక న్యాయంలో మరో రెండడుగులు ముందుకేశారు. గురువారం రాత్రి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ వివరాలను ప్రకటించారు. గత నెల 11న 11 శాసనసభ స్థానాలకు, ఈ నెల 2వతేదీన 24 శాసనసభ, 3 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ జాబితాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. అలాగే ఈ నెల 11న విడుదల చేసిన మూడో జాబితాలో 15 శాసనసభ, 6 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమించారు. మొత్తం నాలుగు జాబితాలతో కలిపి 58 శాసనసభ, 10 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను ప్రకటించారు. 58 మంది సమన్వయకర్తల్లో ఎస్సీలు 21 మంది, ఎస్టీలు ముగ్గురు, బీసీలు 17 మంది, మైనార్టీలు నలుగురు, అగ్రవర్ణాలకు చెందిన వారు 13 మంది ఉన్నారు. పది లోక్‌సభ స్థానాల సమన్వయకర్తల్లో బీసీలు ఆరుగురు, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీ ఒకరు చొప్పున ఉన్నారు.

సామాజిక సమీకరణాలు, స్థానిక అంశాలు..

వైనాట్ 175 లక్ష్యంతో దూసుకెళుతున్న వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మకంగా మరో ముందడుగు వేసింది. సామాజిక సమీకరణలు, స్థానిక రాజకీయ అంశాల మేలు కలయికగా తాజాగా నాలుగో జాబితాను ప్రకటించింది. ప్రజలకు మరింత మేలు చేయడం, పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా సమన్వయకర్తలను నియమించింది. చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు నుంచి ఎమ్మెల్యేగా వరుసగా గెలుస్తూ 2019 నుంచి ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్‌శాఖ మంత్రిగా ఉన్న సీనియర్ నేత కె.నారాయణ స్వామిని చిత్తూరు లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. 2019లో చిత్తూరు ఎంపీగా గెలిచిన ఎన్.రెడ్డెప్పను జీడీ నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఖరారు చేసింది. ఇక అనంతపురం జిల్లా శింగనమల అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎం.వీరాంజనేయులు, నంద్యాల జిల్లా నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ సుధీర్ దారా, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర సమన్వయకర్తగా ఈర లక్కప్పలకు తొలిసారి అవకాశం కల్పించింది. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నల్లగట్ల స్వామిదాస్‌ను నియమించారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న హోంమంత్రి తానేటి వనితను గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ప్రస్తుతం గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న తలారి వెంకట్రావును కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఖరారు చేశారు. ప్రకాశం జిల్లా కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా హనుమంతునిపాడు జెడ్పీటీసీ సభ్యుడు దద్దాల నారాయణ యాదవ్‌ను నియమించారు.

చేసిన మంచే శ్రీరామరక్షగా..

ప్రజలకు నాలుగున్నరేళ్లుగా చేసిన మంచి పనులే మనకు తోడుంటాయనే ధైర్యంతో ముఖ్యమంత్రి జగన్ అడుగులు ముందుకు వేస్తూ పార్టీ శ్రేణులను ఎన్నికల సమరానికి సన్నద్ధం చేస్తున్నారు. ప్రజలకు దగ్గరగా ఉండేవారికే టికెట్ ఇస్తున్నారు. ఆ విషయం అనేకసార్లు ఆయన ఎంపీలు, ఎమ్మెల్యేలకు స్పష్టం చేశారు. తన తండ్రి, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గత 56 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలతో సుపరిపాలన అందిస్తున్నారు. డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) ద్వారా నేరుగా రూ.2.45 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.67 లక్షల కోట్లు వెరసి మొత్తం రూ.4.12 లక్షల కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం చేకూర్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించినట్లుగా దళితులు, బలహీనవర్గాలు, పేద వర్గాలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేలా తోడ్పాటు అందిస్తున్నారు. శాసనమండలి చైర్మన్‌గా మోషేన్ రాజును, బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారామ్‌ను స్పీకర్‌గా నియమించి సామాజిక సమీకరణకు పెద్ద పీట వేశారు. 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను మంత్రుల్ని చేశారు. సంక్షేమ పథకాలను ఎలాంటి లంచాలు, సిఫారసులకు తావులేకుండా ప్రజలకు అందిస్తున్నారు. మహిళా సాధికారతను సాకారం చేశారు. వైఎస్సార్ మహిళల్ని లక్షాధికారుల్ని చేస్తే సీఎం జగన్ వారిని కోటీశ్వరులుగా చేస్తున్నారు. పేదల పిల్లలకు ఉన్నత వర్గాలతో సమానంగా ఇంగ్లిష్ మీడియం చదువులు అందిస్తున్నారు. 56 కార్పొరేషన్ల ఏర్పాటు ద్వారా బడుగు బలహీన వర్గాలు, దళితుల ఆత్మ గౌరవాన్ని పెంపొందించారు. ఈ క్రమంలో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా సమన్వయకర్తలను నియమిస్తున్నారు.

నాలుగో జాబితా ఇదీ

చిత్తూరు లోక్‌సభ నియోజకవర్గం (ఎస్సీ రిజర్వుడ్): కె.నారాయణస్వామి (ఉప ముఖ్యమంత్రి)



8 శాసనసభ నియోజక వర్గాలకు సమన్వయకర్తలు వీరే..

1. జీడీ నెల్లూరు (ఎస్సీ రిజర్వ్‌డ్): ఎన్ . రెడ్డెప్ప
2. శింగనమల (ఎస్సీ రిజర్వ్‌డ్): ఎం. వీరాంజనేయులు
3. నందికొట్కూరు (ఎస్సీ రిజర్వ్‌డ్): డాక్టర్ సుధీర్ దారా
4. తిరువూరు (ఎస్సీ రిజర్వ్‌డ్): నల్లగట్ల స్వామిదాస్
5. మడకశిర (ఎస్సీ రిజర్వ్‌డ్): ఈర లక్కప్ప
6. కొవ్వూరు (ఎస్సీ రిజర్వ్‌డ్): తలారి వెంకట్రావు
7. గోపాలపురం (ఎస్సీ రిజర్వ్‌డ్): తానేటి వనిత
8. కనిగిరి: దద్దాల నారాయణ యాదవ్

జేసీజేలుగా ఎంపికైన వారికి ఏడాదిపాటు శిక్షణ ఇవ్వాలి

హైకోర్టులో న్యాయవాది యోగేష్ పిల్

సాక్షి, అమరావతి: కొత్తగా జూనియర్ సివిల్ జడ్జి(జేసీజే)లుగా ఎంపికైన వారికి కనీసం ఏడాది పాటు శిక్షణ ఇవ్వకుండానే పోస్టింగులు ఇవ్వడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. కొత్తగా జేసీజేలుగా ఎంపికైన వారికి పోస్టింగ్‌లు ఇచ్చే ముందు కనీసం ఏడాదిపాటు శిక్షణ ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చిందని, అయినప్పటికీ ఈ తీర్పునకు విరుద్ధంగా పోస్టింగ్‌లు ఇస్తున్నారంటూ హైకోర్టు న్యాయవాది తాండవ యోగేష్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో న్యాయశాఖ కార్యదర్శి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, రిజిస్ట్రార్ (విజిలెన్స్), రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. జూనియర్ సివిల్ జడ్జిలకు బాధ్యతలు అప్పగించే ముందు వారికి కనీసం ఏడాది పాటు ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలని ఆలిండియా జడ్జెస్ అసోసియేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చిందని యోగేష్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇటీవల జేసీజేలుగా ఎంపికైన 20 మందికి కనీసం ఏడాది పాటు శిక్షణ ఇచ్చేలా ప్రతివాదులను ఆదేశించాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. హైకోర్టు విభజన తరువాత 2021లో 62 మంది జేసీజేలుగా ఎంపికయ్యారని, వారికి ఎలాంటి ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వకుండానే నేరుగా పోస్టింగ్‌లు ఇచ్చేశారని యోగేష్ తెలిపారు.

లౌకికేతర కార్యక్రమాలకు కోర్టులను వేదిక చేయరాదు

హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు ఆలిండియా లాయర్స్ యూనియన్ లేఖ

సాక్షి, అమరావతి: లౌకికేతర కార్యక్రమాలకు హైకోర్టును వేదిక చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) హైకోర్టును కోరింది. ఈనెల 22న అయోధ్యలో జరిగే శ్రీరామ విగ్రహప్రతిష్ట కార్యక్రమాన్ని హైకోర్టు న్యాయవాదుల సంఘం హాలులో, హైకోర్టు ప్రవేశ ద్వారం వద్ద ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేసిందని, ఇది సంఘం తీసుకున్న ఏకపక్ష నిర్ణయమని ఐలూ హైకోర్టు కమిటీ అధ్యక్షుడు నర్రా శ్రీనివాసరావు, కార్యదర్శి యడవల్లి రమేశ్ గురువారం హైకోర్టు రిజిస్ట్రార్‌కు ఓ లేఖ రాశారు. సర్వసభ్య సమావేశం నిర్వహించకుండానే హైకోర్టు న్యాయవాదుల సంఘ కార్యవర్గం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇది గతంలో హైకోర్టు జారీ చేసిన సర్క్యులర్‌కు విరుద్ధమని వారు తెలిపారు. న్యాయస్థానాల్లో మతపరమైన కార్యకలాపాలు, కార్యక్రమాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని వారు రిజిస్ట్రార్ జనరల్‌ను కోరారు. అలాగే ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లను ఉపసంహరించుకోవాలని హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శికి కూడా విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయనకు సైతం లేఖ రాశారు.

అభ్యంతరాల పరిశీలనకు ఏపీపీఎస్సీ కమిటీ

సాక్షి, అమరావతి: కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి సంబంధించి పేపర్-3లో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్జెక్ట్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించేందుకు కమిటీని నియమిస్తున్నట్టు ఏపీపీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అభ్యర్థులతోపాటు ఇతర ఇంజినీరింగ్ విభాగంలో అర్హత కలిగిన అభ్యర్థులకు కూడా సమాన అవకాశం ఇచ్చే అంశంపై ఈ కమిటీ పరిశీలించి నిర్ణయం తీసుకోనుంది.

ఉత్తరాంధ్ర నుంచే వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావం

25న భీమిలిలో బహిరంగ సభ

- క్రియాశీలక కార్యకర్తలతో సీఎం జగన్ నేరుగా మాట్లాడతారు
- పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త సుబ్బారెడ్డి, మంత్రి బొత్స వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు

సాక్షి, విశాఖపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల శంఖారావం పూరిస్తారని వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు. గురువారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, పార్టీ సమన్వయకర్తలు, పార్టీ జిల్లా అధ్యక్షులతో సుబ్బారెడ్డి సమావేశమయ్యారు. అనంతరం డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ నెల 25న సుమారు 3 లక్షల మందితో భీమిలిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. భీమిలిలో జరిగే బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణులకు సీఎం జగన్ దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో 175/175 లక్ష్యంతో ఎన్నికల ప్రచారం సాగుతుందని స్పష్టం చేశారు. గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన తరువాత పూర్తిగా అమలుచేసి చూపించారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని భీమిలి బహిరంగ సభ ద్వారా ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. బహిరంగ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరుకానున్నారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 5 ప్రాంతీయ సమావేశాలు నిర్వహించి పార్టీ క్రియాశీలక కార్యకర్తలతో సీఎం వైఎస్ జగన్ సమావేశమవుతారని చెప్పారు. పార్టీ క్యాడర్‌లో అసంతృప్తిని తొలగించడంతోపాటు ఎమ్మెల్యే అభ్యర్థుల మార్పులకు గల కారణాలను నేరుగా సీఎం వైఎస్ జగన్ వివరిస్తారన్నారు.

విశాఖ రాజధాని కావడం తథ్యం

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. విశాఖ పరిపాలన రాజధాని కావడం తథ్యమని, దివంగత సీఎం వైఎస్, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే విశాఖ నగరం, ఉత్తరాంధ్ర అభివృద్ధి బాట పట్టిందని కొనియాడారు. కాదని చెప్పే దమ్ము ఎవరికైనా ఉందా అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భీమిలి బహిరంగ సభకు ముందు ఈ నెల 21 నుంచి 23 వరకు ఉత్తరాంధ్రలో నియోజకవర్గస్థాయి పార్టీ సమావేశాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దళారులు, మధ్యవర్తులు లేకుండా నేరుగా ప్రజల బ్యాంక్ ఖాతాలకు నేరుగా నగదు జమ చేస్తున్నారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని, దీనిని ప్రజలు చూస్తూ ఊరుకోరని, వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారని అన్నారు. తమ సంకల్పం ఉత్తరాంధ్ర అభివృద్ధి అని స్పష్టం చేశారు. మీడియా అడిగిన ప్రశ్నలకు మంత్రి బొత్స సమాధానమిస్తూ.. రాజకీయాల్లో మార్పులు, చేర్పులు సహజమన్నారు. జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలు ఎందుకు తీసేశారనేది టీడీపీ ఇష్టమని.. తమకు సంబంధం లేని అంశంపై తాను మాట్లాడనన్నారు.

షర్మిల కుమారుడి నిశ్చితార్థానికి హాజరైన సీఎం జగన్



కాబోయే వధూవరులు రాజారెడ్డి, ప్రియలకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న సీఎం వైఎస్ జగన్ దంపతులు

మణికొండ (హైదరాబాద్)/అమరావతి: హైదరాబాద్ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్‌లో గురువారం సాయంత్రం జరిగిన షర్మిల కుమారుడు రాజారెడ్డి వివాహ నిశ్చితార్థ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సతీమణి భారతిరెడ్డితో కలిసి హాజరయ్యారు. కాబోయే వధూవరులు రాజారెడ్డి, అట్లూరి ప్రియలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా షర్మిల, బ్రదర్ అనిల్‌కుమార్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్ విజయమ్మ, తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, శాంతా బయోటెక్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, మాజీ మంత్రులు జానారెడ్డి, రఘువీరారెడ్డి, సినీనటులు మోహన్‌బాబు, విష్ణు, ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతోపాటు రాజకీయ, సినీ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో వారిని నియంత్రించేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. జై జగన్ నినాదాలతో గోల్కొండ రిసార్ట్ మార్మోగింది.

అవినీతి, అబద్ధాలకు కేరాఫ్ చంద్రబాబు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం(ప్రకాశం చౌక్): టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అవినీతి, అక్రమాలు, అబద్ధాలు చెప్పడంలో ఘనుడని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. 'స్కిల్' కేసులో సుప్రీంకోర్టు తీర్పుతో ఆయనకు చెంప దెబ్బ తగిలిందని చెప్పారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు చేసిన అవినీతి, అక్రమాలపై చట్టపరంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు చెప్పారు. ఈ కేసులో చంద్రబాబును అరెస్టు చేయడానికి సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకోలేదంటూ టీడీపీ నాయకులు వాదించారే తప్ప.. బాబు అవినీతి చేయలేదని ఎక్కడా చెప్పలేదని తెలిపారు. తన అరెస్టు అక్రమమని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కక్ష సాధింపుతో తనపై కేసులు పెట్టారని, సానుభూతి పొందడానికి ప్రయత్నించిన చంద్రబాబుకు సుప్రీంకోర్టు తీర్పు చెంప దెబ్బ లాంటిదని చెప్పారు.



'అనంత'లో భారీగా నగదు పట్టివేత

- విడపనకల్లు చెక్‌పోస్టు వద్ద రూ.1.75 కోట్లు స్వాధీనం



సీజ్ చేసిన నగదును చూపుతున్న సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ నరసింగప్ప

విడపనకల్లు: అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టు వద్ద పోలీసులు భారీగా నగదును పట్టుకున్నారు. సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, గుంతకల్లు డీఎస్పీ నరసింగప్పలు గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం చౌటపల్లికి చెందిన పందాల కృష్ణారెడ్డి సివిల్ కాంట్రాక్టర్. ఆయన కొన్నేళ్లుగా కర్ణాటకలోని బళ్లారి జిల్లా సిరుగుప్పలో నివాసం ఉంటున్నారు. గురువారం బళ్లారి నుంచి బెంగళూరుకు తన కారు (ఏపీ26డీ1374)లో రూ.1.75 కోట్లు తీసుకుని వెళ్తుండగా.. ఆంధ్రా సరిహద్దులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో కారు, డబ్బును సీజ్ చేశారు. బెంగళూరులో ఓ స్థలాన్ని కొనుగోలు చేశానని, రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు బంధువులు, స్నేహితుల వద్ద అప్పు చేసి తీసుకెళుతున్నట్టు కృష్ణారెడ్డి పోలీసులకు చెప్పారు. డబ్బును ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించనున్నట్టు పోలీసులు చెప్పారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి, అమరావతి: నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 20న ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ టి.గోపాలకృష్ణ తెలిపారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు వివరించారు. శనివారం ఉదయం 11.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతి ఉండదని చెప్పారు. ఈ పరీక్షకు ఏపీ నుంచి 91,041 మంది, తెలంగాణ నుంచి 50,332 మంది, పాండిచేరిలోని యానాం నుంచి 395 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఏపీలో 416, తెలంగాణలో 244, యానాంలో 2 పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్లను https://navodaya.gov.in/nvs/en/Home1 వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, హాల్ టికెట్ రానివారు సమీప నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ 'సాక్షి'కి తెలిపారు.



క్లుప్తంగా...

నేడు భారతజాతి గర్వించే రోజు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరిగే శుక్రవారం యావత్ భారతజాతి గర్వించదగ్గరోజని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అభివర్ణించారు. కుల, మత, రాజకీయాలకు సంబంధం లేకుండా విగ్రహావిష్కరణ తిలకిద్దామని ఆయన పిలుపునిచ్చారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత జాతికి ఒక దిక్సూచిని రూపొందించే ముసాయిదా కమిటీకి చైర్మన్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వ్యవహరించినందుకు పార్లమెంటు ఎదురుగా ఆయన నిలువెత్తు విగ్రహం ఉంటుందని శంకరరావు గుర్తు చేశారు. ఇప్పుడు విజయవాడలో 206 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయడం బడుగు, బలహీనవర్గాలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ప్రపంచ మేధావిని విగ్రహ రూపంలో ఆవిష్కరించుకోవడమంటే మనల్ని మనం గౌరవించుకోవడమేనన్నారు. నిమ్నజాతుల ఆశాజ్యోతి, ప్రపంచ మేధావి, నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ తన జీవితాన్ని దళిత విముక్తి కోసం త్యాగం చేసిన ధన్యజీవి అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌బాబు

సాక్షి, అమరావతి: విజయవాడలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం, సామాజిక సంకల్ప సభకు రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్ అంబేడ్కర్ ఒక నిరంతర స్ఫూర్తిదాయక గ్రంథం అని కొనియాడారు. విజయవాడలో ప్రపంచంలోనే అతి పెద్ద బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పాలనే ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పక్షాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సురేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్‌కు దళితుల పక్షాన కృతజ్ఞతలు

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పరాజ్



మాట్లాడుతున్న పుష్పరాజ్

పెనుగొండ: విజయవాడ నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేసి ఆవిష్కరణ చేయనున్న సీఎం జగన్‌కు దళితుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. గురువారం పశ్చిమ గోదావరి జిల్లా, వేమవరంలో జరిగిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి దిక్సూచిగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సంది జయరాజు, జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోతారు

ఏపీ ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ సదర్ ఉద్దీన్ ఖురేషి

సాక్షి, అమరావతి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యుగపురుషుడని, ప్రపంచంలోనే ఎత్తయిన ఆయన విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం హర్షణీయమని ఏపీ ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ సదర్ ఉద్దీన్ ఖురేషి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గర్వించే విధంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్ప సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

తెలంగాణ

మసీదులపై కేసుల్లో పోరాటానికి న్యాయ మండలి

సాక్షి, హైదరాబాద్: మసీదులపై ఉన్న కేసులకు సంబంధించి న్యాయ పోరాటానికి ముస్లిం పర్సనల్ లాబోర్డు న్యాయ మండలిని ఏర్పాటు చేసింది. మసీదుల పరిరక్షణ కోసం బోర్డు.. లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ఇక నుంచి ప్రణాళికలు రూపొందించి ముందుకు వెళ్లనుంది. గురువారం పాతబస్తీలోని ఓ మదర్సాలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రస్తుతం దేశం ఉన్న పరిస్థితుల్లో ముస్లింలు ఎలా వ్యవహరించాలి, షరియత్ పరిరక్షణ, ముస్లిం ప్రార్థనా స్థలాల పరిరక్షణ కోసం ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్లాలనే అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

సామాజిక న్యాయ మహా శిల్పం..

నేడు జాతికి అంకితం

అంబేడ్కర్ స్మృతివనం పనులు పూర్తి.. బెజవాడ నగరం నడిబొడ్డున భారీ విగ్రహం ఏర్పాటు



మ్యూజియంలో అంబేడ్కర్ చరిత్రను తెలిపే బొమ్మలు

- ప్రపంచంలోనే ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహానికి రూపకల్పన
- దేశంలోనే ఎత్తయిన మతాతీత విగ్రహం
- 18.18 ఎకరాల విశాల ప్రాంగణంలో ప్రాజెక్టు నిర్మాణం
- రూ.404.35 కోట్లతో మేడిన్ ఇన్ ఇండియా సామగ్రితో పనులు పూర్తి
- రాష్ట్రానికే తలమానికంగా స్మృతివనం
- 20 నుంచి ప్రజలకు ఎంట్రీ
- సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నేడు ఆవిష్కరణ



విగ్రహం సమీపంలో వాటర్ ఫౌంటెన్



విగ్రహం పరిసరాల్లో పచ్చదనం

సాక్షి ప్రతినిధి, విజయవాడ/సాక్షి, అమరావతి

స్వాతంత్రోద్యమంలో ఎన్నో చారిత్రక సమావేశాలకు వేదికగా నిలిచిన బెజవాడ స్వరాజ్య మైదానంలో నిర్మిస్తున్న భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. చరిత్రలో నిలిచిపోయేలా రూపుదిద్దుకున్న సామాజిక న్యాయ మహాశిల్పం జాతికి అంకితమిచ్చే తరుణం వచ్చేసింది. అద్భుతమైన ప్రాజెక్టుగా రూపుదిద్దుకున్న ఈ స్మృతివనం పనులను మహాయజ్ఞంలా పూర్తిచేశారు. అత్యంత అందంగా తీర్చిదిద్దుతున్న ఈ ప్రాంగణం ప్రపంచస్థాయి పర్యాటకులను సైతం ఆకర్షించే వేదికగా మారనుంది. దేశంలో మతాతీతమైన విగ్రహాల్లో ఇదే అతిపెద్దది కావడం విశేషం. 206 (81 అడుగుల బేస్, 125 అడుగుల విగ్రహం) అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. రాత్రివేళ ప్రత్యేక కాంతులతో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఈ ప్రాజెక్టును పర్యవేక్షించి, అత్యంత అద్భుతంగా రూపొందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నిత్యం అధికారులతో మాట్లాడుతూ పనులు పరుగులు పెట్టించారు. ఇలా స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయ మహా శిల్పం)ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఈ అరుదైన అంబేడ్కర్ సామాజిక న్యాయ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనవరి 19న ఆవిష్కరిస్తున్నారు. ఇక స్మృతివనాన్ని వీక్షించేందుకు ఈ నెల 20 నుంచి సామాన్య ప్రజలకు ప్రవేశం కల్పించనున్నారు.

18.18 ఎకరాల్లో.. రూ.404 కోట్లతో...

రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. 18.18 ఎకరాల్లో దాదాపు రూ.404.35 కోట్లతో పనులు చేపట్టారు. ఇందులో అందమైన గార్డెన్‌ను రూపొందించారు. ఎంఎస్ అసోసియేట్ సంస్థ డిజైన్లు రూపొందించింది. అంబేడ్కర్ విగ్రహం పనుల కోసం రూపొందించిన ప్రాజెక్టు పనులకు దేశీయ మెటీరియల్‌నే ఉపయోగించారు. ప్రత్యేకంగా అందమైన గార్డెన్, వాటర్ బాడీస్, మ్యూజికల్ ఫౌంటేన్లు, చిన్నపిల్లలు ఆడుకోవటానికి, వాకింగ్ చేసుకోవటానికి వీలుగా తీర్చిదిద్దారు. పార్కింగ్ సౌకర్యం కల్పించారు. మొత్తం భవనాన్ని 30 మీటర్ల లోతులో.. 539 పిల్లర్లతో నిర్మించారు. ముందుభాగం కారిడార్‌ను 166 పిల్లర్లతో రూపొందించారు. దీనిని 388 మీటర్ల పొడవు, 4.5 మీటర్ల వెడల్పుతో రూపొందించారు. ఇందులో ఆయన జీవిత చరిత్ర తెలిపే 38 ఘట్టాలను ప్రదర్శించేలా ఆర్ట్‌వర్క్ ఏర్పాటుచేశారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చైర్మన్‌గా 8 మంది మంత్రులతో ప్రభుత్వం సబ్ కమిటీని ఏర్పాటుచేసింది. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు పనుల ప్రగతిని కమిటీ సమీక్షించింది. మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఈ ప్రాజెక్టు పనులు స్వయంగా పర్యవేక్షించారు.

పనుల పరిశీలన...

ఇక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం రాత్రి ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లు పరిశీలించారు. విగ్రహ ఆవిష్కరణకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలు చర్చించారు.

విజయవాడలో నేడు సీఎం జగన్ పర్యటన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19న శుక్రవారం విజయవాడలో పర్యటించనున్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సామాజిక సమతా సంకల్ప సభ, స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. సా.4.30కు తాడేపల్లి నివాసం నుంచి బయల్దేరి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం చేరుకుంటారు. అక్కడ సామాజిక సమతా సంకల్ప సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం స్వరాజ్ మైదాన్ చేరుకుని అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం రాత్రికి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ప్రత్యేకతలు ఇవీ..

అంబేడ్కర్ విగ్రహం ఎత్తు 125 అడుగులు	పాద పీఠం (పెడస్టల్ ఎత్తు) 81 అడుగులు
పెడస్టల్ సైజు 3,481 చదరపు అడుగులు	పెడస్టల్‌తో కలిపి విగ్రహం మొత్తం ఎత్తు 206 అడుగులు
నిర్మించే అంతస్తులు జీ ప్లస్ టు	
విగ్రహానికి వాడిన కాంస్యం 120 మెట్రిక్ టన్నులు	విగ్రహం నిర్మాణం లోపల (ఆర్మేచర్)కు వాడిన స్టీలు 400 మెట్రిక్ టన్నులు
అంబేడ్కర్ స్మృతివనానికి ఖర్చుచేసిన మొత్తం 404.35 కోట్లు	పనులు ప్రారంభం మార్చి 21, 2022
శాండ్ స్టోన్ 2,200 టన్నులు	
ప్రారంభించే తేదీ: జనవరి 19, 2024	

విగ్రహం బేస్ కింది భాగంలో..

- గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లు ఉంటాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు హాల్స్ ఉంటాయి. ఇందులో ఓ సినిమా హాలు, మిగిలిన మూడు హాళ్లు ఆయన చరిత్ర తెలిపే డిజిటల్ మ్యూజియంలు ఉంటాయి.
- ఫస్ట్ ఫ్లోర్‌లో 2,250 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన నాలుగు హాళ్లుంటాయి. ఒక హాల్లో అంబేడ్కర్‌కు దక్షిణ భారతదేశంతో ఉన్న అనుబంధాన్ని డిస్‌ప్లే చేస్తారు. రెండు హాళ్లలో మ్యూజియం, ఒక హాల్‌లో లైబ్రరీ ఉంటాయి.
- ఇక సెకండ్ ఫ్లోర్‌లో 1,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు హాల్‌లు ఉంటాయి. వీటిని లైబ్రరీకి వినియోగించాలనే ప్రతిపాదన ఉంది.

ఏపీకే తలమానికం..

అంబేడ్కర్ స్మృతివనంను 18.18 ఎకరాల్లో తీర్చిదిద్దాం. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏపీలో తలమానికంగా నిలువనుంది. 166 పిల్లర్లతో అందమైన కారిడార్, 38 మ్యూరల్స్ ఏర్పాటుచేశాం. స్మృతివనం ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దాం. ఇది ఓ మాన్యుమెంట్‌గా మిగిలిపోనుంది. అడ్వాన్స్ టెక్నాలజీతో మ్యూజియంను ఏర్పాటుచేశాం.

– శ్రీలక్ష్మి, మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

జగనన్న నిర్ణయం చరిత్రాత్మకం

అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణం గొప్ప కార్యక్రమం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మకం. గత టీడీపీ ప్రభుత్వం దళితులను ఎంతో మోసం చేసింది. అంబేడ్కర్ విగ్రహం నిర్మించేందుకు సరైన స్థలం కూడా చంద్రబాబు ఇవ్వలేదు. విజయవాడ నడిబొడ్డున అత్యంత ఖరీదైన స్థలాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించారు. సీఎం చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తాం.

– మేరుగు నాగార్జున, మంత్రి

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టి స్మృతివనం ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.
- అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలిపే (డిజిటల్) మ్యూజియంను 75 మంది సీటింగ్ కెపాసిటీతో అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించారు.
- ఇది ప్రపంచంలోనే అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలిపే అతిపెద్ద మ్యూజియం కావడం విశేషం.
- మినీ థియేటర్లు, ఫుడ్‌కోర్టు, కన్వెన్షన్ సెంటర్, వెహికల్ పార్కింగ్ ఉన్నాయి. కన్వెన్షన్ సెంటర్ 6,340 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 2,000 మంది సీటింగ్ సామర్థ్యంతో నిర్మించారు. ఫుడ్‌కోర్టు 8,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది.
- బిల్డింగ్ చుట్టూ నీటి కొలనులు, మ్యూజికల్, వాటర్ ఫౌంటేన్, ముందుభాగంలో ఉన్నాయి. నీటి కొలనుకు లైటింగ్, బబ్లింగ్ సిస్టం ఉన్నాయి. ఇవన్నీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడి ఉంటాయి.
- కాలచక్ర మహా మండల పీఠం బౌద్ధ వాస్తు శిల్పకళతో అంబేడ్కర పీఠం (పెడస్టల్)ను రూపొందించారు.
- విగ్రహ పీఠం లోపల జి ప్లస్ 2 అంతస్తులను ఐసోసెల్స్ ట్రాపేజియం ఆకారంలో ఆర్సీసీ ఫ్రేమ్డ్ నిర్మాణం చేశారు. రాజస్థాన్‌కు చెందిన పింక్ రాక్‌ను ఉపయోగించారు.
- అంబేడ్కర్ జీవిత చరిత్ర తెలిపే 38 ఘట్టాలను ప్రదర్శించేలా ఆర్ట్ వర్క్ ఏర్పాటుచేస్తున్నారు. అంబేడ్కర్ జీవితంలో బాల్యం, విద్య, వివాహం, ఉద్యోగం, రాజకీయ జీవితం, పోరాటాలు, రాజ్యాంగ నిర్మాణం ఛాయాచిత్రాలను, ఇతర వస్తువులను ప్రదర్శించే మ్యూజియం ఏర్పాటవుతుంది.
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా మనం ఏదైనా ప్రశ్న అడిగితే, ఆయనే సమాధానం ఇచ్చే అనుభూతి వచ్చేలా వీడియో సిస్టం ఏర్పాటుచేస్తున్నారు.
- విగ్రహాన్ని హనుమాన్ జంక్షన్ వద్ద శిల్పి ప్రసాద్ ఆధ్వర్యంలో కాస్టింగ్ చేశారు.
- స్థానిక కూలీలతో పాటు, ఢిల్లీ, బిహార్, రాజస్థాన్ నుంచి వచ్చిన 500–600ల మంది కూలీలు రెండేళ్లపాటు మూడు షిఫ్ట్‌ల్లో పనిచేశారు. ఈ పనులను 55 మంది సాంకేతిక నిపుణులు పర్యవేక్షించారు.

దేశానికే ఐకానిక్‌గా అంబేడ్కర్ విగ్రహం

మంత్రి మేరుగు నాగార్జున, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న టీజేఆర్, మేరుగు

సాక్షి, అమరావతి: విజయవాడ నగర నడిబొడ్డున దేశానికే ఒక ఐకానిక్‌గా బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేయడం యావత్ జాతి గర్వించదగిన విషయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. ఇది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై గౌరవంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించి పూర్తిచేసిన మహాయజ్ఞం అని అన్నారు. రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం రూ.2.50లక్షల కోట్లు అందజేసిన సామాజిక న్యాయ సంస్కర్త సీఎం వైఎస్ జగన్ అని ప్రశంసించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో కలిసి గురువారం మంత్రి మేరుగు నాగార్జున మీడియాతో మాట్లాడారు. 'దాదాపు రూ.400 కోట్లను వెచ్చించి ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల ఎత్తు విగ్రహం, మరో 81 అడుగుల పీఠంతో దేశానికే ఒక ఐకాన్‌లా అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రాజెక్టును నిర్మించారు. ప్రపంచ నలుమూలల ఉన్న అంబేడ్కరిస్టులు భారతదేశానికి వచ్చి విజయవాడలోని ఈ ప్రాజెక్టును సందర్శించేంత గొప్పగా తీర్చిదిద్దారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణతో జాతికి అంకితమిచ్చే కార్యక్రమానికి అందరూ తరలిరావాలి' అని మేరుగు నాగార్జున కోరారు. 'చంద్రబాబు దళితులను అడుగడుగునా చులకన చేస్తూ హీనాతిహీనంగా చూశారు. అందుకనే ఆయనకు అంబేడ్కర్ విగ్రహం పెట్టాలనే మనసు రాలేదు. ఇది ఈనాడు రామోజీరావుకు, ఎల్లో పత్రికలకు, టీవీలకు కనిపించదు. సిగ్గులేకుండా చంద్రబాబు తన పార్టీలో ఉన్న దళిత నేతలతో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై మాట్లాడిస్తున్నారు. చంద్రబాబు చెబితే ఆ పార్టీ నేతలు గొర్రెల్లా తలూపి, రూ.400 కోట్లతో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలా? అంటూ అవాకులు, చవాకులు మాట్లాడటం సిగ్గుచేటు. అసలు అంబేడ్కర్ విగ్రహం పెట్టలేనందుకు చంద్రబాబు సిగ్గుపడాలి..' అని మంత్రి మేగురు మండిపడ్డారు.

విగ్రహావిష్కరణకు తరలిరావాలి: ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

'దళితజాతి యావత్ ఎదురుచూస్తున్న మహా కార్యక్రమం విజయవాడలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ. ఈ కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా మొదలుపెట్టి పూర్తిచేసిన సీఎం జగన్‌కు దళిత జాతి రుణపడి ఉంటుంది. కులాలు, మతాలకతీతంగా అందరూ సామాజిక న్యాయ సమతామూర్తి విగ్రహావిష్కరణకు తరలిరావాలి. సీఎం జగన్ చేస్తున్న ఈ మహాయజ్ఞాన్ని అంతా ఆశీర్వదించాలని, అభినందించాలని ఆహ్వానిస్తున్నాం' అని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు చెప్పారు.

నాకు సుధాకర్‌బాబు సహకరిస్తారు: మంత్రి మేరుగు

రానున్న ఎన్నికల్లో సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా తనను పోటీ చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం జగన్ ఆదేశించారని, అక్కడ తమ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న టీజేఆర్ సుధాకర్‌బాబు కూడా తనకు అన్ని విధాలుగా సహకరించి పార్టీ గెలుపునకు పనిచేస్తారని చెప్పారని పేర్కొన్నారు.

నేడు బడుగు, బలహీనవర్గాల పండుగ

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రజాస్వామ్యవాదులంతా తరలిరావాలి
- అంబేడ్కర్ వారసుడిగా సీఎం జగన్ పరిపాలన
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్‌రావు



సాక్షి, అమరావతి: 'విజయవాడ నడిబొడ్డున ఈ నెల 19వ తేదీన అణగారిన, బడుగు, బలహీనవర్గాల పండుగ.. మన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పండుగ జరగనుంది. ఈ పండుగకు కులాలు, మతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజాస్వామ్యవాదులంతా తరలిరావాలి. వాడవాడలా అందరూ ఒక పెద్ద పండుగలా నిర్వహించుకోవాలి' అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచ మేధావి, గ్రేటెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహం దేశ చరిత్రలో ఒక గొప్ప చిహ్నం. అంబేడ్కర్ ఫిలాసఫీని ఆదర్శంగా తీసుకుని సీఎం జగన్ పాలన సాగిస్తున్నారు. దేశంలో జాతి, కుల, వర్ణ వివక్షను పటాపంచలు చేసే చట్టాలను అంబేడ్కర్ రూపొందించారు. ఆ చట్టాలను సీఎం జగన్ ఏపీలో పక్కాగా అమలు చేస్తూ అట్టడుగు వర్గాలకు ఆలంబనగా నిలిచారు. అణగారిన వర్గాలకు అండగా నేనున్నానని... డీబీటీ ద్వారా పేదలకు నేరుగా రూ.2.46 లక్షల కోట్లను అందించారు. పేద వర్గాలు సీఎం జగన్‌ను భుజానికెత్తుకుని ఈయనే అంబేడ్కర్ వారసుడు అని చెప్పుకునే విధంగా పాలన సాగిస్తున్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా ప్రజలు హాజరు కానున్నారు. అక్కడక్కడ చిన్న చిన్న విగ్రహాలు పెట్టుకున్న మనకు విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన ఈ విగ్రహం మనమంతా తలెత్తుకునేలా ఉంది. ఇంతకాలం సమానత్వం, స్వేచ్ఛ కోసం ఉద్యమాలు జరిగాయి. ఈ విగ్రహావిష్కరణ మన వెయ్యేళ్ల భవిష్యత్తుకు అంకురార్పణ కానుంది. ప్రతి ఒక్కరూ పండుగలా ఈ వేడుకను జరుపుకోవాలి..' అని జూపూడి ప్రభాకర్‌రావు చెప్పారు.

అభినవ అంబేడ్కర్ సీఎం జగన్

1,208వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బహుజన నేతలు

తాడికొండ: రాజకీయ రాజధాని విజయవాడ నగరం నడిబొడ్డులో సామాజిక న్యాయం–సమానత్వానికి పెద్దపీట వేసిన అభినవ అంబేడ్కర్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాదాభివందనం అని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,208వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యున్నత భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు నిజమైన నివాళులర్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 206 అడుగుల ఎత్తులో బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు సముచిత స్థానం కల్పించి విజయవాడ నడిబొడ్డులో విగ్రహం, స్మృతివనం, కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణం చేశారని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు మంత్రులుగా ఉండి కూడా బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించని చంద్రబాబును ప్రశ్నించలేని దళిత నేతలు నక్కా ఆనంద్ బాబు, వర్ల రామయ్య ఇంకా పలువురు దళిత ఎమ్మెల్యేలు, మంత్రులు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. నున్న కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజు, పులి దాసు, మాదిగాని గురునాథం, పల్లె బాబు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వాన్ని తెచ్చిన మహనీయుడు



విభిన్న ప్రాంతాలు, భిన్న మతాలు, భాషలతో వేరుగా ఉన్న అందరినీ కలిపి మనమంతా భారతీయులం అని చెప్పి భిన్నత్వంలో ఏకత్వాన్ని తీసుకువచ్చిన మహనీయుడు అంబేడ్కర్. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విజయవాడలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పడం గొప్ప విషయం. ఆయనకు సెల్యూట్ చేస్తున్నాను. ఇది సింబల్ ఆఫ్ పీస్.. సింబల్ ఆఫ్ సెక్యూరిటీ.. సింబల్ ఆఫ్ సెక్యులారిటీ. స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వాన్ని సీఎం జగన్ చూపించారు. ఈ విగ్రహం ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉంది.

– ఆర్.నారాయణమూర్తి, సినీ నటుడు, రచయిత, దర్శక, నిర్మాత

ప్రపంచంలోనే అత్యున్నత సాంస్కృతిక విప్లవ యోధుడు



ప్రపంచంలోనే అత్యున్నత సాంస్కృతిక విప్లవ యోధుడిగా లండన్ ఇండియన్ హౌస్‌లో బంగారు విగ్రహం గల గొప్ప వ్యక్తి బీఆర్ అంబేడ్కర్. ఆయనో మహోన్నత శిఖరం. ప్రపంచంలోని 129 దేశాల్లో ఆయన పేరు మార్మోగుతోంది. ఎన్నో దేశాల్లోని యూనివర్సిటీల్లో ఆయనపై చర్చ జరుగుతోంది. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం మేం పోరాటం చేస్తే.. నాడు చంద్రబాబు అడ్డుకున్నారు. సీఎం జగన్ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది.

– కత్తి పద్మారావు, ప్రముఖ రచయిత, అంబేడ్కరిస్ట్

ఇదో విజ్ఞాన దేవాలయం



దేశంలోని బడుగు, బలహీన వర్గాలు ఎక్కడికి పోయినా పుణ్యం రాదు. ఒక్కసారి మీ బిడ్డలతో కలిసి 'అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం' ప్రాంగణాన్ని సందర్శించండి. ఇది 3 వేల ఏళ్ల అంటరానితనంతో హక్కులు కోల్పోయి పోరాడిన వర్గాల కోసం ఏపీ ప్రభుత్వం నిర్మించిన స్ఫూర్తి నిలయం. ఈ ఆలయంలో ఒక్కసారి అడుగుపెడితే ప్రపంచాన్ని జయించే విజ్ఞానాన్ని, స్థైర్యాన్ని వరంగా పొందుతారు. ఇది అణచివేసిన వర్గాల కోసం మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రబాయిపూలే తర్వాత ఉద్ధరించడానికి వచ్చిన అంబేడ్కర్ సంకల్పానికి దక్కిన గౌరవం. అమెరికాలోని మార్టిన్ లూథర్‌కింగ్, చర్చిల్ మ్యూజియాలతో పోలిస్తే చాలా వినూత్నమైనది. పెద్దది కూడా.

– కంచ ఐలయ్య, ప్రముఖ రచయిత

అంబేడ్కర్ ఓ స్ఫూర్తి



అంబేడ్కర్ విగ్రహాన్ని మూర్తిగా కాకుండా.., స్ఫూర్తిగా తీసుకోవాలి. చాలా ప్రభుత్వాలు అంబేడ్కర్ గురించి మాట్లాడతాయి. కానీ, ఆయన విధానాలను ఆచరించవు. ఏపీ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వ భావాలను పెంపొందిస్తూ అంబేడ్కర్ లక్ష్యాల దిశగా అడుగులు వేస్తోంది. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగంలో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేసింది. అంబేడ్కర్ ఇంగ్లిష్ నేర్చుకోవడంతోనే ప్రపంచాన్ని అర్థం చేసుకున్నారు. గొప్ప రాజ్యాంగాన్ని అందించారు. అందుకే.. ఇంగ్లిష్ విషయంలో ఏపీ చేస్తున్న ప్రయత్నం గొప్పది.

– మల్లేపల్లి లక్ష్మయ్య, చైర్మన్, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్

అయోధ్యకు శ్రీవారి లడ్డూ ప్రసాదం సిద్ధం

తిరుమల: అయోధ్యలో ఈనెల 22న శ్రీరామచంద్రులవారి విగ్రహప్రతిష్ఠ, శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా భక్తులకు 25 గ్రాముల బరువు గల లక్ష చిన్న లడ్డూలను శ్రీవారి ప్రసాదంగా అందించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. ఇందుకోసం గురువారం తిరుమలలోని శ్రీవారి సేవాసదన్–1లో 350మంది శ్రీవారి సేవకులు ఒక్కో కవర్‌లో రెండు చిన్న లడ్డూలు చొప్పున ప్యాకింగ్ చేశారు. ఈ విధంగా మొత్తం 350 బాక్సులను సిద్ధం చేశారు. వీటిని అయోధ్యకు పంపనున్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో జనరల్ శివప్రసాద్, పోటు ఏఈవో శ్రీనివాసులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.


లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేస్తున్న శ్రీవారి సేవకులు

శ్రీశైలంలో ముగిసిన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 12న మొదలైన సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చివరి రోజు ముగింపు పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అశ్వవాహనసేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులను ఆలయ అలంకార మండపంలోకి తోడ్కొని వచ్చి అశ్వవాహనంపై ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజాది హారతులిచ్చారు. సంక్రాంతి రోజున నూతన వధూవరులైన పార్వతీ, మల్లికార్జున స్వామి వార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహించారు. ఆయా ఉత్సవాలతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

విద్యుత్ సంస్థల ప్రతిపాదనలపై 29 నుంచి ఏపీఈఆర్‌సీ విచారణ

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక, ట్రాన్స్‌మిషన్ టారిఫ్ ఆర్డర్ నివేదికపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఈ నెల 29 నుంచి 31 వరకు బహిరంగ విచారణ చేపట్టనుంది. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, విద్యుత్ పంపిణీ సంస్థలు, స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ గతేడాది నవంబర్‌లో తమ ప్రతిపాదనలను ఏపీఈఆర్‌సీకి నివేదించాయి. 2024–25వ ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాల నివేదిక, 2024–29 నియంత్రణ కాలానికి సంబంధించిన నెట్‌వర్క్ ఆదాయ అవసరాల నివేదికలను ఏపీఈఆర్‌సీకి సమర్పించాయి. వీటిపై ఈనెల 8 వరకు ఆన్‌లైన్‌లో ప్రశ్నలు స్వీకరించగా.. వాటికి విద్యుత్ సంస్థలు ఈనెల 17 వరకు సమాధానాలిచ్చాయి. ఈ ప్రతిపాదనలపై విశాఖలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీఈఆర్‌సీ బహిరంగ విచారణ చేపట్టనుంది. రోజూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు షెడ్యూల్ ప్రకారం కమిషన్ విచారిస్తుంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలో పాల్గొని తమ అభ్యంతరాలను తెలియజేసేందుకు ప్రజలకు అవకాశం కల్పించేందుకు అవసరమైన సమావేశం లింక్‌ను అందించాలని, ఈ మొత్తం బహిరంగ విచారణలు ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఏపీఈఆర్‌సీ ఆదేశించింది.

రికార్డు స్థాయిలో పాస్‌పోర్ట్ సేవలు

- కిక్కిరిసిపోతున్న విశాఖ ప్రాంతీయ కేంద్రం
- రోజుకు 1,290 అపాయింట్‌మెంట్స్
- 2023లో 1,98,577 పాస్‌పోర్టుల జారీ
- సాధారణ, తత్కాల్ దరఖాస్తుల గడువు 7 రోజులకు కుదింపు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో పాస్‌పోర్టు సేవలు మెరుగయ్యాయి. ముఖ్యంగా విశాఖ రీజనల్ పాస్‌పోర్ట్ కేంద్రంలో గతంలో మాదిరిగా నెలల తరబడి నిరీక్షణకు చెక్ చెబుతూ.. ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తూ.. దరఖాస్తుల క్లియరెన్స్‌పై దృష్టిసారించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేవారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రోజు రోజుకీ దరఖాస్తులు పెరుగుతున్నాయి. ఫలితంగా.. విశాఖ ఆర్‌పీవో కిక్కిరిసిపోతోంది. రోజుకు 1,290 అపాయింట్‌మెంట్స్ అందిస్తున్నారు. 2023లో ఏకంగా 1,98,577 పాస్‌పోర్టులు రికార్డు స్థాయిలో జారీ చేయడం విశేషం. ఇక్కడ నుంచి 13 జిల్లాలకు పాస్‌పోర్టు సేవలందుతున్నాయి. ఉపాధి, ఉన్నత విద్య, ఇతర అవసరాల కోసం విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. రోజులు, నెలల తరబడి కాళ్లరిగేలా తిరిగినా స్లాట్లు దొరికే పరిస్థితి ఉండేది కాదు. కానీ.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీసుకున్న కీలక నిర్ణయాలతో పాస్‌పోర్టు సేవలు సులువయ్యాయి. దళారుల ప్రమేయం లేకుండానే.. దరఖాస్తుదారుల చేతికి సులువుగా పాస్‌పోర్టు లభిస్తోంది. రాష్ట్రంలోని ప్రధానమైన విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రంలో తత్కాల్, సాధారణ అపాయింట్‌మెంట్లను పెంచి, కాలపరిమితిని తగ్గించడంతో పాటు శనివారం కూడా సేవలు అందిస్తుండటంతో.. పాస్‌పోర్టుల జారీ ప్రక్రియ కూడా వేగవంతమైంది. మరోవైపు పోలీసుల వెరిఫికేషన్ ప్రక్రియ కూడా త్వరితగతిన పూర్తి చేస్తూ.. క్లియరెన్స్ సర్టిఫికెట్స్(పీసీసీ) ఇస్తున్నారు. ఈ సంస్కరణల కారణంగా.. విశాఖపట్నం పాస్‌పోర్టు కేంద్రాల్లో పనితీరు జోరందుకుంది.

2023లో 1,98,577 పాస్‌పోర్టుల జారీ

పాత నిబంధనల ప్రకారం పాస్‌పోర్టు కోసం, పోలీస్ విచారణ కోసం నెలల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ప్రజల సౌలభ్యం కోసం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు దరఖాస్తుతో పాటు నాలుగు పత్రాలుంటే వారం రోజుల్లో పాస్‌పోర్ట్ చేతిలో ఉంటుంది. ఆధార్‌కార్డు(ఇందులో డేట్ ఆఫ్ బర్త్ కచ్చితంగా ఉండాలి). ఎలక్ట్రానిక్ ఫొటో ఐడెంటిటీ కార్డు, పాన్ కార్డు ఉండాలి. వీటితో పాటుగా స్థానికత, క్రిమినల్ రికార్డు, ఇంటి చిరునామాతో కూడిన వివరాలు పొందుపరిచి ఉండేలా లాయర్ అఫిడవిట్ ఉంటే చాలు. వీటిలో ఉన్న సమాచారం నిజమని నిర్ధారించుకున్న వెంటనే పాస్‌పోర్టు ఇస్తున్నారు. విశాఖ ప్రాంతీయ కేంద్రంలో పాస్‌పోర్ట్, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికేట్స్ కోసం రోజుకు సగటున 1,290 వరకూ అపాయింట్‌మెంట్స్ ఇచ్చి దరఖాస్తుల్ని పరిశీలిస్తున్నారు. 2023 జనవరి సమయంలో దరఖాస్తు చేసుకుంటే అపాయింట్‌మెంట్ 25 పనిదినాల్లోపు ఇచ్చేవారు. ఇప్పుడు కేవలం ఒక్క రోజులో ఇస్తున్నారు.



ఏపీలో పాస్‌పోర్టు సేవలిలా..

విశాఖ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ పరిధిలో..

పాస్‌పోర్టు సేవా కేంద్రాలు	02
పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు	07
రోజుకు అపాయింట్‌మెంట్స్	1,290

పాస్‌పోర్టులు, పోలీస్ క్లియరెన్స్ (పీసీసీ) సర్టిఫికెట్ల జారీ పెరిగిందిలా..

సంవత్సరం	పాస్‌పోర్టుల జారీ	పీసీసీ జారీ	మొత్తం
2020	70,331	2,222	72,553
2021	1,08,809	4,025	1,12,834
2022	1,71,318	20,054	1,91,372
2023	1,98,577	24,410	2,22,987

పీవో పీఎస్‌కేల పరిధిలో విస్తృతంగా సేవలు..

ఏడాదిన్నర కిందట తపాలా కార్యాలయాల్లోనూ పాస్‌పోర్టు సేవలు అందుబాటులోకొచ్చాయి. విశాఖ ఆర్‌పీవో పరిధిలో రెండు పాస్‌పోర్టు సేవా కేంద్రాలతో పాటు ఏడు పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీవోపీఎస్‌కే) ఉన్నాయి. ఈ పీవోపీఎస్‌కేల ద్వారానే పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్స్(పీసీసీ) స్లాట్లు కూడా జారీ చేస్తుండటంతో పరిశీలన ప్రక్రియ మరింత సులభంగా మారింది. విశాఖ ఆర్పీవో పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, యానాం జిల్లాలున్నాయి.

పారదర్శకంగా సేవలు



దరఖాస్తుదారులకు సమీప తేదీల్లో అపాయింట్‌మెంట్ ఉండేలా చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రెన్యువల్ కోసం చివరి తేదీ వరకూ ఆలస్యం చేస్తుండటం సరికాదు. ఆరు నెలల ముందుగానే దరఖాస్తు చేసుకుంటే.. పాత పాస్‌పోర్టు గడువు ముగిసేలోగా కొత్త పాస్‌పోర్టు మంజూరవుతుంది. ఏదైనా విచారణ కోసం ఆర్‌పీవోకి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 లోపు ఎలాంటి అపాయింట్‌మెంట్ లేకపోయినా హాజరుకావచ్చు.

– విశ్వంజలి గైక్వాడ్, విశాఖ ఆర్‌పీవో అధికారి

వచ్చే ఏడాది నాటికి బాల కార్మిక రహిత రాష్ట్రంగా ఏపీ

బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది నాటికి బాల కార్మిక రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు. భారత కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) సహకారంతో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై గురువారం విజయవాడలో నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాపును ఉద్దేశించి అప్పారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బాలలను పని నుంచి విముక్తి చేయడం, పునరావాసం కల్పించడం, వారి కుటుంబాలతో మమేకం చేయడం, కాపాడిన పిల్లలను బడిలో చేర్పించే విషయంలో ఆంధ్రప్రదేశ్ ముందుందన్నారు. బాల కార్మికులను చేర్చుకునే సంస్థల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అదే సమయంలో పిల్లలు పనులలో చేరడానికి గల కారణాలను లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ద్వారా పిల్లలు బడి మానివేయకుండా, బాల్య వివాహాలు జరక్కుండా, బాలలు పనులకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత మాట్లాడుతూ.. ఒక్క 2023లోనే సీఐడీ, విద్యా శాఖ, కార్మిక, రెవెన్యూ, ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, బీబీఏ తదితర స్వచ్ఛంద సంస్థల సహకారంతో నాలుగు విడతలుగా ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించి 1,506 మంది బాల కార్మికులను గుర్తించామన్నారు. 16 రాష్ట్రాలకు చెందిన సుమారు 250 మంది పిల్లలు ఏపీలో బాల కార్మికులుగా దయనీయమైన జీవితం గడుపుతున్నారని చెప్పారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య కింద బాల కార్మికులకు పనినుంచి విముక్తి కల్పించి వారి సంరక్షణ, పునరావాసం, మళ్లీ బడిలో చేర్పడం వంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.లక్ష్మీనారాయణ, ఎన్‌ఎసీజీ, ఎస్‌ఏవీఏసీ చైర్మన్ సంజయ్‌గుప్తా, చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ పి. ఫ్రాన్సిస్, బీబీపీ కో–ఆర్డినేటర్ జి.తిరుపతిరావు, డీఓజేడబ్ల్యూ మధుసూదనరావు పాల్గొన్నారు.

బీసీల రాజ్యం జగనన్నకే సాధ్యం

- మత్స్యకారుల అభివృద్ధికి కృషి
- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: బీసీల రాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే సాధ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో– ఆర్డినేటర్ కూడా అయిన మంత్రి గురువారం ధవళేశ్వరం బస్టాండ్ సెంటర్ నుంచి మత్స్యకారులతో కలిసి జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపం వరకు పాదయాత్ర చేశారు. మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. సమాజంలో బీసీలు వెనుకబడిన వారు కాదని, వెన్నెముక వంటి వారని గుర్తించిన ఏకైక నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పేదలు, సంపన్నులు అనే భేదం లేకుండా దేశ సంపద అందరికీ సమానంగా చేరిన నాడే వారి జీవితానికి భద్రత, భరోసా ఉంటాయనే లక్ష్యంతో అంబేడ్కర్ గొప్ప రాజ్యాంగాన్ని అందించారన్నారు. విజయవాడలో ఆ మహనీయుని 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని సీఎం జగన్ శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించనున్నారని చెప్పారు. సరిగ్గా ఇదే రోజు నుంచే రాష్ట్రంలో కుల గణన ప్రక్రియ ప్రారంభిస్తున్నామని మంత్రి వేణు తెలిపారు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా బలహీన వర్గాల కుటుంబాలు ప్రయోజనం పొందాయన్నారు. మత్స్యకారులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించిందని, వారు ఆర్థికంగా బలపడేందుకు మరిన్ని కార్యక్రమాలు అమలు చేయనుందని వివరించారు. ధవళేశ్వరం బోట్‌మెన్, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు మేరుగు సత్తిబాబు, కార్యదర్శి తెడ్డు ఆనంద్, కోశాధికారి బొడ్డు శ్రీను, మత్స్యకార, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


మత్స్యకారులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ఏపీఎస్ఎస్‌డీసీకి 'స్కోచ్' అవార్డు


అవార్డు అందుకున్న అన్నమయ్య జిల్లా ఏపీఎస్ఎస్‌డీసీ అధికారి హరికృష్ణను అభినందిస్తున్న ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి, సీఈవో వినోద్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చే విధంగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిల్లో ఏర్పాటు చేస్తున్న స్కిల్ హబ్, ప్రతీ పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న స్కిల్ కాలేజీలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) అన్నమయ్య జిల్లాలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్, కాలేజీ ద్వారా జరిగే కార్యక్రమాలకు, మౌలిక సదుపాయలకు స్కోచ్ గ్రూపు స్కోచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ అవార్డును ప్రకటించింది. అన్నమయ్య జిల్లాలో ప్రధానంగా ఉన్న పరిశ్రమలను దృష్టిలో పెట్టుకొని అప్పరెల్, కన్‌స్ట్రక్షన్ , మేనేజ్‌మెంట్, హెల్త్, మెడికల్‌తో పాటు వినోద రంగాల్లో శిక్షణ అందిస్తోంది. అన్నమయ్య జిల్లాకు స్కోచ్ అవార్డు రావడంపై ఏపీఎస్‌ఎస్‌డీసీ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, ఎండీ సీఈవో వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. చైర్మన్ అజయ్ రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డ్ అందుకోవడం సంస్థ పనితీరుకు నిదర్శనమని, ముున్ముందు సాంకేతికతను పెంచి మరిన్ని నైపుణ్యాలను అందిస్తామని తెలిపారు. ఎండీ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఇది ఆరంభం మాత్రమేనని మిగిలిన అన్ని జిల్లాల్లో కూడా ఐఎస్‌ఓ స్టాండర్డ్ క్వాలిటీకి అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను అమలు చేస్తామని పేర్కొన్నారు.

స్థానికులకే ఎంపీ టికెట్ ఇవ్వాలి

అయ్యన్నపాత్రుడి తనయుడు చింతకాయల విజయ్

నర్సీపట్నం: బయట నుంచి వచ్చిన వ్యక్తులకు కాకుండా స్థానికుడైన తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలని చంద్రబాబును కోరినట్టు మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడి తనయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొత్తగా ఎంపీ టికెట్ ఇవ్వాలని అడగటం లేదని, పదేళ్లుగా అడుగుతూనే ఉన్నామన్నారు. 2014, 2019 ఎన్నికల్లో ఆశించినప్పటికీ ఎంపీ టికెట్ ఇవ్వలేదన్నారు. పార్టీ అధిష్టానం తనను టీడీపీ స్టేట్ జనరల్ సెక్రటరీగా నియమించగా.. ఈ నాలుగున్నరేళ్లలో పార్టీ కోసం పోరాటం చేసి, అనేక కేసులు ఎదుర్కొన్నానని చెప్పారు. కార్యకర్తగా, జనరల్ సెక్రటరీగా ఎంపీ టికెట్ కోసం అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నానన్నారు. బయటి నుంచి వచ్చిన నూకారపు సూర్యప్రకాశరావు వంటి అనేక మందికి ఎంపీ టికెట్లు ఇచ్చారని, ఎన్నికల తరువాత వారు మొహం చాటేస్తున్నారని పేర్కొన్నారు. 15 ఏళ్లుగా అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం మోసానికి గురవుతోందన్నారు. చిన్నప్పటి నుంచి తనకు పార్లమెంట్‌పై స్పష్టమైన అవగాహన ఉందని, బయటి వాళ్లను ఎంకరేజ్ చేయకుండా అధిష్టానం తనకు టికెట్ ఇస్తుందని ఆశిస్తున్నానని విజయ్ పేర్కొన్నారు. తన తండ్రి అయ్యన్నపాత్రుడు సహకారంతో పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఏపీ కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా మాజీమంత్రి పళ్లంరాజు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను సిద్ధం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు మేనిఫెస్టో కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మేనిఫెస్టో కమిటీలో పళ్లంరాజుతోపాటు మరో 10 మంది సభ్యులు ఉన్నారు. బాపిరాజు, జేడీ శీలం, తులసిరెడ్డి, కమలమ్మ, జంగా గౌతమ్, ఉషానాయుడు, నజీరుద్దీన్, కొరివి వినయ్‌కుమార్, డాక్టర్ గంగాధర్, కారుమంచి రమాదేవి మేనిఫెస్టో కమిటీలో సభ్యులుగా ఉంటారు. కాగా.. వీరితోపాటు ఏపీ కాంగ్రెస్ ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్ అధిపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా వ్యవహరిస్తారు.

గర్భగుడిలోకి రామ్‌లల్లా

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్టకు శరవేగంగా ఏర్పాట్లు

- ఐదేళ్ల బాలుడి రూపంలో దర్శనమివ్వనున్న శ్రీరాముడు
- ఆలయ ప్రాంగణంలో పటిష్టమైన భద్రతా చర్యలు

అయోధ్య/న్యూఢిల్లీ: అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్టకు ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం కీలక ఘట్టం ముగిసింది. రామ్‌లల్లా విగ్రహాన్ని క్రేన్ సాయంతో భవ్యమందిరంలోని గర్భగుడిలోకి చేర్చారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ప్రధాన వేదికపై ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక అత్యంత కీలకమైన ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరగాల్సి ఉంది. గర్భగుడిలో రామ్‌లల్లా విగ్రహాన్ని వస్త్రంతో కప్పి ఉంచారు. మొబైల్ ఫోన్లు, కెమెరాలతో ఎవరినీ లోపలికి అనుమతించడం లేదు. ఆలయ ప్రాంగణంలో ఉత్తరప్రదేశ్ ప్రత్యేక భద్రతా బలగాలు మోహరించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అనధికార వ్యక్తులు ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ప్రాణప్రతిష్ట తర్వాత బాలరాముడికి నిత్యం ఐదుసార్లు ప్రత్యేక హారతి ఇస్తారు. విగ్రహంపై దుస్తులను ప్రతిరోజూ మారుస్తారు. మొదటి, చివరి హారతి సందర్భంగా రాముడు ప్రత్యేక దుస్తుల్లో దర్శనమిస్తాడు.

నిర్విఘ్నంగా కొనసాగుతున్న క్రతువులు

ప్రత్యేక క్రతువులు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. అయోధ్యలో మూడో రోజు గురువారం ఆచార్యులు ఆలయ ప్రాంగణంలో గణేశ్ పూజ, వరుణ పూజ, వాస్తు పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. జలదివస్‌లో భాగంగా రామ్‌లల్లా విగ్రహాన్ని నీటితో శుభ్రం చేశారు.

రామ్‌లల్లా విశిష్టతలివే..

- అయోధ్య రామాలయంలో ప్రతిష్ఠించబోయే బాలరాముడి విగ్రహం ఎత్తు 51 అంగుళాలు.
- కృష్ణ శిల(నల్ల రాయి) నుంచి ఈ విగ్రహాన్ని కర్ణాటకలోని మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కారు.
- రామ్‌లల్లాను చెక్కిన శిల బరువు దాదాపు 200 కిలోలు.
- ఐదేళ్ల బాలుడి రూపంలో రామ్‌లల్లా విగ్రహాన్ని రూపొందించారు.
- గర్భాలయంలో నిల్చున్న రూపంలోనే రామ్‌లల్లా దర్శనమిస్తాడు.
- విగ్రహ ప్రాణప్రతిష్ట ఈ నెల 22వ తేదీన.. సోమవారం మధ్యాహ్నం 12.20 గంటల నుంచి ఒంటి గంట మధ్య అభిజిత్ ముహూర్తంలో జరుగుతుంది.
- ప్రాణప్రతిష్ట సందర్భంగా గర్భగుడిలోకి కొందరికే ప్రవేశం ఉంటుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, అయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మహంత్ నృత్యగోపాల్ మహారాజ్ మాత్రమే గర్భాలయంలోకి ప్రవేశిస్తారు. ఆలయ ట్రస్టీలు 'గర్భగృహం' అని పిలిచే పవిత్ర ప్రాంతంలో ఆసీనులవుతారు.
- ఆలయ ప్రాణప్రతిష్ఠకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధాన యజమాని(కర్త)గా వ్యవహరిస్తారు.
- ఈ నెల 23వ తేదీ నుంచి గర్భాలయంలో బాలరాముడిని సామాన్య భక్తులు దర్శించుకోవచ్చు.


అయోధ్యలో శ్రీ హనుమాన్ మహాయాగం దృశ్యం


ఉత్సవాల్లో పాల్గొనేందుకు నేపాల్ నుంచి వచ్చిన మహిళలు


హనుమాన్ మహాయాగంలో పాల్గొనేందుకు అయోధ్యకు వచ్చిన బాలలు


భక్తి పారవశ్యంతో పాటలు పాడుతున్న భక్తులు


గర్భగుడిలోకి రామ్‌లల్లా విగ్రహాన్ని తీసుకువస్తున్న నిర్మాణ సిబ్బంది


తపాలా స్టాంపులు విడుదల చేస్తున్న ప్రధాని మోదీ

అయోధ్య ఆలయంపై పోస్టల్ స్టాంప్‌లు విడుదల

అయోధ్య భవ్య రామమందిరానికి సంబంధించిన పోస్టల్ స్టాంప్‌లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం విడుదల చేశారు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు శ్రీరాముడిపై జారీ చేసిన స్టాంప్‌లతో కూడిన పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఇవి కేవలం కాగితం ముక్కలు కాదని, చరిత్రాత్మక సంఘటనలను భవిష్యత్తు తరాలకు తెలియజేయడానికి ఉపయోగపడే మాధ్యమాలు అని చెప్పారు. చరిత్ర పుస్తకాలకు, పురాణ గాథలకు, గొప్ప ఆలోచనలకు సూక్ష్మరూపాలు అని తెలిపారు. మోదీ మొత్తం ఆరు రకాల స్టాంప్‌లను మోదీ విడుదల చేశారు. అయోధ్య రామాలయం, వినాయకుడు, హనుమంతుడు, జటాయు, శబరి మాత, కేవట్ రాజ్‌పై వీటిని ముద్రించారు. 48 పేజీల స్టాంప్ బుక్‌ను మోదీ విడుదల చేశారు. అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, కెనడా, కాంబోడియా తదితర దేశాలు, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు ముద్రించిన శ్రీరాముడి స్టాంప్‌ల చిత్రాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. రాముడు, సీత, రామాయణం అనేవి సరిహద్దులకు, కాలానికి, కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతం అని ప్రధాని మోదీ చెప్పారు. రామాయణం, రాముడి వ్యక్తిత్వం భూమిపై పర్వతాలు, నదులు ఉన్నంత కాలం ప్రజలను ప్రభావితం చేస్తూనే ఉంటాయని వ్యాఖ్యానించారు. విదేశాలు సైతం రాముడిపై పోస్టల్ స్టాంప్‌లు ముద్రించాయని, వేర్వేరు నాగరికతలను రాముడు ప్రభావితం చేశాడని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భిన్న సంస్కృతుల ప్రజలకు రాముడు ఆరాధ్య దైవంగా మారాడని వివరించారు.

ఫిరోజాబాద్ నుంచి 10 వేల గాజులు, బ్రేస్‌లెట్లు

ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ నుంచి 10,000కుపైగా ప్రత్యేక గాజులు, బ్రేస్‌లెట్లను గురువారం అయోధ్యకు చేర్చారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేశారు. మహిళలు, పురుషులు చేతులకు ధరించే గాజులు, బ్రేస్‌లెట్ల తయారీకి ఫిరోజాబాద్ ఎంతో పేరుగాంచింది. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట వేడుక కోసం ఫిరోజాబాద్ వ్యాపారులు రాముడు, సీత, హనుమంతుడి చిత్రాల తో కూడిన 10 వేల గాజులు, బ్రేస్‌లెట్లను ప్రత్యేకంగా తయారు చేయించారు. ప్రాణప్రతిష్ట వేడుక తర్వాత వీటిని ట్రస్టు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తారు. ఈ గాజులను పెళ్లిలో నూతన వధువులు ధరించాలని ఫిరోజాబాద్ వ్యాపారులు సూచించారు.

దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారం

అయోధ్యలో ప్రాణప్రతిష్ట వేడుక దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఈ నెల 22న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమాన్ని టీవీల్లో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. డీడీ న్యూస్ తోపాటు డీడీ జాతీయ చానళ్లన్నింటిలో లైవ్ టెలికాస్ట్ జరుగుతుంది. దూరదర్శన్ సౌజన్యంతో ప్రైవేట్ చానళ్లలోనూ ప్రసారమవుతుంది. అయోధ్యలో 40 కెమెరాలను దూరదర్శన్ ఏర్పాటు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల్లోనూ ప్రత్యక్ష ప్రసారం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కఠిన నియమాలు పాటిస్తున్న ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్రమోదీ నిత్యం కేవలం నేలపైనే నిద్రిస్తున్నారు. కేవలం కొబ్బరి నీళ్లు మాత్రమే తాగుతున్నారు. 11 రోజుల ప్రత్యేక అనుష్ఠానంలో భాగంగా ఆయన కఠిన నియమాలు పాటిస్తున్నారు. సాత్వికాహారం స్వీకరిస్తున్నారు. సమయం చిక్కినప్పుడల్లా రామనామం జపిస్తున్నారు. తన నివాసంలో రాముడికి పూజలు చేస్తున్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి ప్రధాన యజమానిగా వ్యవహరించనున్న మోదీ ఈ నెల 12న ప్రత్యేక అనుష్ఠానం ప్రారంభించిన సంగతి తెలిసిందే. 22న రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠతో మోదీ అనుష్ఠానం ముగుస్తుంది.

22న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు 'సగం రోజు సెలవు'

దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కేంద్ర పారిశ్రామిక సంస్థలకు ఈ నెల 22వ తేదీన సగం రోజు సెలవు ప్రకటించారు. అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ట నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రాణప్రతిష్ఠకు సంబంధించిన వేడుకల్లో ఉద్యోగులు పాల్గొనేందుకు వీలుగా వారి విజ్ఞప్తి మేరకు కార్యాలయాలకు సగం రోజు సెలవు ఇస్తున్నారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 22న మధ్యాహ్నం 02.30 గంటల వరకు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను మూసివేస్తారు. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, బీమా సంస్థలకూ 22న సగం రోజు సెలవే.

వాతావరణ శాఖ వెబ్‌పేజీ ప్రారంభం

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట వేడుకకు మరో నాలుగు రోజులే మిగిలి ఉంది. అయోధ్య నగరంతోపాటు పరిసర ప్రాంతాల వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రతలు, తేమ, చలి తీవ్రత వంటి సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేయడానికి భారత వాతావరణ శాఖ(ఐఎండీ) గురువారం ప్రత్యేక వెబ్‌పేజీను ప్రారంభించింది. హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, చైనీస్, ఫ్రెంచ్, స్పానిష్ తదితర భాషల్లో ఇందులో సమాచారం అందుబాటులో ఉంటుంది.

ఉజ్జయిని నుంచి 5 లక్షల లడ్డూలు

అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం కోసం మధ్యప్రదేశ్‌లోని ప్రఖ్యాత ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయంలో 5 లక్షల లడ్డూలు సిద్ధం చేశారు. శుక్రవారం వీటిని నాలుగు వాహనాల్లో అయోధ్యకు పంపించనున్నట్లు ఆలయ వర్గాలు తెలియజేశాయి. ఈ నెల 22న ప్రాణప్రతిష్ట సందర్భంగా వీటిని భక్తులకు పంపిణీ చేస్తారు.

ఇరాన్‌పై పాక్ ప్రతీకార దాడి

సియెస్తాన్–బలోచిస్తాన్ ప్రావిన్స్‌లో 9 మంది మృతి

ఇస్లామాబాద్: ఇరాన్ బుధవారం జరిపిన దాడులకు గురువారం పాక్ ప్రతీకారం తీర్చుకుంది. సరిహద్దులకు సమీపంలోని ఇరాన్ సియెస్తాన్–బలోచిస్తాన్ ప్రావిన్స్‌లో దాడులు జరిపింది. ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా రాకెట్లు, డ్రోన్లతో చేపట్టిన 'ప్రెసిషన్ మిలటరీ స్ట్రయిక్స్'లో బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ, బలోచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్‌లకు చెందిన 9 మంది ఉగ్రవాదులు చనిపోయినట్లు సమాచారం ఉందని పాక్ ఆర్మీ వెల్లడించింది. ఈ ఘటనను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. పాకిస్తాన్‌కు తమ నిరసన తెలిపినట్లు ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. పాక్ దాడుల్లో ఇరానేతర జాతీయులైన ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు, నలుగురు చిన్నారులు చనిపోయినట్లు అధికార వార్తా సంస్థ ఇర్నా పేర్కొంది. పాక్ కేంద్రంగా పనిచేస్తూ తమ దేశంలో ఉగ్రదాడులకు తెగబడుతున్న జైష్ అల్–అదిల్ ఉగ్రసంస్థ స్థావరాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణి దాడులతో బుధవారం విరుచుకుపడింది. ఈ దాడులకు నిరసనగా పాక్ తమ దేశంలోని ఇరాన్ రాయబారిని బహిష్కరించడంతోపాటు ఇరాన్‌లోని తమ రాయబారిని వెనక్కి పిలిపించుకున్న విషయం తెలిసిందే. పాకిస్తాన్ భూభాగంపై ఇరాన్ దాడులను భారత్ సమర్థించింది. ఉగ్రవాదాన్ని అంతమొందించాలన్న తమ వైఖరిలో మార్పు లేదని స్పష్టం చేసింది. ఇది ఆ రెండు దేశాలకు సంబంధించిన విషయమే అయినప్పటికీ, దేశాలు తమ ఆత్మరక్షణ కోసం తీసుకునే చర్యలను భారత్ అర్థం చేసుకుందని పేర్కొంది.

కాన్పూర్ ఐఐటీలో మరో ఆత్మహత్య

కాన్పూర్: కాన్పూర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లో మరో విద్యార్థి బలవన్మరణం చెందారు. పీహెచ్‌డీ చేస్తున్న ప్రియాంకా జైస్వాల్(29) గురువారం హాస్టల్‌లోని తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. జార్ఖండ్‌లోని దుమ్కాకు చెందిన జైస్వాల్ గత ఏడాది డిసెంబర్ 29వ తేదీన కెమికల్ ఇంజనీరింగ్ పీహెచ్‌డీలో చేరారు. 'గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు మాకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లిన పోలీసులు రూం లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో తలుపులు పగులగొట్టారు. సీలింగ్ ఫ్యాన్‌కు ప్రియాంకా జైస్వాల్ విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు'అని డీసీపీ పటేల్ చెప్పారు. నెల రోజుల వ్యవధిలో క్యాంపస్‌లో జరిగిన మూడో ఆత్మహత్య ఇది. జనవరి 11వ తేదీన వికాస్ కుమార్ మీనా(31) అనే ఎంటెక్ సెకండియర్ విద్యార్థి హాస్టల్‌లోని తన గదిలో ఉరేసుకున్నాడు. పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైనట్లు సమాచారం. గత ఏడాది డిసెంబర్ 19 పల్లవి చిల్కా(34) అనే పరిశోధక విద్యార్థిని కూడా హాస్టల్‌లోని తన గదిలో ఉరేసుకున్నారు.

లొంగిపోయేందుకు గడువివ్వండి

సుప్రీంకోర్టులో బిల్కిస్ బానో కేసు దోషుల పిటిషన్

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో కేసులో దోషులు లొంగిపోయేందుకు తమకు మరింత గడువు కావాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో 2002లో మత కలహాల సమయంలో బిల్కిస్‌బానోపై గ్యాంగ్ రేప్‌నకు పాల్పడటంతోపాటు ఆమె కుటుంబంలోని ఏడుగురిని హత్య చేసిన కేసులో 11 మంది దోషులకు కోర్టు యావజ్జీవ జైలు శిక్ష విధించింది. అయితే వారికి గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటించి 2022లో విడుదల చేయడం, ఆ నిర్ణయాన్ని నిలుపుదల చేస్తూ ఈ నెల 8న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు దోషులు రెండు వారాల్లోగా తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంది. అయితే, అనారోగ్యం, కుమారుడి వివాహం, అత్యవసర వ్యవసాయ పనులు వంటి కారణాలు చూపుతూ 11 మంది దోషుల్లో అయిదుగురు లొంగుబాటుకు మరింత గడువు కావాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. జనవరి 21వ తేదీతో లొంగుబాటు గడువు ముగియనున్నందున అత్యవసరంగా శుక్రవారం విచారణ చేపట్టాలని కోరారు. గురువారం వీరి పిటిషన్ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సంజయ్ కరోల్‌ల ధర్మాసనం ముందుకు రాగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎదుట ఉంచాలని వారు రిజిస్ట్రీని కోరారు. ఈ కేసు విచారణకు కొత్త ధర్మాసనం ఏర్పాటుపై ఆయన ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సిబ్బందిని పొట్టనబెట్టుకుంది అతడే

1990లో ఘటనలో యాసిన్ మాలిక్‌ను గుర్తు పట్టిన ప్రత్యక్ష సాక్షి

జమ్మూ: శ్రీనగర్‌లో 1990 జనవరి 25వ తేదీన భారత వైమానిక దళం(ఐఏఎఫ్) సిబ్బందిపై కాల్పులు జరిపింది జేకేఎల్‌ఎఫ్ చీఫ్ యాసిన్ మాలిక్ అని ప్రత్యక్ష సాక్షి ధ్రువీకరించారు. ఆ రోజు ఘటన జరిగిన తీరును గురువారం ఐఏఎఫ్ మాజీ కార్పొరల్ రాజ్వర్ ఉమేశ్వర్ సింగ్ ప్రత్యేక సీబీఐ కోర్టుకు చెప్పారు. శ్రీనగర్ వైమానిక కేంద్రానికి వెళ్లేందుకు ఐఏఎఫ్ సిబ్బంది 1990 జనవరి 25వ తేదీ ఉదయం రావల్‌పొరాలో వాహనం కోసం ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో యాసిన్ మాలిక్‌తోపాటు కొందరు ఉగ్రవాదులు అక్కడికి చేరుకున్నారు. యాసిన్ మాలిక్ తన దుస్తుల్లో నుంచి తుపాకీని బయటకు తీసి, యథేచ్ఛగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో స్క్వాడ్రన్ లీడర్ రవి ఖన్నా సహా నలుగురు నేలకొరగ్గా మరో 40 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఉమేశ్వర్ సింగ్ ఒకరు. తీహార్ జైలులో ఉన్న యాసిన్ మాలిక్ గురువారం జరిగిన కోర్టు విచారణకు వర్చువల్‌గా పాల్గొన్నాడు. ప్రత్యక్ష సాక్షిని క్రాస్ ఎగ్జామిన్ చేయొచ్చని కోర్టు ఇచ్చిన అవకాశాన్ని యాసిన్ మాలిక్ తిరస్కరించాడు. తనను కోర్టులో ప్రత్యక్షంగా హాజరుపరచాలని కోరాడు. ఈ కేసులో మాలిక్, మరో అయిదుగురిపై 1990 ఆగస్ట్ 31వ తేదీన జమ్మూలోని టాడా కోర్టులో చార్జిషీటు దాఖలైంది. 1989లో అప్పటి కేంద్ర మంత్రి ముఫ్తీ మహ్మద్ సయీద్ కుమార్తె రుబియా కిడ్నాప్, నేవీ అధికారులపై కాల్పుల కేసులు యాసిన్ మాలిక్‌పై ఉన్నాయి.


ఏడెన్ పోర్టు సమీపంలో నౌకపై డ్రోన్ దాడి

తక్షణమే స్పందించిన భారత నావికాదళం

న్యూఢిల్లీ: ఏడెన్ సింధుశాఖ సమీపంలో మార్షల్ ఐల్యాండ్‌కు చెందిన వాణిజ్య నౌకపై బుధవారం అర్ధరాత్రి డ్రోన్ దాడి చోటుచేసుకుంది. బాధిత నౌక ఎంవీ గెంకో పికార్డీ నుంచి విపత్తులో ఉన్నామన్న సమాచారం అందుకున్న భారత నావికాదళం సత్వరమే స్పందించింది. హిందూ మహా సముద్రంలోని ఏడెన్ పోర్టుకు 60 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నౌకలో 9 మంది భారతీయులు సహా మొత్తం 22 మంది సిబ్బంది ఉన్నారు. వారికి ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదని నౌకలో మంటలను వెంటనే ఆర్పి వేసినట్లు అధికారులు తెలిపారు. ఎర్ర సముద్రం, అరేబియా సముద్ర జలాల్లో ఇటీవలి కాలంలో వాణిజ్య నౌకలపై దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఎంవీ గెంకో పికార్డీ నుంచి బుధవారం అర్ధరాత్రి 11.11 గంటలకు ప్రమాద సమాచారం అందిన వెంటనే నేవీకి చెందిన యుద్ధనౌక ఐఎన్‌ఎస్ విశాఖపట్నం వెంటనే పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే నిపుణుల బృందంతో బయలుదేరింది. 12.30 గంటలకల్లా ఘటనా ప్రాంతానికి చేరుకుంది. నిపుణులు ఎంవీ గెంకో పికార్డీలో క్షుణ్నంగా తనిఖీలు జరిపారు. ఎలాంటి ప్రమాదం లేదని ధ్రువీకరించారు. దీంతో నౌక తన ప్రయాణాన్ని తిరిగి కొనసాగించిందని అధికారులు చెప్పారు. జనవరి 5న అరేబియా సముద్రంలో ఎంవీ లిలా నార్‌ఫోక్ అనే లైబీరియా నౌకను నేవీ సిబ్బంది హైజాకర్ల నుంచి కాపాడారు. డిసెంబర్ 23న ఎర్ర సముద్రంలో భారత్ వైపు చమురుతో వస్తున్న ఎంవీ చెక్ ప్లుటో అనే నౌకపై డ్రోన్ దాడి జరిగిన విషయం తెలిసిందే.

ఫ్లయిట్ అటెండెంట్‌కు ప్రెసిడెంట్ హోదా

జపాన్ ఎయిర్‌లైన్స్ అరుదైన నియామకం



టోక్యో: జపాన్‌కు చెందిన అంతర్జాతీయ విమానయాన సంస్థ 'జపాన్ ఎయిర్ లైన్స్'అరుదైన నిర్ణయం తీసుకుంది. సంస్థలో రెండో అత్యున్నత స్థాయి హోదా అయిన ప్రెసిడెంట్‌గా మాజీ మహిళా ఫ్లయిట్ అటెండెంట్‌ను నియమించింది. ఈమె ఏప్రిల్ ఒకటిన ప్రస్తుత ప్రెసిడెంట్ యూజి అకసావ స్థానంలో బాధ్యతలు చేపడతారు. ప్రస్తుత చైర్మన్ యోషిహరు స్థానంలో అకసావ చేరుతారు. 1985లో ఫ్లయిట్ అటెండెంట్‌గా సంస్థలో కెరీర్‌ను ప్రారంభించిన మిట్సుకో టొట్టోరీ 2015లో క్యాబిన్ క్రూ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. తనకు లభించిన ఉద్యోగోన్నతి ఇతర మహిళలు తమ కెరీర్‌లో పైకెదిగేందుకు ప్రోత్సాహంగా నిలుస్తుందని మిట్సుకో చెప్పారు. టోక్యోలోని హనెడా ఎయిర్‌పోర్టులో ఇటీవల జపాన్ ఎయిర్ లైన్స్ విమానం చిన్నపాటి కోస్ట్‌గార్డ్ విమానాన్ని ఢీకొన్న ఘటన నేపథ్యంలో మిట్సుకోను నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రయాణికుల భద్రత, సేవల విభాగంలోనే తన కెరీర్‌లో అత్యధిక భాగం గడిపానని చెప్పారు. ఇకపై కూడా భద్రతకే అధిక ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ప్రపంచంలోని టాప్–100 విమానయాన సంస్థల్లో ఉన్నత స్థాయి హోదాల్లో కేవలం 12 మంది మహిళా అధికారులు మాత్రమే ఉన్నట్లు ఫ్లయిట్ గ్లోబల్ వెబ్‌సైట్ 2022లో చేపట్టిన సర్వేలో తేలింది.

గుజరాత్‌లో ఘోర ప్రమాదం

- వడోదర శివారులో చెరువులో మునిగిన పడవ
- 14 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు మృతి
- మరో నలుగురు గల్లంతు

వడోదర: గుజరాత్‌లోని వడోదర నగర శివారులో గురువారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. హరిణి చెరువులో పడవ మునిగిపోవడంతో 14 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు దుర్మరణం పాలయ్యారు. వారంతా పిక్‌నిక్‌లో ఉండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో పడవలో మొత్తం 27 మంది ఉన్నారని, వీరిలో 23 మంది విద్యార్థులు, నలుగురు టీచర్లు అని అధికారులు తెలియజేశారు. 16 మంది నీట మునిగి మృత్యువాత పడ్డారని వెల్లడించారు. మిగిలిన వారిలో కొందరిని రక్షించగా, మరికొందరు గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. చెరువు నుంచి ప్రాణాలతో బయటపడి అస్వస్థతకు గురైన వారిని ఆసుపత్రికి తరలించారు. నీటి అడుగున బురదలో చిక్కుకున్న పడవను బయటకు లాగారు. ఈ పడవలో కేవలం 14 మంది ప్రయాణించడానికి వీలుంది. అయినా 27 మందిని అందులోకి చేరుకున్నారు. బరువు ఎక్కువై చెరువులో మునిగిపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నలుగురు కనిపించకుండా పోయారని, వారికోసం గాలిస్తున్నామని ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది చెప్పారు. పడవ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి రూ.2 లక్షల చొప్పున నష్ట పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కేజ్రీవాల్ నాలుగోసారి డుమ్మా

ఈడీ విచారణకు హాజరుకాని ఢిల్లీ సీఎం

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నాలుగోసారి పంపిన నోటీసులకు సైతం సీఎం కేజ్రీవాల్ స్పందించలేదు. విచారణ నిమిత్తం ఈ నెల 18వన తమ కార్యాలయానికి రావాలంటూ గత వారం ఈడీ ఆయనకు సమన్లు జారీ చేసింది. ఈడీ విచారణకు గైర్హాజరు కావడంపై మీడియా ఎదుట ఆయన స్పందిస్తూ..ఈడీ ఎదుటకు వెళ్లబోనని అన్నారు. 'ఈ కేసులో కేజ్రీవాల్ నిందితుడు కాదు అంటూనే ఈడీ సమన్లు ఎందుకు ఇస్తోంది? అవినీతికి పాల్పడిన నేతలు బీజేపీని ఆశ్రయిస్తే వారిపై కేసులుండవు. మేం ఎలాంటి అవినీతికి ఒడిగట్టలేదు. అందుకే మా నేతలెవరూ బీజేపీ వద్దకు వెళ్లరు'అని కేజ్రీవాల్ అన్నారు. మద్యం విధానం కేసులో పదే పదే సమన్లు ఇవ్వడం రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తనను ప్రచారంలో పాల్గొనకుండా చేసే బీజేపీ రాజకీయ కుట్రలో భాగమని ఆరోపించారు.


అస్సాంలోని జోర్హాట్‌లో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతున్న రాహుల్

అస్సాం ప్రభుత్వం, సీఎం.. దేశంలోనే అత్యంత అవినీతిమయం

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణ
- అస్సాం మొదలైన భారత్ జోడో న్యాయ్ యాత్ర

శివసాగర్/జోర్హాట్(అస్సాం): భారత్ జోడో న్యాయ్ యాత్రను అస్సాంలో మొదలుపెడుతూనే ఆ రాష్ట్ర బీజేపీ సర్కార్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు ఎక్కుపెట్టారు. నాగాలాండ్ బుధవారం ముగిసిన యాత్ర అస్సాంలో గురువారం ఉదయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శివసాగర్ జిల్లాలోని హాలోటింగ్ పట్టణంలో వందలాది మంది పార్టీ కార్యకర్తల సమక్షంలో రాహుల్ మాట్లాడారు. '' దేశంలో అత్యంత అవినీతిమయ ప్రభుత్వం ఉందంటే అది ఈ రాష్ట్ర సర్కారే. అతిపెద్ద అవినీతి సీఎం కూడా ఇక్కడే ఉన్నారు'' అని ఆరోపించారు. జోర్హాట్ జిల్లాలోని దేబెరాపూర్‌లోని వీధి సమావేశంలోనూ రాహుల్ పాల్గొని ప్రసంగించారు. '' అస్సాంలోని బీజేపీ రాష్ట్ర సర్కార్ ఇక్కడి గిరిజనులు, తేయాకు కార్మికులు, స్థానిక తెగలకు అన్యాయం చేస్తోంది. సంపదను కొల్లగొడుతూ విద్వేషాన్ని చిమ్ముతోంది. యాత్ర మొదలైన మణిపూర్‌లో జాతుల మధ్య వైరం కార్చిచ్చులా విస్తరించి నివురుగప్పిన నిప్పులా ఉంది. దానిని చల్లార్చేందుకు కనీసం ఒక్కసారైనా మోదీ మణిపూర్‌కు రాలేదు. ఇక నాగాలాండ్‌లో నాగాల సమస్యను పరిష్కరిస్తామని మోదీ సర్కార్ తొమ్మిదేళ్ల క్రితం ఒప్పందంపై సంతకాలు చేసింది. కానీ అది ఎంత వరకు సఫలమైందనేది మోదీ ఇన్నేళ్లలో ఒక్కసారి కూడా మాట్లాడలేదు'' అని రాహుల్ ఆరోపించారు.

16 ఏళ్ల లోపు వారిని చేర్చుకోవద్దు

కోచింగ్ సెంటర్లకు కేంద్రం నిర్దేశం

న్యూఢిల్లీ: పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను కట్టడి చేసేందుకు, వాటిని చట్టపరిధిలోకి తెచ్చేందుకు కేంద్ర విద్యాశాఖ మార్గదర్శకాలు ప్రకటించింది. 16 ఏళ్లలోపు విద్యార్థులను కోచింగ్ సెంటర్లలో చేర్చుకోవద్దని, ర్యాంకులు, మంచి మార్కులు గ్యారెంటీ అంటూ తప్పుదోవ పట్టించే ప్రకటనలివ్వరాదని గురువారం జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. కోచింగ్ కేంద్రాల్లో పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు, అగ్ని ప్రమాదాలు, అసౌకర్యాలు, విద్యాబోధన విధానాలకు సంబంధించిన పలు ఫిర్యాదులు ప్రభుత్వానికి అందుతున్న నేపథ్యంలో వీటిని ప్రకటించింది. 'గ్రాడ్యుయేషన్ కంటే తక్కువ అర్హత కలిగిన వారిని ట్యూటర్లుగా పెట్టుకోరాదు. విద్యార్థులను ఆకర్షించేందుకు మంచి మార్కులు, ర్యాంకు గ్యారెంటీ అంటూ వారి తల్లిదండ్రులకు తప్పుడు హామీలు ఇవ్వకూడదు. 16 ఏళ్ల లోపు వారిని చేర్చుకోరాదు. సెకండరీ స్కూలు పరీక్ష రాసిన వారిని మాత్రమే తీసుకోవాలి'అని తెలిపింది. కోచింగ్ నాణ్యత, వారికి కల్పించే సౌకర్యాలు, సాధించిన ఫలితాల గురించి ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తప్పుదోవ పట్టించే ఎలాంటి ప్రకటనలను కోచింగ్ సంస్థలు ఇవ్వరాదని స్పష్టం చేసింది. మానసిక ఒత్తిడికి గురయ్యే వారికి తక్షణమే అవసరమైన సాయం అందించే యంత్రాంగం ఉండాలి. సైకాలజిస్టులు, కౌన్సిలర్ల పేర్లను విద్యార్థులు, తల్లిదండ్రులకు అందజేయాలని కేంద్ర విద్యాశాఖ ఆ మార్గదర్శకాల్లో వివరించింది.


సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 19 । జనవరి । 2024



దుర్గమ్మకు వెండి బిందె కానుక

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు గుంటూరుకు చెందిన జి.నారాయణ తీర్థ కుటుంబం 585 గ్రాముల వెండితో తయారు చేసిన బిందెను సమర్పించింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 520.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 826.50 అడుగుల వద్ద ఉంది.

పారదర్శకంగా కులగణన

కులగణన సర్వే సున్నితమైన అంశమని, అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుని పారదర్శకంగా పూర్తి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కులగణన సర్వేపై జిల్లా అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



-8లో

న్యూస్‌రీల్

తిరువూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా స్వామిదాసు



తిరువూరు: వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నల్లగట్ల స్వామిదాసు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ అధిష్టానం ఓ ప్రకటన విడుదల చేసింది. స్థానికుడైన స్వామిదాసు 1994, 1999 ఎన్నికల్లో తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ఎంఏ రాజనీతిశాస్త్రం చదివిన స్వామిదాసు గతంలో సహకారశాఖలో ఆడిటింగ్ అధికారిగా పనిచేశారు. ఎంపీ కేశినేని నానికి అత్యంత సన్నిహితుడైన స్వామిదాసు తన భార్య, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణితో కలసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడైన స్వామిదాసు వైఎస్సార్ సీపీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరింది.

దుర్గమ్మకు కానుకగా 3.495 కిలోల వెండి దిమ్మలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన కె. శ్రీకాంత్ కుటుంబం 3.495 కిలోల వెండిని దేవస్థానానికి అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

నెలాఖరు నుంచి టిడ్కో గృహప్రవేశాలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని గో సంఘం వద్ద నిర్మించిన జీ+3 టిడ్కో గృహాల్లోకి లబ్ధిదారులు ఈ నెలాఖరుకు వెళ్లవచ్చని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. గురువారం ఆయన టిడ్కో గృహసముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్, మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయ్యాయన్నారు. ఈ నెల 25వ తేదీలోపు గృహాలను శుభ్రపరుస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులు వారి ప్లాట్లకు విచ్చేసి గదులు సక్రమంగా ఉన్నదీ, లేనిదీ పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటే ఇంజినీరింగ్ అధికారులకు తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తారన్నారు. ప్లాట్లకు విద్యుత్ మీటర్ల కోసం రూ. 450 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పర్యటనలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 2.70 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడికి భవానీ దీక్షల విరమణ సమయంలో భవానీ మాలధారులు అమ్మవారికి హుండీల ద్వారా రూ. 2.70 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో సమర్పించారు. అమ్మవారికి భవానీలు, భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు గురువారం మహామండపం ఆరో అంతస్తులో జరిగింది. రూ.2,70,48,680 నగదుతో పాటు 280 గ్రాముల బంగారం, 18 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈఓ కేఎస్ రామారావు తెలిపారు. కానుకల లెక్కింపును ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ తదితరులు పర్యవేక్షించారు. కానుకల లెక్కింపు శుక్రవారం కూడా కొనసాగుతుందని ఆలయ ఈఓ రామారావు పేర్కొన్నారు. లెక్కింపులో దేవదాయ శాఖ ఏసీ శాంతి పాల్గొన్నారు.

సామాజిక న్యాయ చిహ్నం | సమానత్వ స్వరూపం

అది విగ్రహం కాదు విప్లవం.. అది చూపుడు వేలు కాదు అణగారిన వర్గాల గుండె దివ్వెలను వెలిగించిన కిరణం.. ఒక జీవన వ్యవస్థ నిర్మాతగా తాను జీవించిన కాలంలోనే గాక భవిష్యత్ తరాలకు అక్షర సముచ్చయాన్ని నిర్మించి మార్గదర్శనం చేసిన మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. అంబేడ్కరుడంటేనే ఆకాశమంత స్ఫూర్తి.. ఆయన చూపిన మార్గం దేశానికి దీప్తి.. ఆ ఆదర్శమూర్తి నిలువెత్తు స్వరూపం బెజవాడ నడిబొడ్డున కొలువుదీరింది. రాష్ట్రంలోని ప్రస్తుత ప్రభుత్వంలో అమలవుతున్న సామాజిక న్యాయానికి ప్రతీకగా స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ పేరుతో ఆవిష్కరణకు సిద్ధమైంది. దీనిని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో పూర్తయిన సభ ఏర్పాట్లు



అంబేడ్కర్ స్మృతి వనంలోని మ్యూజియం లోపలి చిత్రాలు

చారిత్రక ఘట్టం.. మనందరి గర్వకారణం

- సామాజిక న్యాయ మహాశిల్పం ప్రారంభోత్సవం నేడే
- ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులను వివరించిన కలెక్టర్, సీపీ



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె. రాణా

సాక్షి ప్రతినిధి, విజయవాడ: దేశ ప్రజలు అనుభవిస్తున్న రాజ్యాంగ హక్కులకు ఆద్యుడు, దేశ రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జ్ఞాపకాన్ని విగ్రహం రూపంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్టీఆర్ జిల్లాలో ప్రతిష్ఠించడం మనందరికీ గర్వకారణమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ టి.కె.రాణాతో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరిగే భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వస్తున్న 1.50 లక్షల మంది ప్రజలకు ఆతిథ్యం ఇవ్వడం మన బాధ్యతని కలెక్టర్ అన్నారు. ఈ క్రమంలో ఎదురయ్యే చిన్న ఇబ్బందులను నగర ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు. శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి రాత్రి పది గంటల వరకు విగ్రహ ప్రతిష్ఠ పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకల్లో కొన్ని మార్పులు చేసినట్లు వెల్లడించారు.

నగరంలో ట్రాఫిక్ మార్పులు..

శుక్రవారం ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు విజయవాడ నగరంలో వాహనాలను మళ్లిస్తామని సీపీ టి.కె. రాణా తెలిపారు.

- విశాఖపట్నం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రామవరప్పాడు రింగు-మహానాడు జంక్షన్-నోవోటెల్ హోటల్ వద్ద బెంజిసర్కిల్ పాత ఫ్లై ఓవర్ మీదుగా-స్క్యూ బ్రిడ్జి-వారధి జంక్షను నుంచి పీఎన్‌బీఎస్‌కు వెళ్లాలి.
- మచిలీపట్నం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు తాడిగడప నుంచి 100 అడుగుల రోడ్డు మీదుగా ఎనికేపాడు-ప్రసాదంపాడు-రామవరప్పాడు రింగు-మహానాడు జంక్షను-నోవోటెల్ హోటల్ వద్ద బెంజ్ సర్కిల్ పాత ఫ్లై ఓవర్ మీదుగా-స్క్యూబ్రిడ్జి-వారధి జంక్షను నుంచి బస్టాండ్‌కు వెళ్లాలన్నారు.
- బస్టాండ్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులు పీసీఆర్ జంక్షను-ప్రకాశం విగ్రహం జంక్షన్-పాత గవర్నమెంట్ ఆస్పత్రి రోడ్డు, ఏలూరు లాకులు, జి.ఎస్.రాజు రోడ్డులో సీతన్నపేట సిగ్నల్ జంక్షను నుంచి బీఆర్టీఎస్ రోడ్డులో శారద కాలేజీ జంక్షన్, ఫుడ్ జంక్షను, పడవల రేవు జంక్షను, గుణదల, రామవరప్పాడు రింగ్ మీదుగా వెళ్లాలని తెలిపారు.
- బస్టాండ్ నుంచి మచిలీపట్నం, గుడివాడ వెళ్లే ఆర్టీసీ బస్సులు పీసీఆర్ జంక్షన్-ఆర్టీసీ వై జంక్షన్-చల్లపల్లి బంగ్లా-హనుమాన్ పేట-ఏలూరు లాకులు-సీతన్నపేట గేటు, బీఆర్టీఎస్ రోడ్డు-పడవల రేవు-గుణదల-రామవరప్పాడు రింగ్-ఎనికేపాడు జంక్షన్-తాడిగడప 100 అడుగులు రోడ్డు మీదుగా వెళ్లాలని వివరించారు.
- బెంజ్‌సర్కిల్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీసీఆర్ వైపు వెళ్లే సిటీ బస్సులు బెంజి సర్కిల్-పకీరుగూడెం జంక్షన్-స్క్యూ బ్రిడ్జి-వారధి జంక్షన్ మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలి.
- బస్టాండ్ సిటీ బస్ టెర్మినల్ నుంచి ఇబ్రహీంపట్నం వెళ్లే సిటీ బస్సులు పీఎన్‌బీఎస్ మధ్య గేటు నుంచి రాజీవ్ గాంధీపార్కు-కనకదుర్గ ఫ్లై ఓవర్-స్వాతి జంక్షన్ మీదుగా వెళ్లాలి.

భారీ వాహనాలకు ప్రవేశం లేదు

ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టి.కె.రాణా మాట్లాడుతూ.. విజయవాడలోనికి శుక్రవారం ఉదయం పది గంటల నుంచి భారీ వాహనాలకు ప్రవేశం లేదన్నారు. ఇందుకనుగుణంగా చేపట్టిన మార్పులను వివరించారు. రాష్ట్ర మొత్తం నుంచి ఆర్టీసీ బస్సులు 2,500తో పాటు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన బస్సులకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు.

బాధ్యత కలిగిన ప్రభుత్వం ఇది

- పేదలందరికీ ఇళ్లు పథకంలో రుణాలు తీసుకున్న వారికి వడ్డీ మాఫీ
- జిల్లాలో 17,861 మందికి రూ.2.06 కోట్లు జమ
- చెక్కు అందజేసిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ప్రజా ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేద మహిళల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా మహిళల పేరిట ఇంటి స్థలం కేటాయించి ఇల్లు మంజూరు చేశారన్నారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక చేయూతను ఇచ్చేందుకు బ్యాంకుల నుంచి రుణ సహాయాన్ని అందించిందన్నారు. అంతే కాకుండా తీసుకున్న రుణాలపై పూర్తి వడ్డీ రాయితీ కల్పించిందన్నారు. జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాల కోసం బ్యాంకుల నుంచి రుణాలు పొందిన మహిళలకు వడ్డీ రాయితీ ఆర్థిక సహాయాన్ని గురువారం ఉదయం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా నిర్మాణాలను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతోపాటు స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇంటి నిర్మాణం కోసం ముందస్తు పెట్టుబడి సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 55,942 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రూ.35 వేలు చొప్పున రూ.197.08 కోట్ల మేర అదనపు రుణ సదుపాయం కల్పించామన్నారు. వీరిలో 17,861మందికి రూ.2.06 కోట్ల మేర తొలి విడత వడ్డీ రాయితీ సొమ్ము ఆయా లబ్ధిదారుల ఖాతాకు జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్క లబ్ధిదారులు సొంత ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహం ద్వారా ప్రయోజనం పొందవచ్చన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డెప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజారెడ్డి, బెల్లందుర్గ, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండి పుణ్యశీల, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, టిడ్‌క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఝాన్సీరాణి, హౌసింగ్ పీడీ రజినికుమారి తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'లో టాప్ కృష్ణా

సీఎస్‌కు నివేదించిన కలెక్టర్ రాజాబాబు



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో పెద్ది రోజా

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించటంలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి రీ-సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ పి. రాజాబాబు జిల్లా ప్రగతిని సీఎస్‌కు వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో సరాసరి ఓపీ 474 మందితో నిర్వహించామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 68 క్యాంపులు నిర్వహించగా 32,201 మందికి వైద్యపరీక్షలు చేశామన్నారు. మొదటి దశ నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 3,028 కేసులకు వైద్యచికిత్స అందించామన్నారు. ఈ నెల 19వ తేదీన విజయవాడ స్వరాజ్య మైదానంలో జరిగే అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివెళ్లేందుకు 180 ఆర్టీసీ బస్సులతో పాటు 72 ప్రైవేటు బస్సులను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బస్సుకు ఇన్‌చార్జ్‌లను నియమించామన్నారు. ప్రజలను తీసుకువెళ్లి మరలా తిరిగి తీసుకురావటం ఇన్‌చార్జ్ బాధ్యతలు వ్యవహరిస్తారన్నారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, ఆహారం అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకోసం జిల్లాలో కంట్రోల్‌రూమ్‌లను 9676608390, 9154473629 ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో మూడో దశ రీ-సర్వే ప్రగతికి సంబంధించి 136 గ్రామాల్లో చేయాల్సి ఉండగా 104 గ్రామాల్లో ఫైనల్ ఆర్‌వోఆర్ పూర్తి చేశామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో పెద్ది రోజా, సర్వేశాఖ ఏడీ వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్ఓ గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ ఎస్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

హనుమాన్‌జంక్షన్ రూరల్: జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్ష-2024 నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన జరుగనున్న పరీక్షకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్ష నిర్వహణ నిమిత్తం సిబ్బందికి డీఈవో తాహెరా సుల్తానా ఆధ్వర్యంలో ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే ఆన్‌లైన్‌లో పొందుపర్చామని, అభ్యర్థులు వీటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవటానికి ఏమైనా సాంకేతిక ఇబ్బంది తలెత్తితే నవోదయ విద్యాలయను సంప్రదించాలని చెప్పారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగా చేరుకోవాలని తెలిపారు.

ఒక రోజు శిక్షణ..

కంకిపాడు: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ తాహెరా సుల్తానా సూచించారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక రోజు ఓరియెంటేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ జవహర్ నవోదయ-2024 ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 20వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహణపై సిబ్బంది జాగ్రత్తలు వహించాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకూడదన్నారు. ఇతరులకు పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదన్నారు.

పుట్టిన తేదీ నిర్ధారణకు ఆధార్ చెల్లదు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పుట్టిన తేదీని నిర్ధారించేందుకు తమ కార్యాలయంలో ఆధార్‌కార్డు చెల్లుబాటు కాదని గుంటూరు రీజనల్ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ గోష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, ఉద్యోగాలు కల్పించే సంస్థలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన తెలిపారు. తమ సంస్థలో పుట్టిన తేదీ నమోదు, మార్పు వంటి విషయాల్లో ఆధార్‌కార్డు చెల్లుబాటు కాదని, నిర్దిష్ట డాక్యుమెంట్స్ సమర్పించాలని గతంలోనే సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపారు.

యార్డులో 1,03,408 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,03,408 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 90,729 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.15,500 నుంచి రూ.19,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి 11,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 51,101 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన స్కూటరిస్ట్ మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చిన్న నందిగామ గ్రామానికి చెందిన ఉప్పు కుమార్ చంద్రశేఖర్ (72) బైక్‌పై హనుమాన్‌జంక్షన్ వైపు వస్తుండగా రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్రగాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్–2 ఎస్‌ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పశుసంవర్ధక శాఖ డైరీ ఆవిష్కరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ డైరీని ఆ శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ కె.విద్యా సాగర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అన్ని సంఘాలు కలిసి ముద్రించిన ఈ డైరీని ఆవిష్కరించటం ఆనందంగా ఉందన్నారు. ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరియన్స్ ఫెడరేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా చైర్మన్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో 1896 పశుసంవర్ధక శాఖ సహాయకుల పోస్టులు నియామకం జరిపినందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పశువైద్యశాఖకు ప్రాధాన్యం పెరిగిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్, జి.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, వైవీ ప్రసాదు, ఎన్.మురళీకృష్ణ, ఎన్.రాఘవరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు కింద పడి వ్యక్తి దుర్మరణం



ఎస్.రాయవరం(అనకాపల్లి జిల్లా): మండలంలోని గోకులపాడు జాతీయ రహదారిపై ప్రైవేటు బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రసాదరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన వి.క్రాంతి కిరణ్ (57) రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న బస్సు ఢీకొట్టడంతో మృతి చెందాడు. క్రాంతికిరణ్ రెండు రోజుల క్రితం గోకులపాడులోని బంధువుల ఇంటికి వచ్చాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

పామర్రు: విజయవాడలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల ఎత్తు విగ్రహావిష్కరణకు లక్షలాదిగా ప్రజలు తరలి రావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. పామర్రు ఆర్ అండ్‌బీ గెస్టు హౌస్‌లో గురువారం మధ్యాహ్నం ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల, మత, పార్టీ, వర్గ విభేదాలు లేకుండా ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విజయవాడ నడిబొడ్డున ఎంతో విలువైన సుమారు 20 ఎకరాల సువిశాల స్థలంలో రూ.400 కోట్లకు పైగా వ్యయంతో స్వరాజ్య మైదానంలో రూపుదిద్దుకున్న



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

అంబేడ్కర్ స్మృతి వనంలోని విశిష్టతలను ఆయన వివరించారు. విగ్రహం ఎత్తు 125 అడుగులు, పీఠం ఎత్తు 81 అడుగులతో కలిసి మొత్తం 206 అడుగుల ఎత్తున విగ్రహం ఉంటుందని అన్నారు. విగ్రహం కింద భాగంలో మూడు వేల మంది కూర్చొగలిగే మల్టీ కన్వెన్షన్ హాల్, 2 వేల మంది ఆసీనులు కాగల ఓపెన్ థియేటర్, పదివేల పుస్తకాలతో గ్రంథాలయం, బుద్ధిస్టుల ధ్యాన కేంద్రం, ఫౌంటెన్లు, పార్కు వంటి అన్ని రకాల సదుపాయాలతో దేశంలో కనీ వినీ ఎరుగని రీతిలో అద్భుతంగా నిర్మించినట్టు చెప్పారు. ఈ స్మృతి వనం రానున్న కాలంలో గొప్ప పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒక గొప్ప పండుగగా నిర్వహించనున్నదని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కేవలం ఒక వర్గానికి మాత్రమే సంబంధించిన వ్యక్తి కాదని, దేశంలోని ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం కల్పించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు ఆ మహనీయుని విగ్రహావిష్కరణకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిగా ప్రజలందరూ తరలి రావాలని చైర్మన్ కోరారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగదేసి రవికుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. ఈ విగ్రహ నిర్మాణంతో జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరో 37 మంది ఎస్‌ఐల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో మరో 37 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. రేంజ్ పరిధిలోని ఏలూరు జిల్లా, ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్, తూర్పుగోదావరి, కాకినాడ, కృష్ణా, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 26 మంది ప్రమోటీ ఎస్‌ఐలు కాగా, 11 మంది డైరెక్ట్ ఎస్‌ఐలు ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ కమిషనరేట్‌లో పనిచేస్తున్న కె.ప్రమీల, గుణ్ణం ఫణీంద్ర, బారోతు నాగమణి, బి.రవితేజలను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న పులికోటి నవీన్‌కుమార్‌ను ఏలూరు జిల్లా, ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో పని చేస్తున్న నంబూరి చంటిని విజయవాడ కమిషనరేట్‌కు, వీఆర్‌లో ఉన్న చావా సురేష్‌ను తూర్పుగోదావరి జిల్లాకు నూజివీడు టౌన్ ఎస్‌ఐ గొర్రెల వెంకటేష్‌ను కాకినాడ జిల్లాకు, ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న ఇజ్జాపు వీర్రాజు, శీలం శంకర్‌లను విజయవాడ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న పి.వాసును ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు.

ప్రమోటీ ఎస్‌ఐలు సైతం...

ఇదిలా ఉండగా ప్రమోటీ ఎస్‌ఐలుగా పనిచేస్తున్న పలువురికి కూడా స్థాన చలనం కలిగింది. విజయవాడ కమిషనరేట్‌లో పనిచేస్తున్న బీఈ వెంకటేశ్వరరావు, కె.శేషారెడ్డి, బీవీ రామారావు, పీఎస్ ప్రకాశరావు, జె.రంగయ్య, కేవీడీ మల్లేశ్వరిలను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న వేపటి రాజేంద్రప్రసాద్, జీవీ ప్రసాదరావు, పి.ప్రసాదరాజు, వేకూరి జాస్మిన్, టి.వెంకటరమణలను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న పి.రామకృష్ణారావు, బి.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎస్‌వీ ప్రసాద్‌నాయుడు, పీసీహెచ్ రఘురామ్‌లను విజయవాడ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. కె.శ్రీధర్, ఆర్.వెంకటేశ్వర్లు, ఎంఆర్‌కే రాజు, కేఎస్ఎస్‌మూర్తిలను ఏలూరు జిల్లా నుంచి అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లాలో పని చేస్తున్న ఎండీ మక్బూల్, ఎస్.శ్రీనివాసులు, కె.రాంబాబు, ఏసీహెచ్ శేఖర్, జి.కేశవరావు, జి.అజయ్‌కుమార్‌లను కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న బి.రాధాకృష్ణను తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ చేశారు.

మామ హత్య కేసులో అల్లుడికి యావజ్జీవ శిక్ష

తోట్లవల్లూరు: సరిహద్దు విషయమై ఏర్పడిన వివాదంలో వరుసకు మామను హత్య చేసిన కేసులో అల్లుడికి కోర్టు యావజ్జీవ శిక్ష విధించినట్లు తోట్లవల్లూరు ఎస్‌ఐ పి.విశ్వనాథ్ తెలియజేశారు. వివరాల ప్రకారం..మండలంలోని కుమ్మమూరులో 2019 జూన్ 3వ తేదీన చింతలపూడి వెంకటేశ్వరరావుకు, పక్క ఇంటిలో నివసించే వరుసకు అల్లుడైన జెట్టి సాంబశివరావుకు మధ్య సరిహద్దు విషయమై గొడవ జరిగింది. ఈ గొడవలో సాంబశివరావు కర్రతో దాడికి పాల్పడటంతో వెంకటేశ్వరరావు తలకు బలమైన గాయమై మృతి చెందాడు. మృతుని కుమారుడు చింతలపూడి నాగ నాంచారయ్య ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. విచారణ నిర్వహించిన విజయవాడ 8వ అడిషనల్ డిస్ట్రిక్టు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.లక్ష్మి నిందితుడు జెట్టి సాంబశివరావుకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో 15 రోజులపాటు అదనపు సాధారణ జైలు శిక్ష విధిస్తున్నట్లు ఆమె ఆదేశించారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ట్రామా కేర్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగ నియామకాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గురువారం విడుదల చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు లిఖిత పూర్వకంగా తగు ధ్రువపత్రాలతో జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఎయిమ్స్‌లో అత్యాధునిక మైక్రోబయాలజీ ల్యాబ్ ప్రారంభం

మంగళగిరి: నగర పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) అత్యాధునిక ల్యాబ్‌లు ప్రారంభించడం సంతోషంగా ఉందని తద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్య పరీక్షలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి తెలిపారు. గురువారం ఎయిమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్లినికల్ మైక్రోబయాలజీ విభాగంలో ఇంటిగ్రేటెడ్ స్టువర్ట్‌షిప్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరీక్షా పరికరాలను త్రిపాఠి ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక పరికరాలు రోగులలో బ్యాక్టీరియా, ఫంగస్ క్రిమికీటకాలను అతితక్కువ సమయంలో కనుగొనవచ్చన్నారు. దీనివల్ల క్లినికల్ బయాలజిస్టులు రోగులకు సరిపడా యాంటిబయాటిక్స్ గురించి తెలియజేయవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ డాక్టర్ సుమిత్ రాయ్ పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠి తదితరులు

నేటి నుంచి పకడ్బందీగా కులగణన సర్వే

- షెడ్యూలు ప్రకారం ఇంటింటి సర్వే
- అన్ని స్థాయిలలో సర్వే వివరాల పరిశీలన
- కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 19వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా కులగణన సర్వే ప్రారంభిస్తున్నట్లు కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా కులాల వారీగా వివరాలు, నివాసంలో ఎంత మంది ఉంటున్నదీ వలంటీర్‌తో పాటు సంబంధిత సచివాలయ సిబ్బంది రూట్ మ్యాప్ ప్రకారం ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారన్నారు. అనంతరం బయోమెట్రిక్ ద్వారా కుటుంబ పెద్ద అథెంటికేషన్ తీసుకుంటారన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ఏ విధంగా సర్వే జరుగుతున్నదీ మండల, డివిజన్, జిల్లా స్థాయిలో అధికారులు నిశితంగా పరిశీలిస్తారన్నారు. తదనంతరం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి స్వయంగా సర్వే వివరాలను పునఃపరిశీలన చేస్తారన్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు కులగణన సర్వేపై పరిశీలన, ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. కులగణన సర్వేలో వ్యక్తులు ఏ వివరాలు చెబితే వాటినే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నమోదు చేసుకోవాలని, ఎటువంటి ఆధారాలు అడగకూడదన్నారు. కులగణన సర్వేను విజయవంతం చేసేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహెద్‌బాబు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో షాహిద్‌బాబు, రవికాంత్

కులగణన సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలి

కులగణన సర్వే సున్నితమైన అంశమని, అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుని పారదర్శకంగా పూర్తి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కులగణన సర్వేపై జిల్లా, క్షేత్ర స్థాయి అధికారులతో గురువారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక యాప్ ద్వారా నిర్వహించే ఈ సర్వే సమాచారం గోప్యతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కులగణన సర్వే అధికారులు, సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి స్వయంగా పరిశీలించి పక్కాగా సర్వే చేయాలన్నారు. ఈ సర్వే ప్రారంభించే ముందు సంబంధిత ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. సీఎఫ్ఎంఎస్ ఐడీ ద్వారా సమాచారం సేకరించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ శాఖ ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను సిద్ధం చేసిందని, దీనిలో 723 కులాల జాబితాలను పొందుపరిచి అనుసంధానించారన్నారు. వీటితో పాటు నో క్యాస్ట్ కేటగిరీలు కూడా చేర్చారన్నారు. వివరాలు సేకరించేటప్పుడు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సాంఘిక సంక్షేమశాఖ డీడీ షేక్ షాహిద్ బాబు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయకర్త రవికాంత్ పాల్గొన్నారు.

శతకాల ద్వారా ఆత్మజ్ఞానాన్ని బోధించిన వేమన

అధికార భాషా సంఘం చైర్మన్ విజయబాబు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యోగి వేమన తన శతకాల ద్వారా ఆత్మజ్ఞానాన్ని ప్రబోధించారని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు అన్నారు. విజయవాడలో బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గురువారం యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయ బాబు వేమన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వదాభిరామ వినుర వేమ అనే మాట వినని తెలుగు వారుండరన్నారు. అచ్చమైన తెలుగులో లోతైన ఆధ్యాత్మిక భావాన్ని ఇమిడ్చి కేవలం మూడే పంక్తులలో గొప్ప భావాన్ని నింపి వేల పద్యాలు రాసి ఆత్మ జ్ఞానాన్ని అందరికీ అందించారన్నారు. వేమన రాసిన ఒక్కో పద్యం ఒక్కో మహత్తర గ్రంథమవుతుందన్నారు. అనంతరం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 'నిగూఢ తత్వార్థ బోధిని' గ్రంథాన్ని ఆవిష్కరించారు. శారదా శృంగేరి మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాన్ని అచ్చ తెలుగులో ఈ గ్రంథంలో అందించారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ టి.జమలపూర్ణమ్మ, సాహితీవేత్తలు గుమ్మా సాంబశివరావు, జీవీ పూర్ణ చంద్, గ్రంథాలయ అధికారి రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



వేమన జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికార భాషా సంఘం చైర్మన్ విజయబాబు

విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల అర్బన్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్లాస్టరింగ్ వర్క్, సిరామిక్ వర్క్, బిల్డింగ్ ఫ్రేమ్ వర్క్, ఐరన్ బెండింగ్ వంటి రంగాల్లో ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు గురువారం తెలిపారు. ఉద్యోగాలకు 8 తరగతి, అంతకంటే ఎక్కువ చదివిన వారు, ఇంగ్లిష్‌పై అవగాహనను విద్యార్హతలుగా వెల్లడించారు. వయస్సు 21 నుంచి 45 సంవత్సరాల మధ్యలో ఉండి, మూడు సంవత్సరాలు అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు సంబంధిత వెబ్‌సైట్ల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 99888 53335, 85559 01198 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ వరలక్ష్మి మృతి

నందిగామ: నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి (56) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గురువారం తుదిశ్వాస విడిచారు. ఆమె భర్త మండవ పిచ్చయ్య వైఎస్సార్ సీపీ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి. వారికి ఇద్దరు సంతానం. వరలక్ష్మి చైర్‌పర్సన్ గా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి ఆరోగ్యంగా ఉన్నంతకాలం ప్రతిరోజూ వార్డులలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఆమె మృతి పట్ల పలు రాజకీయ పార్టీల నాయకులతో పాటు పలు శాఖల అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.



మండవ వరలక్ష్మి (ఫైల్)

నేడు, రేపు ఏపీఎస్‌పీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏపీఎస్‌పీఎఫ్) పోలీస్ స్పోర్ట్స్ మీట్ శుక్ర, శనివారాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌పీఎఫ్ ఐజీ వెంకటరామిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా వాలీబాల్, బ్యాడ్మింటన్ అంశాలల్లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో 150 మంది ఎస్‌పీఎఫ్ సిబ్బంది, అధికారులు పాల్గొంటున్నారని తెలిపారు.

నాట్కో సెంటర్‌కు అదనపు స్థలం మంజూరు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు 1254 చదరపు అడుగుల అదనపు స్థలం మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో రూ.40 కోట్లతో 2019లో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.50 కోట్ల ఖరీదు చేసే వైద్య పరికరాలను నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు అందజేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రోగులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం క్యాన్సర్ సెంటర్‌ను గ్రేడ్–1 లెవల్‌కు పెంచేందుకు రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా అదనంగా భవన నిర్మాణాలు, క్యాన్సర్ చివరి దశలో ఉన్నవారికి ప్యాలేటివ్ కేర్ చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా భవన నిర్మాణానికి నాట్కో కేర్ సెంటర్‌కు అదనంగా స్థలం మంజూరు చేస్తూ ఉత్తర్వులు మంజూరు చేశారు.



క్లుప్తంగా

కళ్లజోళ్లు పంపిణీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి అన్నారు. రాణిగారితోట, 17వ డివిజన్‌లోని శాంపిల్ బిల్డింగ్‌లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామిరెడ్డి పాల్గొని వృద్ధులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి సుందరకాండ పారాయణం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 20వ తేదీ నుంచి 26 వరకు మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో తమ కళాపీఠం ఆధ్వర్యంలో డాక్టర్ పోలాప్రగడ శ్రీనివాస్ స్వామిచే సుందరకాండ పారాయణం నిర్వహిస్తున్నామని సిద్ధార్థ కళాపీఠం గౌరవాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు చెప్పారు. సిద్ధార్థ అకాడమీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం జరిగింది. నాగేశ్వరరావు మాట్లాడుతూ సుందరాకాండ ప్రవచనాలను వినడం వల్ల మనస్సులో ఆధ్యాత్మిక భావాలతో పాటుగా సామాజిక సేవ చేయాలనే ఆలోచనలు కలుగుతాయని చెప్పారు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచనం జరుగుతుందని తెలిపారు. చివరి రోజైన 26వ తేది శుక్రవారం ఉదయం 10 గంటలకు సీతారామ కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. సిద్ధార్థ కళాపీఠం ప్రధాన కార్యదర్శి ఎన్. లలిత్ ప్రసాద్, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, సభ్యులు జగదీష్, కృష్ణ ప్రసన్న పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు స్వరనీరాజనం



విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ, పద్మశ్రీ ఎన్టీఆర్ సామాజిక సేవా సంస్థ అధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు 50 మంది 12 గంటలపాటు ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని పాటలను ఆలపించారు. ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు మాట్లాడుతూ తెలుగు వారి కీర్తి పతాకను అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లిన మహానటుడు ఎన్టీఆర్ అని అభివర్ణించారు. కళారంగ ప్రతినిధి పెరుమాళ్ళ విశ్వనాథం మాట్లాడుతూ స్వయం కృషితో ఎన్టీఆర్ ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని చెప్పారు. తెలుగు సినీరంగ చరిత్రలో ఆయనది స్వర్ణయుగమని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కొమ్మినేని రత్నకుమారి, రసూల్‌బాబు, పద్మ,పావని, భారతి, నవీన, మహేశ్వరి గీతాలను ఆలపించారు. నిర్వాహకులు ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల విద్యార్థి బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు తెలిపారు. ఇటీవల చండీఘర్‌లో నిర్వహించిన ఆలిండియా సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి సోను భార్గవ్ కృష్ణా విశ్వవిద్యాలయం తరుపున పాల్గొని పతకం పొందాడని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన సోను భార్గవ్‌ను, ప్రోత్సహించిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి. హేమచంద్రరావును కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ తదితరులు అభినందించారు.

వేడుకలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

- కుల, మతాలకు అతీతంగా పిలుపునిచ్చిన వైనం
- స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి ప్రశంసలు



విజయవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారతజాతి గర్వించదగిన రోజు కోసం అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. దేశానికి అత్యంత శక్తిమంతమైన రాజ్యాంగాన్ని రూపొందించిన ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకను చూసేందుకు స్వచ్ఛందంగా తరలి రావాలంటూ ఇప్పటికే సందేశాలు పంపించారు. కుల, మతాలకు అతీతంగా పలు సంఘాలకు చెందిన నేతలు అత్యంత సుందర మనోహరంగా అంబేడ్కర్ స్మృతి వనాన్ని తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. విజయవాడ నగరానికే ఐకాన్‌లా తీర్చిదిద్దారని అంటున్నారు. అంతేకాదు మహాత్మాగాంధీరోడ్డులో వెళ్తున్న వారు ఆ విగ్రహాన్ని చూడకుండా వెళ్లడం లేదు. ప్రతి ఒక్కరూ సెల్ఫీలు తీసుకుంటున్నారు.

స్మృతి వనం ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయండి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జి కసగాని దుర్గరావు గౌడ్ పేర్కొన్నారు. గురువారం కృష్ణలంకలో జరిగిన విలేకరుల సమావేశంలో దుర్గారావు మాట్లాడారు. స్వరాజ్ మైదానంలో శుక్రవారం నిర్వహించే 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించాలని కోరారు. వెనుకబడిన వర్గాలకు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఎన్నో వినూత్నమైన పథకాలు రూపొందించి వాటిని అమలు చేస్తూ వారి ఖ్యాతిని, ప్రాముఖ్యతను చాటుతూ రూ.400 కోట్లతో మహత్తర కార్యక్రమం చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీలు కేవలం ఓటు బ్యాంకు కాదు, రాజ్యాధికారంలో భాగస్వాములు అని దేశానికి చాటి చెప్పిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎళ్లవేళలా వెన్నంటి ఉంటూ మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని తెలిపారు.

శుభ పరిణామం



భారతజాతి గర్వించదగిన మహనీయుడు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం శుభ పరిణామం. రానున్న రోజుల్లో ఇదొక పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలిరావాలి.

–మునీర్ అహ్మద్, కన్వీనర్, ముస్లిం జేఏసీ

స్మృతి వనం ఏర్పాటు హర్షణీయం



రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం విజయవాడలో ఏర్పాటు చేయడం హర్షణీయం. నాడు ముఖ్యమంత్రి హోదాలో విజయవాడలో వైఎస్ రాజశేఖరరెడ్డి అంబేడ్కర్ భవన్‌ను ప్రారంభించారు. ఆనాడే అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటును ఆయన దృష్టికి తెచ్చాం. ఇప్పుడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతి గర్వించేలా స్మృతి వనం ఏర్పాటు చేయడం శుభపరిణామం.

–డాక్టర్ ఉప్పులేటి తారక్‌ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు, ఇండియన్ అంబేడ్కరిస్ట్ డాక్టర్స్ ఫెడరేషన్

జాతి గర్వించే రోజు



దేశం గర్వించేలా ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు సముచిత గౌరవం ఇస్తూ విజయవాడలో విగ్రహం ఏర్పాటు చేయడం మంచి పరిణామం. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.405 కోట్లు వెచ్చించి 18 ఎకరాల్లో స్మృతి వనం ఏర్పాటు చేయడం పట్ల ప్రతి ఒక్కరూ హర్షిస్తున్నారు. ప్రారంభోత్సవ వేడుకను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి.

–చింతగుంట విజయ్‌కుమార్, ఎస్సీ నాయకుడు, ఫకీరుగూడెం

వేమన పద్యం సదా స్మరణీయం



బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

గుణదల (విజయవాడ తూర్పు): జీవిత సారాన్ని పద్య రూపంలో సమకూర్చి భావి తరాలకు నీతి మార్గాన్ని బోధించిన ఘనత వేమనకు దక్కుతుందని మోదుకూరు వేమన జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సీతారామిరెడ్డి అన్నారు. ఈ నెల 19వ తేదీన వేమన జయంతి సందర్భంగా ఆంధ్రలయోల కళాశాలలో విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన పద్యం భావి తరాలకు మార్గదర్శకమని తెలిపారు. విలాస జీవితాన్ని విడిచిపెట్టి వైరాగ్యంతో కూడిన నీతి జీవితాన్ని అనుభవించిన యోగి వేమన ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఆయన రూపొందించిన పద్యాలలో నీతి సూత్రాలు ఇమిడి ఉన్నాయని చెప్పారు. ఉపమానంతో కూడిన వేమన పద్యాలు సులువైన వాడుక భాషలో రాశారని తెలిపారు. పండిత పామరులకు సైతం అర్థమయ్యేలా వేమన శతకం ప్రజాదరణ పొందిందని అభిప్రాయపడ్డారు.

సుమారు ఐదు దశాబ్దాలకు పైగా వేమన శతక పద్యాలు తెలుగు సాహిత్యంలో, పాఠ్యాంశాలుగా ఉన్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ వేమన పద్యం ఆవశ్యకతను గుర్తించాలన్నారు. వేమన పద్యాలను విద్యార్థులంతా కంఠస్తం చేయాలని సూచించారు. 30 మంది విద్యార్థులు పోటీల పాల్గొన్నారు. వేమన పద్యాలను రాగయుక్తంగా ఆలాపించి గురువుల మన్ననలు పొందారు. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయోల కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్‌కుమార్, తెలుగు విభాగాధిపతి కోలా శేఖర్, తో పాటు న్యాయనిర్ణేతలుగా సీనియర్ అధ్యాపకులు వి.గోపాల్ రెడ్డి, డాక్టర్ కృపారావు, డాక్టర్ సుబ్బారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 4న మోతీ మసీదు కమిటీ ఎన్నికలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని మోతీ మసీదు షాదీఖానా కమిటీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 4వ తేదీన కమిటీ ఎన్నికకు సంబంధించి పోలింగ్ జరగనుందని ఎన్నికల అధికారి ఫతావుల్లా పేర్కొన్నారు. 23వ తేదీన నామినేషన్ల దాఖలు పక్రియ, 24వ తేదీ సాయంత్రం నామినేషన్ల ఉపసంహారణ జరుగుతుంది. 4వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ ఆ తర్వాత ఓట్ల లెక్కింపు , రాత్రికి ఫలితాలను ప్రకటిస్తారు. ఈ దఫా ఎన్నికల్లో మూడు బృందాలు నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే మసీదు పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి గుర్తింపు కార్డుల ప్రకారం ఓటరు నమోదు పక్రియను కొనసాగుతుంది. ఒకటి, రెండు రోజుల్లో ఓటర్ల నమోదు పూర్తవుతుంది. ఆ తర్వాత ఓటర్ల జాబితాను సిద్ధం చేసి నామినేషన్ల పక్రియ నాటికి మసీదు కమిటీ హాల్‌లో లిస్టును అందుబాటులో ఉంచనున్నారు. కమిటీకి అధ్యక్ష, కార్యదర్శులతో పాటు రెండు ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీ, కోశాధికారితో పాటు ఐదుగురు సభ్యులను ఎన్నుకుంటారు.

అద్భుతం... అంబేడ్కర్ స్మృతివనం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం అత్యంత అద్భుతంగా తీర్చిదిద్దారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, సామగ్రితో నిర్మాణం చేపట్టారు. ఎన్నో చారిత్రక అంశాలు అందరికీ తేలికగా అర్థమయ్యేలా ఏర్పాటుచేసిన చిత్రపటాలు, విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్లు అందజేత



పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్ల జారీ చేస్తున్న ఆలయ సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గురువారం పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్లు జారీ చేశారు. దేవదాయ శాఖ తన వైబ్‌సైట్‌లో సాఫ్ట్‌వేర్‌ను బుధవారం రాత్రి అప్‌డేట్ చేసింది. అయితే కొత్త సాఫ్ట్‌వేర్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురుకావడంతో గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దర్శన టికెట్ల జారీలో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మహా మండపం దిగువన కౌంటర్లతో పాటు ఘాట్‌రోడ్డు, స్కానింగ్ పాయింట్ వద్ద కౌంటర్లలో టికెట్ల జారీ నిలిచిపోయింది. దీంతో దేవస్థాన సిబ్బంది టికెట్ల జారీలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల ద్వారా ఆలయ ఈవో కెఎస్.రామారావు దృష్టికి తీసుకెళ్లారు. అయితే అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు గురి కాకుండా వెంటనే పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్లను జారీ చేయాలని టెక్నికల్ టీమ్‌కు సూచించారు. దీంతో గాలిగోపురం వద్ద ఉన్న స్కానింగ్ పాయింట్ వద్ద పీవోఎస్ మిషన్ల ద్వారా టికెట్ల జారీ చేశారు.

29న పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష



ప్రజ్ఞ వికాసం పరీక్ష వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పబ్లిక్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో గురువారం ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ పరీక్ష ప్రజ్ఞ వికాసంకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రజ్ఞ వికాసం పేరుతో పబ్లిక్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత పరీక్ష పేపర్ తయారు చేయించామని తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్ష రాయడం ద్వారా పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించడానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులందరూ ఈ పరీక్షను ఉపయోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9394755525, 8790865130, 9010849524 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుందరయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సోమేశ్వరరావు, రాజ్‌కుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు సరైన గుర్తింపు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దేవినేని అవినాష్, పార్టీ నాయకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు సరైన గుర్తింపు ఇచ్చి జిల్లాకు ఆయన పేరు పెట్టిన గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా చుట్టుగుంట ఏలూరురోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి దేవినేని అవినాష్ గురువారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అవినాష్ మాట్లాడుతూ తెలుగు వారి ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చాటిచెప్పిన ఘనత ఎన్టీఆర్‌దేనని చెప్పారు. రాజకీయ ఆరంగేట్రం చేసిన అనతికాలంలోనే ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా, ఎందరో యువకులకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన మహామనిషి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి పదవి నుంచి ఆయన్ను బలవంతంగా దించిన టీడీపీ నాయకులు ఇప్పుడు కేవలం ఓట్లు కోసం ఎన్టీఆర్ పేరు వాడుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. కార్పొరేటర్ అమర్, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇజ్జాడ తేజతో పాటుగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రిపబ్లిక్‌డే వేడుకలు వీక్షించేందుకు అవకాశం



మాట్లాడుతున్న విద్యాకన్యా, పూర్ణిమ, ఎంపికైన మహిళలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 26న ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ డే వేడుకలను వీక్షించడానికి తమ సంస్థలో శిక్షణ పొందిన ఇద్దరు మహిళలు ఎంపిక అయ్యారని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్యా చెప్పారు. రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. విద్యాకన్యా మాట్లాడుతూ గత ఏడాదిలో జన శిక్షణ సంస్థాన్‌లో పీఎంకేవీవై 4.0 కోర్సులను నిర్వహించామని, అందులో అసిస్టెంట్ బ్యూటీ కన్సల్టెంట్స్ కోర్సులో వి.సీత, సూయింగ్ మెషిన్ ఆపరేటర్ కోర్సులో ఈ.రమణ పాల్గొని కోర్సులను విజయవంతంగా పూర్తి చేయడంతో పాటుగా వెంటనే యూనిట్‌ను స్థాపించి విజయంతంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. పీఎంకేవీవై కోర్సులో శిక్షణ పొంది, యూనిట్‌ను స్థాపించిన వారి సక్సెస్ స్టోరీలో నుంచి పీఎంకేవీవై అధికారులు వీరిని ఎంపిక చేశారని తెలియజేశారు. ఈ నెల 26వ తేదిన ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల పరేడ్‌లో వీరు పాల్గొని స్వయంగా వీక్షించడమే కాకుండా పీఎంకేవీవై అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వీరి సక్సెస్ స్టోరీని వివరిస్తారని తెలిపారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ పూర్ణిమ మాట్లాడుతూ తమ సంస్థలో శిక్షణ పొందిన వారు గణతంత్ర వేడుకలను స్వయంగా వీక్షించే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

7 నుంచి దత్తసాయి మందిర వార్షిక వేడుకలు




శ్రీదత్తసాయి మందిరం వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్త సాయి మందిరంలో వచ్చే నెల 7 నుంచి 9వతేదీ వరకు మందిర వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీర మోహనరావు తెలిపారు. పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం మందిర వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వతేదీ ఉదయం 5.15 గంటలకు కాగడ హారతితో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 7 గంటలకు విఘ్నేశ్వరపూజ, బాబా వారికి అభిషేకాలు, ఓంసాయి శ్రీసాయి జయజయ సాయి అఖండసాయినామం, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతాయన్నారు.

8వ తేదీన మధురానగర్ పురవీధులలో సాయిభక్తులచే భిక్షాటన, శ్రీ విష్ణు, లలితాసహస్ర పారాయణం ఉంటాయని తెలిపారు. 9వ తేదీ శుక్రవారం లోక కళ్యాణార్ధం బాబావారికి విశేషంగా 21 దివ్యద్రవ్యములతో అభిషేకం ,అన్నాభిషేకం శ్రీ సాయినక్షత్రమాలిక 10వ మహాయజ్ఞంలో 108వ పర్వం పారాయణం, సంకీర్తన ,లక్ష్మీగణపతి హోమం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 7 గంటలకు పల్లకీసేవతో వేడుకలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సాయి భక్తులు పాల్గొన్నారు.

శ్రీనివాసరాజు మృతి తీరనిలోటు




విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన రంగస్థల నటుడు, నాటక రచయిత, దర్శకుడు అల్లూరి సత్య శ్రీనివాసరాజు (59) మృతి కళా రంగానికి తీరనిలోటు అని పలువురు చెప్పారు. అనారోగ్య కారణాలతో మంగళవారం ఆయన తూర్పుగోదావరి జిల్లా రేలంగి గ్రామంలో మృతి చెందారు. ఆయనకు భార్య ఒక కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరాజు మృతికి నగరానికి చెందిన కళా సంస్థల ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశాయి. ఎక్స్‌రే సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు తన సందేశంలో శ్రీనివాసరాజు అనేక సాంఘిక నాటికలలో నటించారని, పలువురు నటులను నాటక రంగానికి పరిచయం చేశారని కొనియాడారు. ఆయన మృతి నాటక, సాంస్కృతిక రంగానికి తీరనిలోటని తెలిపారు. అభివర్ణించారు. అమ్మా సాంస్కృతిక కేంద్రం ద్వారా వందలాది కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు సామంతపూడి నరసరాజు, పీవీ భాస్కర శర్మ (సుమధుర కళానికేతన్) హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ (దృశ్యవేదిక), నాట్యాచార్యులు పద్మశ్రీ హేమంత్, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, సంతాపం ప్రకటించారు.

ప్రతి ఒక్కరికీ అంకమ్మతల్లి ఆశీస్సులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంతో మహిమాన్వితమైన అంకమ్మతల్లి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. మధురానగర్ నేతాజీ కాలనీలో గురువారం అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షిక వేడుకల ముగింపులో భాగంగా అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే తల్లి అంకమ్మతల్లి అని అన్నారు. గత ఐదు రోజులుగా వార్షిక వేడుకలు నిర్వహిస్తున్న పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావును అభినందించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. మూడు వేల మందికి అన్నదానం జరిగింది.

బాబు తోడుదొంగ ఈశ్వరన్ ఔట్



సింగపూర్ మంత్రిపై 27 తీవ్ర అభియోగాలతో చార్జ్‌షీట్లు దాఖలు

అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీకి, పదవులకు ఈశ్వరన్ రాజీనామా

- అమరావతి భూదోపిడీలో చంద్రబాబు పార్టనర్ ఈశ్వరన్
- సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం అంటూ బురిడీ
- బాబు బినామీ కంపెనీ ద్వారా గూడుపుఠాణి

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి పేరిట మాజీ సీఎం చంద్రబాబు సాగించిన భూ దోపిడీలో కీలక పాత్రధారిగా వ్యవహరించిన సింగపూర్ మాజీ మంత్రి ఎస్.ఈశ్వరన్ కథ ముగిసింది. రవాణా శాఖ మంత్రి పదవితోపాటు ఎంపీ సభ్యత్వానికి, సింగపూర్ అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ(పీఏపీ) ప్రాథమిక సభ్యత్వానికి ఆయన రాజీనామా చేసి ఇంటిదారి పట్టారు. ఆయన ఈ నెల 12న రాజీనామా చేసిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. ఇక దర్యాప్తు ప్రక్రియ ముగిసి నేరాలు రుజువు కావడమే తరువాయి ఆయన జైలు పక్షిగా మారనున్నట్లు స్పష్టమైంది. సింగపూర్ ఫార్ములా వన్ రేసింగ్ కాంట్రాక్టులో ఈశ్వరన్ అక్రమాలకు తెగబడి ఏకంగా 2.98 లక్షల అమెరికన్ డాలర్ల మేర భారీ అవినీతికి పాల్పడినట్టు సింగపూర్ అవినీతి నిరోధక విభాగం 'కరెప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' (సీపీఐబీ) నిగ్గు తేల్చింది. ఈ కేసులో నేరం రుజువైతే ఆయనకు కనీసం ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష పడే అవకాశాలున్నట్లు నిపుణులు తెలిపారు. ఈశ్వరన్ వ్యవహారం టీడీపీలో గుబులు పుట్టిస్తోంది. స్కిల్ స్కామ్ కేసులో అరెస్టై 52 రోజులు రిమాండ్ ఖైదీగా గడిపి బెయిల్‌పై విడుదలైన చంద్రబాబు తాజా పరిణామాలతో ఆందోళన చెందుతున్నట్లు స్పష్టమవుతోంది.

అరెస్ట్.. బెయిల్.. రాజీనామా

2008లో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖలో జూనియర్ ఆఫీసర్‌గా ఉన్న ఈశ్వరన్ అనతి కాలంలో ఉన్నత స్థానానికి చేరుకున్నారు. మొదట పరిశ్రమల శాఖ మంత్రిగా, అనంతరం రవాణా శాఖ మంత్రిగా కీలక పదవులు పొందారు. సింగపూర్‌కు ఫార్ములా వన్ కార్ రేసింగ్ ముసుగులో ఆయన ముడుపులు స్వీకరించడం సంచలనంగా మారింది. సింగపూర్ గ్రాండ్ ప్రిక్స్ నిర్వాహకుడు ఓంగ్ బెంగ్ సంగ్ నుంచి వివిధ రూపాల్లో 2.98 లక్షల అమెరికన్ డాలర్లను ముడుపులుగా తీసుకున్నట్లు అవినీతి నిరోధక విభాగం నిగ్గు తేల్చింది. సింగపూర్ గ్రాండ్ ప్రిక్స్ – సింగపూర్ పర్యాటక విభాగం మధ్య కాంట్రాక్టు రూపంలో ఆయన ముడుపులు తీసుకున్నారు. సింగపూర్ గ్రాండ్ ప్రిక్స్ రేసింగ్, ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, మ్యూజికల్ షోస్, బ్రిటన్‌లో హ్యారీ పోటర్ షోలకు భారీ సంఖ్యలో టికెట్లు యథేచ్ఛగా విక్రయించారని వెల్లడైంది. సింగపూర్ గ్రాండ్ ప్రిక్స్ నిర్వాహకుడు ఓంగ్ బెంగ్ సంగ్‌తోపాటు ఈశ్వరన్‌ను గతేడాది జూలై 12న సీపీఐబీ అధికారులు అరెస్ట్ చేశారు. అప్పుడే ఆయన తన పదవికి రాజీనామా చేయడంతో సింగపూర్ ప్రధానమంత్రి లీ హ్సీన్ లూంగ్ తాత్కాలిక రవాణా శాఖ మంత్రిగా మరొకరికి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఈశ్వరన్ బెయిల్‌పై విడుదలయ్యారు. సీపీఐబీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఈశ్వరన్ అవినీతిని నిగ్గు తేలుస్తూ 27 అభియోగాలతో తాజాగా చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. వాటిలో ఆయన మంత్రి హోదాలో భారీ ముడుపులు తీసుకున్నట్టు 24 అభియోగాలు, అవినీతికి కేంద్ర బిందువుగా ఉన్నారని రెండు అభియోగాలు, న్యాయ విచారణకు అడ్డంకులు కల్పించారని ఒక అభియోగం ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. నేరం రుజువైతే ఈశ్వరన్‌కు లక్ష డాలర్ల జరిమానాతోపాటు కనీసం ఏడేళ్ల జైలు శిక్ష పడుతుందని సింగపూర్ న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

భూ దోపిడీలో పార్టనర్

చంద్రబాబుతో కలసి అమరావతి భూదోపిడీలో ఈశ్వరన్ ప్రధాన భూమిక పోషించారు. ఎంతగా అంటే రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ ప్రభుత్వం టీడీపీ సర్కారుతో ఒప్పందం చేసుకుందని భ్రమింపజేశారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో అత్యంత కీలకమైన స్టార్టప్ ఏరియా అభివృద్ధి ప్రాజెక్ట్‌ను చంద్రబాబు, ఈశ్వరన్ ద్వయం కుట్రపూరితంగా తెరపైకి తెచ్చింది. ఒప్పందం సమయంలో సింగపూర్‌కు చెందిన ప్రైవేట్ కంపెనీ అసెండాస్–సిన్‌బ్రిడ్జ్–సెంబ్ కార్ప్ కన్సార్షియంను తెరపైకి తెచ్చారు. స్విస్ చాలెంజ్ విధానం ముసుగులో ఇతర సంస్థలేవీ పోటీ పడకుండా ఏకపక్షంగా 2017 మే 2న కట్టబెట్టేశారు. దీనికి చంద్రబాబు కేబినెట్ రాజముద్ర వేసింది. ఆ ఒప్పంద పత్రాలపై ఈశ్వరన్ సంతకాలు చేశారు. అప్పుడు ఆయన సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నారు. ఏకంగా సింగపూర్ ప్రభుత్వంతోనే ఒప్పందం చేసుకున్నట్లు చంద్రబాబు భ్రమింపజేశారు. స్టార్టప్ ఏరియా వాటాల కేటాయింపులోనూ చంద్రబాబు గోల్‌మాల్ చేశారు. స్టార్టప్ ఏరియా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5,721.9 కోట్లు వెచ్చించే రాష్ట్ర ప్రభుత్వానికి కేవలం 42 శాతం వాటా కల్పించారు. రూ.306.4 కోట్లు మాత్రమే వెచ్చించే అసెండాస్–సిన్‌బ్రిడ్జ్–సెంబ్ కార్ప్ కన్సార్షియానికి ఏకంగా 58 శాతం వాటా కట్టబెట్టేశారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేసే స్టార్టప్ ఏరియా స్థూల టర్నోవర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి మొదట విడతలో 5 శాతం, రెండో విడతలో 7.5 శాతం, మూడో విడతలో 12 శాతం వాటా మాత్రమే కేటాయించారు. స్టార్టప్ ఏరియా టర్నోవర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి సగటున కేవలం 8.7 శాతం వాటా దక్కనుండగా అసెండాస్–సిన్‌బ్రిడ్జ్–సెంబ్ కార్ప్ కన్సార్షియానికి మాత్రం 91.3 శాతం వాటా దక్కుతుందన్నది స్పష్టమైంది. ఆ కన్సార్షియం ముసుగులో చంద్రబాబు బినామీ పెట్టుబడులు పెట్టారు. అందుకు ఈశ్వరన్ సహకరించారు. తద్వారా స్టార్టప్ ఏరియాలో రూ.లక్షల కోట్ల విలువైన రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాన్ని హస్తగతం చేసుకోవాలని చంద్రబాబు పథకం వేశారు. స్టార్టప్ ఏరియాను ఆనుకుని ఉన్న 1,400 ఎకరాల అసైన్డ్ భూములను చంద్రబాబు ముఠా బినామీ పేర్లతో కొల్లగొట్టింది. మరోవైపు ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్డును ఆనుకుని భారీగా భూములు కొనుగోలు చేసింది. సింగపూర్‌లో చంద్రబాబు బినామీల పేరిట ఉన్న స్టార్ హోటళ్లు, ఇతర రియల్ ఎస్టేట్ పెట్టుబడులలోనూ ఈశ్వరన్ కీలకపాత్ర పోషించినట్లు అధికారిక, పారిశ్రామికవర్గాలు చెబుతుండటం గమనార్హం.

చంద్రబాబుదీ అదే పరిస్థితి..

సింగపూర్‌లో ఈశ్వరన్ పరిస్థితినే చంద్రబాబు దాదాపుగా ఎదుర్కొంటున్నారు. స్కిల్ స్కామ్‌లో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో 52 రోజులు రిమాండ్ ఖైదీగా ఉన్న అనంతరం చంద్రబాబు బెయిల్‌పై విడుదల అయ్యారు. రూ.5 వేల కోట్ల మేర అసైన్డ్ భూముల కుంభకోణం, రూ.2 వేల కోట్ల మేర ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణం, రూ.10 వేల కోట్ల ఇసుక కుంభకోణం, రూ.6,500 కోట్ల మద్యం కుంభకోణం, ఫైబర్ నెట్ కుంభకోణం కేసుల్లో కూడా చంద్రబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు. అవి విచారణ దశలో ఉన్నాయి. సెక్షన్ 17 ఏ ప్రకారం తన అరెస్ట్ అక్రమమన్న చంద్రబాబు వాదనను సుప్రీంకోర్టు పట్టించుకోలేదు. ఆయనపై కేసు కొట్టివేయడం సాధ్యం కాదని తేల్చి చెప్పింది.

బాబు, బాలయ్యలను రాజకీయ బిక్షగాళ్లుగా చేస్తాం

- అఖిల భారత జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం హెచ్చరిక
- ఆయన ఫ్లెక్సీల తొలగింపుపట్ల తీవ్ర ఆగ్రహం

సాక్షి, అమరావతి: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలను గురువారం తొలగింపజేసిన నందమూరి బాలకృష్ణపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఈ పరిణామంపట్ల తీవ్రంగా స్పందిస్తున్నారు. బాలకృష్ణకు తగిన గుణపాఠం చెప్పడంతోపాటు చంద్రబాబు, బాలకృష్ణలను ఈసారి రాజకీయ బిక్షగాళ్లను చేయడం తథ్యమని.. ఈ మేరకు జూనియర్ ఎన్టీఆర్ ప్రతి అభిమాని ప్రతినబూనారని వారు చెప్పారు. జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలను తొలగించాలని టీడీపీ కార్యకర్తలను బాలకృష్ణ ఆదేశించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. జూనియర్ ఎన్టీఆర్‌ను బాలకృష్ణ అంతగా ద్వేషిస్తుండటం తమ మనసులను కలచివేస్తోందని అఖిల భారత జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించింది. తన బావ చంద్రబాబు కళ్లల్లో ఆనందం కోసం ఆనాడు ఎన్టీ రామారావుకి వెన్నుపోటు పొడిచారు.. అనంతరం హరికృష్ణను వెంటాడిన విషయాన్ని ఆ సంఘం గుర్తు చేసింది. జూనియర్ ఎన్టీఆర్‌ను టార్గెట్ చేస్తున్నా ఇన్నాళ్లూ భరించామని.. ఇక మీదట ఏమాత్రం ఉపేక్షించేదిలేదని జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు తేల్చిచెప్పారు. బాలకృష్ణ అహంకారాన్ని అణచి ఆయన మదాన్ని వేటాడబోతున్నామని వారు వెల్లడించారు.

ఎన్టీఆర్ ప్రాణాలు తీసేసి.. ఇప్పుడు యుగపురుషుడంటారా?

చంద్రబాబు అండ్‌కోపై నందమూరి లక్ష్మీపార్వతి ధ్వజం




సాక్షి, అమరావతి: ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి అర్ధాంతరంగా పదవీచ్యుతిడిని చేసి ... ఆయన అకాల మరణానికి కారణమైనవారే.. నేడు యుగపురుషుడు అంటూ భజన చేస్తున్నారని చంద్రబాబు, ఆయన వర్గీయులపై ఎన్టీఆర్ సతీమణి, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి నిప్పులు చెరిగారు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు సైతం తండ్రి ప్రాణాలు పోవడంలో ప్రధాన పాత్ర పోషించారని, వాళ్లే ఇప్పుడు నాటకాలాడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి ప్రాణాలు తీసి 29 సంవత్సరాలైందని, చరిత్రలో లిఖించపడ్డ ఈ దారుణం ఎప్పటికీ చెరిగిపోదని లక్ష్మీపార్వతి పేర్కొన్నారు. మొగలుల వంశంలో ఔరంగజేబు తరహాలోనే ఎన్టీఆర్‌కు కూడా కుటుంబ సభ్యులే ద్రోహం తలపెట్టి, ఆయన అకాల మరణానికి కారణమయ్యారని మండిపడ్డారు. ఇప్పటికీ వారి చర్యలతో ఆయన ఆత్మకు మరింత క్షోభ కలిగిస్తున్నారని, ఎప్పటికీ చెరగని చరిత్ర సృష్టించిన ఎన్టీఆర్ ఆఖరి పేజీని కుటుంబసభ్యులే రాయడం గొప్ప విషాదమన్నారు. ఎన్టీఆర్ మరణానికి కారణమైన వారి పతనాన్ని ఎవ్వరూ ఆపలేరని లక్ష్మీపార్వతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన సీఎం జగన్

- గుడివాడ సభలో చంద్రబాబు
- భారీగా జనం వస్తారని ప్రచారం
- జనం లేక సభ వెలవెల..
- ప్రసంగం మధ్యలోనే ఆ కొద్ది మంది వెళ్లిపోయిన వైనం



చంద్రబాబు ప్రసంగం మొదలు కాగానే వెళ్లిపోతున్న జనం



గుడివాడ రూరల్: ఆంధ్రప్రదేశ్‌ను అప్పులపాలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఆయన గురువారం గుడివాడ మండలం మల్లాయపాలెం వద్ద పంట పొలాల్లో ఏర్పాటు చేసిన 'రా కదలిరా' బహిరంగ సభలో ప్రసంగించారు. సీఎం జగన్ సంక్షేమ పథకాల పేరుతో ఇస్తున్న సొమ్ము రూపాయి అయితే వసూలు చేస్తోంది రెట్టింపు ఉందన్నారు. మాజీ మంత్రి కొడాలి నాని బూతుల ఎమ్మెల్యే అని, నోరు తెరిస్తే డ్రైనేజీ కంటే బూతులు అధికంగా ఉంటాయని చెప్పారు. నాని పేకాట, క్యాసినో, ఇసుక దందాల్లో రూ.కోట్లు సంపాదించారని, ఆయన అనుచరులు పేదల భూములు స్వాహా చేశారని ఆరోపించారు. పేర్ని నాని కేవలం పవన్‌ను తిట్టేందుకే ఉన్నారని, ఆయన అనేక భూ దందాల్లో రూ.కోట్లు సంపాదించుకున్నారని చెప్పారు.

వచ్చిన వాళ్లూ వెళ్లిపోయారు

టీడీపీ నేతలు కొద్దిరోజులుగా హడావుడి చేసి, 25 ఎకరాల పంట పొలాల్లో సభ ఏర్పాటు చేసి, లక్ష మంది వస్తారని ప్రచారం చేసుకొన్నారు. అయినా చంద్రబాబు వచ్చే సమయానికి అందులో ఐదో వంతు కూడా లేరు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన పనులు, అభివృద్ధి అంటూ చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసం చెప్పడంతో వచ్చిన వాళ్లు కూడా వెళ్లిపోయారు. దీంతో స్థానిక టీడీపీ నాయకులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. రాష్ట్రాన్ని సీఎం జగన్ అప్పులపాలు చేశారని చంద్రబాబు చెప్పగా.. 'ఈయన హయాంలో జరిగిన అవినీతి, చేసిన అప్పుల గురించి చెప్పరేం!' అంటూ సభకు వచ్చిన వారు వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ ఆదాయాన్ని లూటీ చేసే పార్టీ మాది..

చంద్రబాబు ప్రసంగం మధ్యలో 'సంపదను సృష్టించటం తెలిసిన పార్టీ తెలుగుదేశం పార్టీ.. అవునా. కాదా. ప్రభుత్వ ఆదాయాన్ని లూటీ చేసే పార్టీ.. అవునా కాదా' అంటూ తన పార్టీ అసలు స్వరూపాన్ని బయటపెట్టుకున్నారు.

నిమ్మకూరులో స్పందన కరువు

నిమ్మకూరు (పామర్రు): ఎన్టీఆర్ స్వగ్రామం కృష్ణా జిల్లా నిమ్మకూరులో చంద్రబాబు పర్యటనకు ప్రజల నుంచి కనీస స్పందన లేదు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా చంద్రబాబు గురువారం నిమ్మకూరు వచ్చారు. ఎన్టీఆర్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబాబు మాట్లాడుతూ.. పేదలను ధన వంతులుగా చేసే కార్యక్రమాన్ని నిమ్మకూరు నుంచే ప్రారంభిస్తామని ప్రకటించారు. 90 రోజుల్లో గ్రామంలో ఉన్న ప్రతి పేదవాడిని ధనవంతుడిగా మారుస్తామని చెప్పారు.

ఉచ్ఛ నీచాల్లేని వ్యక్తి చంద్రబాబు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: రాజకీయాల్లో ఉచ్ఛం, నీచం లేని వ్యక్తి చంద్రబాబునాయుడని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా నాని గురువారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఉన్న కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని, ఆయన చూపిన మార్గమే తనకు ఆదర్శమని అన్నారు. ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ సొంత కుటుంబ సభ్యుల చేతిలో, అధికార దాహంతో అల్లాడుతున్న ఒక మోసకారి చేతిలో వంచనకు గురై పార్టీని, ముఖ్యమంత్రి పదవిని కోల్పోయి మనో వేదనతో మృతి చెందారన్నారు. ఎవరైతే ఎన్టీఆర్ పనికిరాడని చెప్పాడో, పార్టీ అధ్యక్ష పదవిని, ముఖ్యమంత్రి పదవిని లాక్కుని అధికారంలోకి వచ్చాడో వాడే, ఆ గజదొంగే ఇప్పుడు ఓట్ల కోసం ఎన్టీఆర్ బూట్లు నాకుతున్నాడన్నారు. ఇటువంటి నక్కజిత్తుల వేషాలను ప్రజలు తిప్పికొడతారని చెప్పారు. తెలంగాణలో ప్రజలు ఇప్పటికే తెలుగుదేశం పార్టీని భూస్థాపితం చేశారన్నారు. 2024 ఎన్నికల అనంతరం ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సైతం టీడీపీని, చంద్రబాబు నాయకత్వాన్ని కనుమరుగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బ్రతికుండగా దుర్మార్గుడని, పార్టీ నాయకుడిగా పనికిరాడని చెప్పి పదవి నుంచి దింపేసిన కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ గ్రామానికి వచ్చి విగ్రహాలకు దండలెయ్యడం, వర్ధంతులు చేస్తామనడం మోసపూరిత చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాబుని రా కదలిరా.. అంటున్న సెంట్రల్ జైలు

చంద్రబాబు రా కదలిరా అని జనంలోకి వస్తుంటే రాజమండ్రి సెంట్రల్ జైలు ఆయన్ని రా కదలిరా.. అని పిలుస్తోందని కొడాలి నాని వ్యాఖ్యానించారు. కన్ను పని చేయడంలేదు, కిడ్నీ పని చేయడంలేదు, ఇంకా ఏదో పని చేయడంలేదు అంటూ జిత్తులమారి నక్కలా తప్పించుకుంటున్న 420 గాడిని రాజమండ్రి సెంట్రల్ జైలు కదలి రమ్మని పిలుస్తోందని, ఆయన త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. త్వరగా జైలుకు వెళ్ల అని సుప్రీంకోర్టు బాబును ఆదేశించిందన్నారు.

ఎన్టీఆర్ వారసుడు జూనియర్ ఎన్టీఆరే

ఎన్టీఆర్ వారసులమని కుటుంబ సభ్యులు చెప్పుకుంటుంటే.. ప్రజలు మాత్రం జూనియర్ ఎన్టీఆర్‌నే ఆయనకు నిజమైన వారసుడిగా గుర్తిస్తున్నారని నాని చెప్పారు. ఫ్లెక్సీల తొలగింపు కుటుంబ సభ్యుల నీచమైన బుద్ధిని తెలియజేసిందే తప్ప జూనియర్ ఎన్టీఆర్‌కు జరిగే నష్టం ఏమీలేదన్నారు. తన అల్లుడు పప్పుగాడిని పైకి లేపేందుకు బాలకృష్ణ ఇటువంటి నీచమైన కార్యాలకు తెరలేపారన్నారు. బాలకృష్ణ, చంద్రబాబు లాంటి వారు వందల మంది వచ్చినా జూనియర్ ఎన్టీఆర్‌కు ఊడేదేమీలేదన్నారు. చంద్రబాబు ఇంతకు ముందు కూడా తనకు డిపాజిట్లు రాకుండా చేస్తానంటూ వీరంగం వేశారని, కానీ తాను నాలుగుసార్లు శాసన సభ్యునిగా గెల్చానని తెలిపారు. గుడివాడలో తనపై పోటీ చేస్తున్న అభ్యర్థులు మారుతున్నారు తప్ప తన గెలుపులో ఏమాత్రం తేడా లేదన్నారు. వైఎస్ జగన్ అధికారంలో ఉండటం, ఆయన పాలన కొనసాగడం తనకు ముఖ్యమని, పదవులు ఈకతో సమానమని అన్నారు. ప్రతి పార్టీకీ గెలవాలనే లక్ష్యం ఉంటుందని, గెలిచే వారికే టిక్కెట్లు ఇవ్వడం పార్టీ అధినేత ఆలోచన అని చెప్పారు. ఇవన్నీ సర్వ సాధారణమని, వీటితో చంద్రబాబుకు ఏం పని అని ప్రశ్నించారు. 1978లో చంద్రగిరిలో గెలిచిన చంద్రబాబు ఆ తర్వాత ఓడిపోలేదా అని ప్రశ్నించారు. ఆయన సీఎం అయ్యాక జరిగిన 5 ఎన్నికల్లో చంద్రగిరిలో ఒక్కసారైనా గెలిచారా అని అన్నారు. గన్నవరంలో గెలిచిన గద్దె రామ్మోహన్‌రావును విజయవాడలో, నందిగామలో గెలిచిన దేవినేని ఉమను మైలవరంలో, కొవ్వూరు నుంచి తెచ్చిన జవహర్‌ను తిరువూరులో బాబు ఎందుకు పోటీ చేయిస్తున్నాడని అన్నారు. బాలయ్య హిందూపూర్‌లో పుట్టాడా? వాడికి కొంపాగోడు ఉందా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ నక్కజిత్తుల చంద్రబాబు మాటలు నమ్మరని స్పష్టం చేశారు.

టీడీపీ, జనసేన మధ్య బిగుస్తున్న 'సీటు'ముడి

- నరసాపురంలో నేతల సిగపట్లు
- రెండు పార్టీల మధ్య తీవ్రరూపం దాల్చిన పొలిటికల్ వార్
- నాలుగు వర్గాలుగా చీలిపోయిన టీడీపీ
- టీడీపీ కార్యక్రమాలకు దూరంగా జన సైనికులు
- అంతకంటే దూరం పాటిస్తున్న టీడీపీ



సాక్షి ప్రతినిధి, ఏలూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన మధ్య పడిన 'సీటు'ముడి రోజురోజుకూ బిగుసుకుపోతోంది. రెండు పార్టీల మధ్య రాజకీయ కాక తారస్థాయికి చేరగా.. ఇరుపార్టీల నేతల మధ్య సిగపట్లు పెరిగాయి. ఉభయ పార్టీలు సోషల్ మీడియా వేదికగా పరస్పర మాటల యుద్ధంతో రచ్చకెక్కుతున్నారు. నరసాపురం టికెట్ తమదంటే.. తమదంటూ అనుకూల సమీకరణాలు చెప్పుకుంటూ హడావుడి చేస్తున్నాయి. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ టీడీపీతో దోస్తీ ప్రకటించిన నాటినుంచి నియోజకవర్గంలో రెండు పార్టీలూ కలిసికట్టుగా నిర్వహించిన కార్యక్రమాలు లేకపోగా.. తాజా పరిణామాలు ఆ పార్టీల మధ్య మరింత దూరం పెంచుతోంది. జనసేన నుంచి ఒకరు, టీడీపీ నుంచి నలుగురు టికెట్లు ఆశిస్తూ వర్గాలుగా విడిపోయి హంగామా సృష్టిస్తున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీ నాలుగు వర్గాలుగా చీలిపోయింది. తాజా పరిణామాలతో టీడీపీ కార్యక్రమాలకు జన సైనికులు దూరం జరగ్గా.. జన సైనికులతో అంతకంటే ఎక్కువగా టీడీపీ దూరం పాటిస్తోంది.

మింగుడు పడని రాజకీయం

రాష్ట్రంలోనే అతి చిన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో నరసాపురం ఒకటి. రాజకీయ పరంగా ప్రతిపక్షాలకు ఆదినుంచీ కొరుకుడుపడని విధంగానే ఉంటోంది. ఇప్పుడు కూడా సీటు విషయంలో గందరగోళం నెలకొని టీడీపీ, జనసేన పార్టీలకు మింగుడుపడటం లేదు. రెండు పార్టీలకు కనీస స్థాయిలో కూడా బలమైన ఇన్‌చార్జిలు లేకపోవడం, ఆశావహులు ఎక్కువగా ఉండటం, కుల సమీకరణాలు కీలక ప్రాధాన్యంగా మారడంతో నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. 1983 నుంచి 2004 వరకు నరసాపురంలో టీడీపీ గెలుపొందుతూ వచ్చింది. 2009లో ముదునూరి ప్రసాదరాజు గెలుపొందారు. మళ్లీ 2019లో వైఎస్ జగన్ ప్రభంజనంలో ఘన విజయం సాధించి ప్రభుత్వ చీఫ్ విప్‌గా కొనసాగుతున్నారు. పూర్తిగా పాజిటివ్ పాలిటిక్స్‌తో అర్థరహిత విమర్శలకు పోకుండా నియోజకవర్గంలో గడచిన నాలుగేళ్ల 9 నెలల కాలంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు నిర్వహించారు. మొదటినుంచీ ఆయన జనంలో బలంగా తిరుగుతున్నారు. ప్రసాదరాజు అన్నివర్గాలనూ కలుపుకుపోతూ నానాటికీ బలపడుతుండటంతో టీడీపీ, జనసేన శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి.

గత ఎన్నికల్లో రెండో స్థానం వచ్చినా..

2019 ఎన్నికల్లో జనసేన ఈ నియోజకవర్గంలో టీడీపీ కంటే ఎక్కువ ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. ఆ ఎన్నికల్లో టీడీపీని మూడో స్థానంలోకి నెట్టి దాదాపు 35 ఏళ్ల టీడీపీ రాజకీయ ప్రస్థానానికి జనసేన గండి కొట్టింది. నాటినుంచి నేటివరకు నియోజకవర్గంలో టీడీపీ కోలుకోలేని స్థితిలోకి వెళ్లిపోయింది. జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ 49,120 ఓట్లు సాధించగా.. టీడీపీ దారుణంగా పతనమై 27,059 ఓట్లకు పరిమితమైంది. ఈ నేపథ్యంలో పొత్తు లేకుండానే అత్యధిక ఓట్లు సాధించాం కాబట్టి పొత్తుల్లో పవన్ కల్యాణ్ కంటే ముందు నరసాపురం సీటును జనసేన పార్టీకే ప్రకటిస్తారని జనసేన కార్యకర్తలు నాయకులు సోషల్ మీడియాతోపాటు బహిరంగంగానూ బలంగా వాణి వినిపిస్తున్నారు. నియోజకవర్గంలో టీడీపీ పనైపోయిందంటూ జనసేన కార్యకర్తలు టీడీపీ నిర్వహించే కార్యక్రమాలకు, సమన్వయ కమిటీ కార్యక్రమాలకు, చంద్రబాబు పర్యటనలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. టీడీపీ సైతం జనసేనతో ఇదే దూరం పాటిస్తోంది.

జనసేనలోనూ గందరగోళమే

మరోవైపు అభ్యర్థి ఎవరనే విషయంలో జనసేన పార్టీలోనూ గందరగోళం నెలకొంది. గత ఎన్నికల్లో పోటీ చేసిన బొమ్మిడి నాయకర్‌కు ఈసారి ఆ పార్టీ నుంచి సీటొస్తుందో లేదో తెలియని సందిగ్ధ పరిస్థితి నెలకొంది. టీడీపీ సీటు కోసం ప్రయత్నిస్తున్న మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేన పార్టీ టికెట్ కోసం కూడా కర్చీఫ్ వేశారు. మెగాస్టార్ చిరంజీవి ద్వారా నరసాపురం జనసేన సీటు సాధించే ప్రయత్నాల్లో ఉన్నారు. మరోవైపు ఆక్వా వ్యాపారి చాగంటి మురళీకృష్ణ కూడా జనసేన టికెట్‌పై కన్నేశారు.

టీడీపీలో టికెట్ లొల్లి

టీడీపీలో టికెట్ లొల్లి తారాస్థాయికి చేరడంతో గందరగోళం నెలకొంది. నలుగురు అభ్యర్థులు టీడీపీ టికెట్ కోసం ప్రయత్నిస్తూ ఉన్న కొద్దిపాటి కేడర్‌ను చెల్లాచెదురు చేస్తున్నారు. 2014లో ఎమ్మెల్యేగా గెలుపొంది.. 2019లో ఓడిపోయిన బండారు మాధవనాయుడును టీడీపీ ఇన్‌చార్జిగా తొలగించి అత్యంత మొక్కుబడి నాయకుడైన పొత్తూరు రామరాజును ఇన్‌చార్జిగా నియమించింది. అప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి వేర్వేరుగా అడపాదడపా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా.. టీడీపీ సీటు ఆశిస్తూ ఎన్ఆర్ఐ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు కొద్ది నెలలుగా నియోజకవర్గంలో హంగామా చేస్తున్నారు. నరసాపురం సీటు జనసేనకు కేటాయించడం లేదని.. టీడీపీకి చెందిన ముగ్గురికీ కాకుండా తనకే వస్తుందంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో సొంత అజెండాతో ప్రతిచోటా ఇదే విషయాన్ని చెబుతున్నారు. ఇక అపార అనుభవం ఉండి.. అన్ని రాజకీయ పార్టీలూ తిరిగి వచ్చిన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు టీడీపీ టికెట్ కోసం విపరీతంగా లాబీయింగ్ చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు కూడా చంద్రబాబు తనకే సీటిస్తానని చెప్పారంటూ హడావుడి చేస్తూ నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జూ.ఎన్టీఆర్ ఫ్లెక్సీలు తీసేయండి

- హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద బాలకృష్ణ ఆదేశం.. తొలగించిన అనుచరులు
- తిరిగి ఏర్పాటు చేసేందుకు జూ. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రయత్నం
- అడ్డుకున్న పోలీసులు



ఎన్టీఆర్ ఘాట్ వద్ద తొలగించి బయట రోడ్డు పక్కన పెట్టిన జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలు



వరదాపురం సూరి వర్గీయులు పైకి ఎక్కకుండా మెట్ల వద్ద అడ్డుగా ఉన్న పరిటాల వర్గీయులు

హైదరాబాద్: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబంలో విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. గురువారం ఎన్టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకుని ఎన్టీఆర్ ఘాట్‌లోని ఆయన సమాధి వద్ద కుటుంబసభ్యులు నివాళులర్పించారు. ఎన్టీఆర్ ఘాట్ లోపల, ప్రవేశ ద్వారం రెండు వైపులా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్ చిత్రాలతో కూడిన భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. తెల్లవారు జామునే జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ వచ్చి తాతకు నివాళులర్పించారు. ఆ తర్వాత నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ, సుహాసినితోపాటు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వచ్చి నివాళులర్పించారు. తిరిగి వెళ్లే సమయంలో జూ.ఎన్టీఆర్ ఫ్లెక్సీలను చూసిన బాలకృష్ణ.. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. వెంటనే ఆయన అనుచరులు ఆ ఫ్లెక్సీలను తొలగించారు. కొన్నింటిని రోడ్డు ఫుట్‌పాత్‌పైన, మరికొన్ని ఘాట్ పార్కింగ్ ప్రాంతంలో కనిపించకుండా పెట్టారు. తమ హీరో ఫ్లెక్సీలు తొలగించారన్న విషయం తెలుసుకున్న జూ.ఎన్టీఆర్ అభిమానులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. బయట ఉంచిన ఫ్లెక్సీలను తిరిగి లోపల పెట్టేందుకు అనుమతించాలని పోలీసులను కోరారు. వారు అనుమతించలేదు. దీంతో ఘాట్ లోపల తొలగించకుండా వదిలేసిన జూ.ఎన్టీఆర్ ఫ్లెక్సీలకు పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. ఆ తర్వాత అక్కడికి వచ్చిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు ఫుట్‌పాత్‌పై ఉంచిన ఫ్లెక్సీలను ఘాట్ లోపలికి తీసుకువచ్చారు. పోలీసులు అడుకుని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కాగా, బాలకృష్ణ మాట్లాడుతూ సాహసోపేత పథకాల అమలుతో పేదవాడి ఆకలి తీర్చి, విప్లవాత్మక, సామాజిక మార్పులు తీసుకువచ్చిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.

అనంతపురంలో తమ్ముళ్ల తగువులాట

అనంతపురం క్రైం/ధర్మవరం/గుత్తి: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ వర్గాల మధ్య ఘర్షణలు జరిగాయి. అనంతపురం జిల్లా పరిషత్ ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు వచ్చిన జేసీ వర్గీయులు, వైకుంఠం ప్రభాకర చౌదరి వర్గీయులు ఘర్షణకు దిగారు. ఒకరినొకరు తోసుకొన్నారు. దీంతో ఎన్టీఆర్‌కు నివాళులర్పించేందుకు వచ్చిన మిగతా వారంతా వెళ్లిపోయారు. ధర్మవరంలో పరిటాల శ్రీరామ్ అనుచరులు, వరదాపురం సూరి వర్గీయులు ఘర్షణ పడ్డారు. పీఆర్‌టీ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు శ్రీరామ్ వర్గీయులు వచ్చారు. సూరి వర్గీయులు కూడా అదే సమయంలో అక్కడికి వచ్చారు. సూరి వర్గీయులను శ్రీరామ్ వర్గీయులు అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. వివాదం ముదరడంతో పోలీసులు కల్పించుకోవాల్సి వచ్చింది.



ఇదీ మార్పు

సింహపురి చిద్విలాసం

పినాకిని నది సాక్షిగా జిల్లా కేంద్రం నెల్లూరులో ప్రగతి పరుగులు పెడుతోంది. నగరం సరికొత్త హంగులను సంతరించుకుంటోంది. సింహపురి రూపురేఖలు మారిపోయి కొత్త సొబగులను అద్దుకుంది. ఇతర నగరాలకు ఆదర్శంగా నిలిచేలా ఇప్పటికే అనేక చర్యలు చేపట్టారు. నెల్లూరులో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.వంద కోట్లకు పైగా ఖర్చు చేసింది. నగరంలో ఇప్పటికే 90 శాతం రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టులు, పైపులైన్లు నిర్మాణం పూర్తి కాగా మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తి కానున్నాయి.

చిలకా మస్తాన్‌రెడ్డి, సాక్షి ప్రతినిధి, నెల్లూరు

ప్రజ్వరిల్లే పురోగతి..


- ప్రశాంతినగర్, నవాబుపేట, టీచర్స్‌కాలనీ, జ్యోతినగర్ తదితర ప్రాంతాల్లో రూ.94.79 కోట్ల వ్యయంతో 100 కి.మీ. మేర సీసీ, బీటీ రోడ్లను ఏర్పాటు
- 15వ ఆర్థిక సంఘం నిధులు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.8.04 కోట్లతో 70 కి.మీ. మేర తాగునీటి పైపులైన్ల ఏర్పాటు
- బుజబుజనెల్లూరు ప్రాంతాల్లో రూ.59.82 కోట్ల వ్యయంతో 60 కి.మీ. మేర మురుగునీటి కాలువల నిర్మాణం
- నగరపాలక సంస్థ సాధారణ నిధులు, ఎన్‌సీఏపీ నిధులు రూ.0.67 కోట్లతో నగరంలోని వివిధ పార్కుల అభివృద్ధి, సుందరీకరణ పనులు
- నగరపాలక సంస్థ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.84 కోట్లతో రోడ్లకిరువైపులా 60 వేల మొక్కల ఏర్పాటు
- నగరపాలక సంస్థ సాధారణ నిధులు, సీఎస్ఆర్ నిధులు రూ.0.46 కోట్లతో 5.95 కి.మీ. మేర డివైడర్ల సుందరీకరణ పనులు
- నగరపాలక సంస్థ పరిధిలోని మైనారిటీలను దృష్టిలో ఉంచుకుని రూ.0.10 కోట్లతో 1078.23 చ.మీ. విస్తీర్ణంలో షాదీమంజిల్ (జీ+2) నిర్మాణం
- బీవీఎస్ పాఠశాల క్రీడామైదానంలో బాలికల కోసం రూ. 2.09 కోట్లతో ప్రత్యేకంగా ఇండోర్ షటిల్ కోర్టు, బాస్కెట్‌బాల్ కోర్టులు ఏర్పాటు
- రూ.5.5 కోట్ల స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో 64 ప్రాంతాల్లో కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం

సాకారమైన నెల్లూరు నగర చిరకాల కోరిక

- గుంతల రోడ్ల నుంచి విశాలమైన రహదార్ల వరకూ విస్తరణ
- అభివృద్ధి పనుల కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం
- 12 జంక్షన్ల ఏర్పాటుతో తొలగిన ట్రాఫిక్ కష్టాలు
- మినీబైపాస్ రోడ్డులో ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం పూర్తి
- టిడ్కో గృహాల కోసం నగరంలో 10 లేఅవుట్‌లు ఏర్పాటు
- ఇందుకోసం రూ.176 కోట్లతో 9,293 ఇళ్ల నిర్మాణం



నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్



విద్యుత్ వెలుగుల్లో ప్రధాన రహదారులు

నెల్లూరు కార్పొరేషన్ పరిధి - **149.20** చదరపు కి.మీ.

జనాభా (2011 ప్రకారం) **6** లక్షలకు పైగా

ప్రస్తుత జనాభా (అంచనా) **8** లక్షలకు పైగా

నాడు

టీడీపీ పాలనలో నేతల కుమ్ములాటలు, నిధులు మంజూరులో జాప్యం, ఖర్చు పెట్టడంలో నిర్లక్ష్యం. నీరు–చెట్టు, ఇసుక, మద్యంలో నిధుల స్వాహా, గుంతల రోడ్లు, అస్తవ్యస్త డ్రైనేజీ, మురికి కూపంలా పట్టణ ఆరోగ్య కేంద్రాలు, తాగునీటి సమస్యలు. నగరం మొత్తం దుమ్ము, ధూళి, ఏ వీధి చూసినా చెత్త కుప్పలు. వెరసి పడకేసిన అభివృద్ధి.

నేడు

నగరంలోని జంక్షన్లు అభివృద్ధి చెందాయి. రోడ్లు విశాలంగా మారాయి. వివిధ ప్రాంతాల్లోని 12 జంక్షన్లను సుందరీకరించారు. అభివృద్ధి పనులకు రూ.వంద కోట్లు ఖర్చు పెట్టారు. ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమయ్యాయి. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. క్రమంగా సింహపురి నగర రూపురేఖలు మారుతూ వచ్చాయి. ఈ మార్పు కేవలం నాలుగున్నరేళ్లలోనే సాధ్యమైంది. నగర వాసుల కష్టాలకు చెక్ పడింది.



ఫ్లై ఓవర్ వంతెన.. సీసీ రోడ్ల నిర్మాణం

కేంద్ర నిధులతో నగరంలోని మినీబైపాస్ రోడ్డు, రామలింగాపురం జంక్షన్ వద్ద రూ.41.88 కోట్లతో అత్యాధునిక టెక్నాలజీతో 810 మీటర్ల పొడవున ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. తద్వారా ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరాయి. రూ.9 కోట్లతో 2.7 కి.మీ. మేర మైపాడు ప్రధాన రహదారిని నాలుగు లేన్ల సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. నగరంలోని జీఎన్‌టీ రోడ్డు, మినీబైపాస్ రోడ్డు, స్టోన్‌హౌస్‌పేట తదితర ప్రాంతాల్లో దాదాపు 23 కి.మీ. మేర రూ.60 లక్షలు వెచ్చించి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు.

వేగంగా ప్రగతి బాటలు..

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో నీటి సరఫరా, డ్రైనేజీ, చెత్త సేకరణ, వీధిదీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ 14వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్స్, సఫాయి మిత్ర ప్రైజ్ మనీ వంటి వివిధ వనరుల నుంచి రూ.8.5 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

బాగుపడ్డ ప్రభుత్వ బడులు

నాడు–నేడు ఫేజ్–2 కార్యక్రమం మంజూరైన నిధులు – రూ.31 కోట్లు

- ఇందులో కొత్త ఏసీఆర్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, మరమ్మతులు, పునరుద్ధరణలు, 47 పాఠశాలలు నిర్మాణాలు ఉన్నాయి. వాటితోపాటు 101 అదనపు తరగతి గదులు కూడా స్లాబ్ లెవల్‌కు పూర్తయ్యాయి.



'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంజూరైన నిధులు	- రూ.46.60 కోట్లు
నగర వ్యాప్తంగా చేపట్టిన పనుల వివరాలు	598
పూర్తయిన పనులు	288
వీటికైన ఖర్చు	రూ.18.93 కోట్లు
పురోగతిలో ఉన్న పనుల వివరాలు	182
చేపట్టాల్సిన పనులు	128

సొంతింటి కల సాకారం

- టిడ్కో ద్వారా నిర్మించిన ఇళ్లు: **22,512**
- నిర్మాణాలు చేపట్టిన ప్రాంతాలు: వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి, కొండ్లపూడి
- నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని ఏర్పాటైన లే అవుట్‌లు: **10**
- ఇందుకోసం చేసిన ఖర్చు: రూ.**176** కోట్లు
- నిర్మించిన గృహాలు: **9,293**
- రూరల్ నియోజకవర్గంలో పూర్తి చేసిన గృహాలు: **10,237**
- ఇందుకైన వ్యయం: రూ.**200** కోట్లు

ప్రజారోగ్యానికి పెద్దపీట

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లకు మంజూరైన నిధులు రూ. 10.40 కోట్లు	ఇప్పటికే పూర్తయిన యూపీహెచ్‌సీలు - 12; పూర్తయ్యే దశలో 1 ఉంది.
2020-21 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు	
ప్రతిపాదించిన నిధులు రూ.43.60 కోట్లు	గుర్తించిన పనులు - 140; పూర్తయిన పనులు - 70
ఇందుకు ఖర్చు చేసిన నిధులు రూ.16.61 కోట్లు	
2021-22 సంవత్సరానికి రూ.10.22 కోట్లతో చేపట్టిన పనులు	
ప్రతిపాదించిన పనులు - 28; పూర్తయిన పనులు -8	ఖర్చు చేసిన నిధులు - రూ. 2.92 కోట్లు



సర్వేపల్లి కాలువకు ఇరువైపులా నిర్మించిన రిటర్నింగ్ వాల్

నగరాన్ని సుందరీకరిస్తున్నాం



నెల్లూరు నగరాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నాం. అవసరమైన ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్లు, వీధిదీపాలు, పార్కులు తదితర పనులు చేపడుతున్నాం. నగరాన్ని ఆహ్లాదకరంగా ఉండేలా సుందరీకరిస్తున్నాం.

– వికాస్‌మర్మత్, కమిషనర్, నెల్లూరు నగర పాలక సంస్థ

రోడ్డు బాగుపడింది



నెల్లూరు నగరం నుంచి ఇందుకూరుపేట మండలం మైపాడుకు వెళ్లే ప్రధాన రహదారి మైపాడు రోడ్డును వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు లేన్ల సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు.

– సుబ్బారెడ్డి, బంగ్లాతోట, నెల్లూరు



జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం ద్వారా గడిచిన 2020-21, 2022, 2023 సంవత్సరాల్లో ట్రాక్టర్ల కొనుగోలు, సీసీ ప్యాచ్ వర్క్‌లు, వాటర్ ఫౌంటెయిన్లు, రోడ్లు వేయడం, పార్కుల అభివృద్ధి పనుల కోసం రూ.7.82 కోట్లు విడుదలయ్యాయి.

- ఇందులో చేసిన ఖర్చు – రూ.5.84 కోట్లు
- మిగిలిన రూ.1.98 కోట్లు పనుల కోసం వినియోగించనున్నారు.
- 2023–24 సంవత్సరానికి రూ.14.55 కోట్లకు సంబంధించిన ప్రతిపాదనలు కాలుష్య నియంత్రణ మండలికి సమర్పించారు.

కార్పొరేషన్ జనరల్ ఫండ్స్‌తో చేసిన పనులు

- 2023–24 సంవత్సరానికి పురపాలక సాధారణ నిధుల నుంచి మంజూరైన నిధులు – రూ.19.75 కోట్లు
- ఇందులో రూ.4.83 కోట్లతో 67 పనులు పూర్తి
- రూ.4.83 కోట్లతో 49 పనుల పురోగతి
- రూ.5.69 కోట్లతో 74 పనులు ప్రారంభించాల్సి ఉంది.
- మరో రూ.4.43 కోట్లకు సంబంధించిన 40 పనులకు టెండర్ ప్రక్రియలో ఉంది.

22 నుంచి ఆలిండియా పోలీస్ కమాండో పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న ఏడీజీ మీనా

విశాఖ స్పోర్ట్స్: విశాఖలోని గ్రేహౌండ్స్ గ్రౌండ్స్‌లో 14వ ఆలిండియా పోలీస్ కమాండో కాంపిటేషన్స్ (ఏఐపీసీసీ) 22వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహిరచనున్నారు. 23 రాష్ట్ర, కేంద్ర పోలీసు బలగాల జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. ఈ సందర్భంగా అదనపు డీజీ(ఆపరేషన్స్) రాజీవ్‌కుమార్ మీనా గురువారం గ్రేహౌండ్స్ గ్రౌండ్‌లో విలేకరులతో మాట్లాడారు. 22న హోంమంత్రి తానేటి వనిత ఈ పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. 16 రాష్ట్రాల పోలీసు జట్లతో పాటు ఏడు కేంద్ర పోలీస్ సంస్థల జట్లు ఐదు స్థాయిల్లో జరిగే ఈ పోటీల్లో తలపడనున్నాయన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా జరగనున్న ఈ పోటీలకు గ్రేహౌండ్స్ ఆతిథ్యం ఇవ్వనుందన్నారు. పోటీల్లో పాల్గొనే 23 జట్ల రక్షణ, సౌకర్యం, భద్రతకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పోటీలు విజయవంతం చేసేందుకు డీజీపీ కార్యాలయం, వైజాగ్ సిటీ పోలీస్, జీవీఎంసీ, హెల్త్, రెవెన్యూ విభాగాలతో పాటు నగరపౌరులు సహాయసహకారాలు అందిస్తున్నారని వివరించారు. ఈనెల 30వ తేదీన నిర్వహించే ముగింపు కార్యక్రమానికి డీజీపీ కసిరెడ్డి వెంకట రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరై ట్రోఫీలు అందిస్తారని చెప్పారు. గ్రేహౌండ్స్ ఉన్నతాధికారులు, కమాండర్లు పాల్గొన్నారు.

కాకినాడలో భారీ ఎల్‌ఎన్‌జీ ఫ్లోటింగ్ టెర్మినల్

- రూ.8,300 కోట్లతో ఏర్పాటు చేయనున్న నార్వేకు చెందిన క్రౌన్ ఎల్‌ఎన్‌జీ
- ఏడాదికి 7.2 మిలియన్ టన్నుల ఎల్‌ఎన్‌జీ దిగుమతి
- దేశంలోనే రెండో అతిపెద్ద ఎల్‌ఎన్‌జీ టెర్మినల్‌గా ఏర్పాటు
- క్రౌన్ ఎల్‌ఎన్‌జీ సీఈవో స్వపన్ కఠారియా వెల్లడి

ఫిబ్రవరిలో రాష్ట్రానికి క్రౌన్ ఎల్‌ఎన్‌జీ ప్రతినిధుల బృందం

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి క్రౌన్ ఎల్‌ఎన్‌జీ ఆసక్తి చూపిస్తోందని, ఇప్పటికే తొలి దశ చర్చలు పూర్తయ్యాయని ఏపీ మారిటైమ్ బోర్డు డిప్యూటీ సీఈవో రవీంద్రనాథ్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. వచ్చే నెలలో ఈ ప్రాజెక్టుపై పూర్తిస్థాయి స్పష్టత వస్తుందని చెప్పారు. ఫిబ్రవరిలో క్రౌన్ ఎల్‌ఎన్‌జీ ప్రతినిధుల బృందం రాష్ట్ర పర్యటనకు రానుందని వెల్లడించారు.

సాక్షి, అమరావతి: నార్వేకు చెందిన క్రౌన్ ఎల్‌ఎన్‌జీ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. కాకినాడ వద్ద సముద్రంలో రూ.8,300 కోట్లతో ఫ్లోటింగ్ లిక్విఫైడ్ న్యాచురల్ గ్యాస్ (ఎల్‌ఎన్‌జీ) టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. ఎల్‌ఎన్‌జీని దిగుమతి చేసుకుని దానిని రీగ్యాసిఫికేషన్ చేసి దేశంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేసే విధంగా 7.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఈ టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నట్లు క్రౌన్ ఎల్‌ఎన్‌జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వపన్ కఠారియా ప్రకటించారు. భారతదేశ పర్యటనకు వచ్చిన కఠారియా తాజాగా ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ 2028 నాటికి కాకినాడ వద్ద సముద్రంలో తేలియాడే ఎల్‌ఎన్‌జీ యూనిట్‌ను వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. తీవ్ర తుపానులు అధికంగా ఉండే ప్రాంతం కావడంతో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే విధంగా ఈ టెర్మినల్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంటుందని, సాంకేతిక పరిజ్ఞానం కోసం పలు అంతర్జాతీయ సంస్థలతో క్రౌన్ ఎల్‌ఎన్‌జీ ఒప్పందం కుదుర్చుకుంటోందని వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో ఆరు ఎల్ఎల్‌జీ టెర్మినల్స్ ఉండగా, ఇవి పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేయడంలేదన్నారు. ప్రపంచంలో చౌకగా లభించే ఎల్‌ఎన్‌జీని దిగుమతి చేసుకుని రీగ్యాసిఫికేషన్ ప్రక్రియ నిర్వహించి తిరిగి సరఫరా చేసే విధంగా దేశంలోనే రెండో అతిపెద్ద టెర్మినల్‌గా కాకినాడ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కఠారియా వివరించారు.

ఎల్‌ఎన్‌జీకి పెరుగుతున్న డిమాండ్

దేశీయ ఇంధన అవసరాల్లో సహజవాయువు వినియోగాన్ని భారీగా పెంచాలని ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకోవడంతో ఎల్‌ఎన్‌జీకి డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం దేశీయ ఇంధన అవసరాల్లో ఎల్‌ఎన్‌జీ వినియోగం 6 శాతంగా ఉందని, దానిని 2030 నాటికి 15 శాతానికి పెంచాలని ప్రధాని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఏడాది దేశ వ్యాప్తంగా 20.2 మిలియన్ టన్నుల ఎల్‌ఎన్‌జీ వినియోగం జరగ్గా, పదేళ్లలో ఇది 72.9 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

ఫిబ్రవరిలో ఇన్‌శాట్–3డీఎస్ ప్రయోగం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈనెల 26న తలపెట్టిన జీఎస్‌ఎల్‌వీ ఎఫ్14 ప్రయోగాన్ని సాంకేతిక కారణాల వల్ల ఫిబ్రవరి రెండో వారానికి వాయిదా వేసింది. జీఎస్‌ఎల్‌వీ ఎఫ్14 రాకెట్ ద్వారా 2,060 కిలోల బరువు కలిగిన ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనుంది. ప్రస్తుతం షార్‌లోని రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఉన్న వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధానం పనులు జరుగుతున్నాయి. ఖగోళ పరిశోధనకు ఉపయోగపడే ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహానికి నాసా కూడా సహకారం అందించింది. ఈ ఉపగ్రహం కోసం అత్యంత పవర్‌ఫుల్ యాంటెన్నాను నాసా రూపొందించింది. 6–చానల్ ఇమేజర్, 19–చానల్ సౌండర్ అనే పేలోడ్స్‌ను ఉపగ్రహంలో అమర్చి పంపిస్తున్నారు.

27 నుంచి దక్షిణ భారత సైన్స్ ఎగ్జిబిషన్

- విజయవాడ వేదికగా 6 రోజుల పాటు నిర్వహణ
- రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచిన 210 ప్రాజెక్టులతో ప్రదర్శన

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విద్యార్థుల్లోని సైన్స్ సామర్థ్యాలను వెలికితీసేందుకు దక్షిణ భారత సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఆంధ్రప్రదేశ్ వేదిక కానుంది. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు విజయవాడలో నిర్వహించేందుకు ఏపీ ఎస్సీఈఆర్టీ ఏర్పాట్లు చేస్తున్నది. ఏపీ పాఠశాల విద్యాశాఖ, విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ మ్యూజియం, కర్ణాటక సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఆరు రోజుల పాటు ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నాయి. ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రూపొందించిన 210 ఎగ్జిబిట్లను ఇక్కడ ప్రదర్శించనున్నారు. ఇక్కడ అత్యుత్తమంగా నిలిచిన ఎగ్జిబిట్లను ప్రదర్శించిన వారిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. కాగా, ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో పాఠశాల స్థాయినుంచి మండల, జిల్లా స్థాయి దాటి రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులే సదరన్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాలుపంచుకోనున్నారు. మన రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు రూపొందించిన 30 సైన్స్ నమూనాలకు ఇక్కడ అవకాశం కల్పించారు.

సైన్స్ రంగంలో విద్యార్థులకు ప్రోత్సాహం

పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సైన్స్ పట్ల ఉన్న విజ్ఞాన అవగాహనకు రూపం ఇచ్చి వారిని ఈ రంగంలో మరింత రాణించేలా ప్రోత్సహించేందుకు ఈ సైన్స్ ఎగ్జిబిషన్ దోహదం చేస్తుందని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. సదరన్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, భూమి/స్పేస్ సైన్స్, పర్యావరణం, ఇంజనీరింగ్, బయో సైన్స్, కంప్యూటర్ సైన్స్ రంగాలకు చెందిన అంశాలకు చోటు కల్పించామని చెప్పారు. కాగా, మొత్తం ఆరు రోజుల పాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో చివరి మూడు రోజులు పాఠశాలల విద్యార్థులు సందర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు.

అమెరికన్ షిప్‌నకు 'ఐఎన్‌ఎస్ విశాఖపట్నం' సాయం



దెబ్బతిన్న ఎంవీ జెన్‌కో కార్గో షిప్

సాక్షి, విశాఖపట్నం: ఓవైపు హౌతీ రెబల్స్ రెచ్చిపోతూ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు యత్నిస్తుండగా..వారి ఎత్తుల్ని చిత్తు చేసి పహారా కాసేందుకు భారత నౌకాదళం దూకుడుగా వ్యవహరిస్తోంది. తాజాగా గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో అమెరికాకు చెందిన జెన్‌కో పికార్డీ అనే కంటైనర్ షిప్‌పై హౌతీ రెబల్స్ దాడి చేశారు. ఎడెన్‌కు ఆగ్నేయంగా 70 నాటికల్ మైళ్ల దూరంలో బుధవారం రాత్రి 11 గంటలకు మార్షల్ ఐలాండ్ జెండాతో ఉన్న ఎంవీ జెన్‌కో పికార్డీ కంటైనర్ షిప్‌పై హౌతీ రెబల్స్ డ్రోన్‌తో బాంబులు జారవిడిచారు. దీంతో..షిప్‌లో కొంత భాగం దెబ్బతింది. సహాయం కావాలంటూ షిప్ నుంచి అభ్యర్థన రాగానే భారత నౌకాదళం అప్రమత్తమైంది. గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో యాంటీ పైరసీ ఆపరేషన్‌లో భాగంగా పహారా కాస్తోన్న గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ విశాఖపట్నం గురువారం వేకువజామున దెబ్బతిన్న జెన్‌కో పికార్డీ షిప్ వద్దకు చేరుకుంది. స్వల్పంగా ఉన్న మంటలను భారత నౌకాదళం అదుపులోకి తీసుకువచ్చింది. దాడి జరిగిన సమయంలో షిప్‌లో 22 మంది సిబ్బంది ఉండగా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని భారత నౌకాదళం తెలిపింది. జెన్‌కో షిప్‌నకు ఐఎన్ఎస్ విశాఖపట్నం షిప్ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేయడంతో..కంటైనర్ షిప్ తన ప్రయాణాన్ని తిరిగి కొనసాగించింది.

క్లుప్తంగా...

ఏపీటీడీసీ, శాప్ పాలక మండళ్ల పదవీకాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) పాలక మండలి సభ్యుల పదవీ కాలాన్ని పొడిగిస్తూ పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ గురువారం ఉత్తర్వులిచ్చారు. గతేడాది సెప్టెంబర్ 20వ తేదీతో 12 మంది సభ్యుల పదవీ కాలం ముగిసింది. ఈ క్రమంలో ప్రభుత్వం మరో రెండేళ్ల పాటు వీరి పదవీ కాలాన్ని పొడిగించింది. అలాగే, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)కు చెందిన 12 మంది పాలకమండలి సభ్యుల పదవీ కాలాన్ని తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు పొడిగిస్తూ యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న ఉత్తర్వులిచ్చారు.

ఏపీఎండీసీ కేలండర్ ఆవిష్కరణ



ఏపీఎండీసీ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) రూపొందించిన డైరీ, కేలండర్లను రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో గురువారం 2024 నూతన సంవత్సరం డైరీ, కేలండర్లను గనులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డికి అందజేశారు. ఏపీఎండీసీ నిర్వహించే సంక్షేమ కార్యక్రమాలతో కూడిన కేలండర్ మంత్రి పరిశీలించారు. సంస్థ జీఎంలు టి.నతానేయల్, ఆళ్ల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20న కళాకారులకు గుర్తింపు కార్డుల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ గురువారం తెలిపారు. ఈ నెల 20న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి రోజా కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తారని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్‌లోకి పార్ట్‌టైమ్ పీజీటీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో కొన్నేళ్లుగా పార్ట్ టైమ్ పీజీటీలుగా పనిచేస్తోన్న 398 మందిని ప్రభుత్వం కాంట్రాక్టు విధానంలోకి మార్పు చేసింది. ఈమేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులిచ్చారు. వీరికి గతనెలలోనే కాంట్రాక్టు వేతన స్కేలును కూడా అమలు చేశారు. పీజీటీలు సీఎం జగన్, మంత్రి బొత్సకు కృతజ్ఞతలు తెలిపారు.

నానో జింక్, కాపర్ వచ్చేస్తున్నాయ్!

ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరుగుతున్న సూక్ష్మ ఎరువుల వినియోగం

2023-24 సీజన్‌లో ఇప్పటికే 2.50 లక్షల బాటిళ్ల సూక్ష్మ ఎరువుల అమ్మకాలు

రబీ కోసం మరో 2.16 లక్షల బాటిల్స్



సాక్షి, అమరావతి: ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో సూక్ష్మ ఎరువుల వినియోగం పెరుగుతోంది. ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చిన నానో యూరియా, డీఏపీలకు రైతుల నుంచి విశేష ఆదరణ లభిస్తుండగా.. వచ్చే సీజన్ నుంచి సూక్ష్మ పోషకాలైన జింక్, కాపర్‌ను కూడా నానో రూపంలో అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో–ఆపరేటివ్ (ఇఫ్కో) నానో టెక్నాలజీ ద్వారా ద్రవరూపంలో సూక్ష్మ ఎరువులను దశలవారీగా మార్కెట్‌లోకి తీసుకొస్తుంది. ఖరీఫ్–21లో నానో యూరియాను మార్కెట్‌లోకి తీసుకురాగా.. ఖరీఫ్–23 నుంచి నానో డీఏపీని మార్కెట్‌లోకి తెచ్చింది. ఖరీఫ్–21లో 34,128 బాటిల్స్, రబీ 2021–22లో 5.46 లక్షల బాటిల్స్, ఖరీఫ్–2022లో 2.50 లక్షల బాటిల్స్, రబీ 2022–23లో 4.80 లక్షల బాటిల్స్ విక్రయాలు జరిగాయి. ఖరీఫ్–2023 నుంచి డీఏపీ కూడా మార్కెట్‌లోకి రాగా.. ఆ సీజన్‌లో 1.69 లక్షల నానో యూరియా, 21 వేల నానో డీఏపీ బాటిళ్ల విక్రయాలు జరిగాయి. ప్రస్తుత రబీ 2023–24 సీజన్‌లో ఇప్పటివరకు 53,784 నానో యూరియా, 7,320 నానో డీఏపీ బాటిళ్లను రైతులు కొనుగోలు చేశారు. ఇంకా 96,076 బాటిల్స్ నానో యూరియా, 1,20,504 లీటర్ల నానో డీఏపీ బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి.

ఖరీఫ్ నుంచి మరిన్ని..



రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో నానో ఎరువుల వినియోగంపై రైతుల్లో చైతన్యం పెరుగుతోంది. వచ్చే ఖరీఫ్ నుంచి వీటి నిల్వలను మరింత పెంచేందుకు చర్యలు చేపట్టాం. వచ్చే సీజన్ నుంచి నానో జింక్, కాపర్ వంటి పోషకాలను కూడా నానో రూపంలో తీసుకొచ్చేందుకు ఇఫ్కో సన్నాహాలు చేస్తోంది.

– టి.శ్రీధర్‌రెడ్డి, స్టేట్ మార్కెటింగ్ మేనేజర్, ఇఫ్కో

సంప్రదాయ ఎరువుల కంటే చౌకగా..

500 మిల్లీలీటర్ల నానో యూరియా 45 కేజీల సంప్రదాయ యూరియా బస్తాకు సమానం కాగా.. 500 మిల్లీలీటర్ల నానో డీఏపీ 50 కేజీల సంప్రదాయ డీఏపీ ఎరువుల బ్యాగ్‌తో సమానం. సంప్రదాయ యూరియా బస్తా (45 కేజీలు) మార్కెట్‌లో రూ.266.50 కాగా, 500 మిల్లీలీటర్ల నానో యూరియా ధర రూ.240గా నిర్ధారించారు. సంప్రదాయ డీఏపీ ఎరువుల బస్తా రూ.1,350 కాగా, 500 మిల్లీలీటర్ల డీఏపీ బాటిల్ ధర రూ.600గా నిర్ణయించారు.

అవయవ దానంతో నలుగురికి పునర్జన్మ

- స్విమ్స్, పద్మావతి హృదయాలయలో గుండె, లివర్, కిడ్నీ ఆపరేషన్లు
- వైద్యులను అభినందించిన టీటీడీ జేఈవో సదాభార్గవి



హేమకుమార్ (ఫైల్ ఫొటో)

తిరుపతి మంగళం: బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవాలను దానం చేసి నలుగురికి పునర్జన్మనిచ్చారు అతడి తల్లిదండ్రులు. వివరాలివీ.. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం సామనత్తం గ్రామానికి చెందిన గొల్లపల్లి హేమకుమార్ ఈ నెల 11న రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా.. అతనికి 16వ తేదీన బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో హేమకుమార్ తల్లిదండ్రులు అతడి అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. అతడి గుండె, కాలేయం, రెండు ఊపిరితిత్తులను శస్త్రచికిత్స చేసి వైద్యులు జాగ్రత్త చేశారు. గురువారం తిరుపతిలోని పద్మావతి హృదయాలయంలో చికిత్స పొందుతున్న 29 ఏళ్ల వ్యక్తికి గుండెను అమర్చారు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న పూతలపట్టు మండలానికి చెందిన 51 సంవత్సరాల మహిళకు ఒక మూత్రపిండాన్ని, స్విమ్స్‌లోనే చికిత్స పొందుతున్న 53 ఏళ్ల మహిళకు కాలేయాన్ని అమర్చారు. కాగా.. స్విమ్స్‌లో తొలిసారి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఇదే కావడం విశేషం. మరొక కిడ్నీని నెల్లూరు అపోలో ఆస్పత్రిలో ఒకరికి అమర్చారు.



శస్త్ర చికిత్సలు నిర్వహించిన వైద్య బృందాన్ని అభినందిస్తున్న టీటీడీ జేఈవో సదాభార్గవి

ఒకే రోజు మూడు కీలక ఆపరేషన్లు

టీటీడీకి అనుసంధానంగా ఉన్న స్విమ్స్, పద్మావతి హృదయాలయ ఆస్పత్రుల్లో గురువారం ఒకే రోజు మూడు అరుదైన అవయవ మార్పిడి ఆపరేషన్లు నిర్వహించడం చారిత్రక ఘట్టమని టీటీడీ జేఈవో సదాభార్గవి పేర్కొన్నారు. క్లిష్టమైన ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించిన వైద్యులు రామ్, అనిల్‌కుమార్, శ్రీనాథ్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, రజనీకాంత్, సెల్వకుమార్, సతీష్ (గ్లోబల్ హాస్పిటల్, చెన్నై), స్విమ్స్ అనస్థీషియా విభాగాధిపతి అలోక్ సమంత, ఆర్ఎంఓ కోటిరెడ్డి, నర్సింగ్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ప్రభావతి, ఎంఎస్‌డబ్ల్యూ ప్రసాద్‌రెడ్డిని టీటీడీ జేఈవో సదాభార్గవి, స్విమ్స్ డైరెక్టర్ రవిశంకర్ అభినందించారు.

ఆరోగ్యకర గ్రామాలే లక్ష్యం

కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్

- రాష్ట్రంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం
- ప్రతి ఇంటికీ ఫ్యామిలీ డాక్టర్లు.. ఉచిత చెకప్‌తో పాటు మందులు
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వెల్లడి



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్

తిరుపతి సిటీ: ఆరోగ్యకర గ్రామాలే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ చెప్పారు. గురువారం తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీలో కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో హెల్తీ విలేజ్ పేరుతో మూడు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు. వారికి కావలసిన అన్ని వైద్య సౌకర్యాలను అందిస్తోందని తెలిపారు. అలాగే జలజీవన్ మిషన్ ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ తాగునీరు అందజేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌లతో పాటు స్వయం సహాయక సంఘాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. తాగునీరు, శిశు సంక్షేమం, పారిశుధ్యం, విద్య తదితరాలపై గ్రామ పంచాయతీలు దృష్టి సారించాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. గ్రామ సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, ఆర్బీకేలు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుతో పాటు గర్భిణులు, పిల్లలు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారని వివరించారు. అనంతరం కేంద్ర మంత్రితో కలిసి డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు మీడియాతో మాట్లాడారు. ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో అనేక పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు ద్వారా ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఫ్యామిలీ డాక్టర్లు క్రమం తప్పకుండా ప్రతి ఇంటినీ సందర్శిస్తూ.. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారని పేర్కొన్నారు. వైద్య రంగంలో దేశానికే ఏపీ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ వర్గీయుల దాడి

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంటలో ఘటన



వైఎస్సార్‌సీపీ నాయకులపై కర్రలతో దాడి చేస్తున్న టీడీపీ వర్గీయులు

ద్వారకాతిరుమల: భూవివాదం నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. కర్రలు, ఇతర మారణాయుధాలతో విచక్షణారహితంగా కొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటన ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంటలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుండుగొలనుకుంటలో ఆర్ఎస్ నంబర్ 107లోని 8 ఎకరాల భూమికి సంబంధించి అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గోపా నాగేశ్వరరావు కుటుంబానికి, వెంకటకృష్ణాపురానికి చెందిన టీడీపీ నేత పాకలపాటి శ్రీనివాసరావు కుటుంబానికి మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. ఇటీవల భీమడోలు, ద్వారకాతిరుమల పోలీసులు ఇరువర్గాలతో పలుమార్లు చర్చలు కూడా జరిపారు. ఈ క్రమంలోనే కొద్దిరోజుల క్రితం గోపా నాగేశ్వరరావు వర్గీయులు వివాదాస్పద భూమికి ఫెన్సింగ్ వేశారు. ఆ సమయంలో కూడా ఇరువర్గాల మధ్య గొడవలు జరిగాయి. తాజాగా ఈ నెల 17న రాత్రి ఫెన్సింగ్‌ను పాకలపాటి శ్రీనివాసరావు వర్గీయులు తొలగించారు. అంతటితో ఆగకుండా గురువారం వివాదాస్పద భూమిలోకి వెళ్లిన గోపా నాగేశ్వరరావుతోపాటు అతని కుటుంబ సభ్యులు గోపా వెంకటేశ్వరరావు, గోపా బాలు, గోపా సత్యనారాయణ, కామవరపుకోటకు చెందిన గణపాలసత్యనారాయణపై దాడికి తెగబడ్డారు. కర్రలు, మారణాయుధాలతో తీవ్రంగా గాయపర్చారు. బాధితులను స్థానికులు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.



గాయపడ్డ గోపా వెంకటేశ్వరరావు



గోపా బాలు



గోపా నాగేశ్వరరావు

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఫ్యాషన్





చలి ప్రభావం తగ్గుతూ ఎండ ప్రతాపం చూపడానికి రెడీ అవుతున్నట్టుగా ఉంది ప్రస్తుత వాతావరణం. మనం కూడా అందుకు రెడీగా ఉండకతప్పదు. ఈ రిపబ్లిక్ డే ని పురస్కరించుకొని ఫాస్ట్ ఫ్యాషన్‌ను వదిలేసి మనవైన దేశీయ కాటన్ దుస్తులతో వార్డ్‌రోబ్‌ను సిద్ధం చేసుకుంటే రాబోయే వేసవి రోజులను ఫ్యాషనబుల్‌గానూ హాయి హాయిగా కులాసాగానూ గడిపేయచ్చు.

ఇక కాటన్స్‌తో ఆరంభం

సీజన్‌కి తగ్గట్టుగా మన డ్రెస్సింగ్‌ను కూడా మార్చుకుంటాం. అందులోనూ వేసవి కంఫర్ట్‌తో గడిపేయాలనుకుంటాం. కాటన్స్ అయితే డల్‌గా ఉంటాయి అనే మాటలు పక్కన పెట్టేసి మోడర్న్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్న వాటిని ఎంపిక చేసుకోవచ్చు. ఎక్కడ ఉన్నా వైభవంగా వెలిగిపోవచ్చు.



మనవైన చేనేతలు
కాటన్ అనగానే మనకు ముందుగా ఖాదీ గుర్తుకు వస్తుంది. ఖాదీ చీరలు, షర్ట్‌లే కాదు ఇండో వెస్ట్రన్ స్టైల్స్ కూడా ఇందులో వస్తున్నాయి. దీనితో పాటు నారాయణ్‌పేట్, ఇక్కత్, గద్వాల ... వంటి చేనేతలు సంప్రదాయ వేడుకల సందర్భాల్లోనూ ధరించడానికి బాగుంటాయి.

ఇండోవెస్ట్రన్
జంప్‌సూట్స్, ఫ్రాక్స్, గౌన్లు, లాంగ్ అండ్ షార్ట్ జాకెట్స్ డిజైన్స్ ఎన్నో ఇప్పుడు మనకు కాటన్ మెటీరియల్‌తో తయారైన డిజైన్స్ కనిపిస్తున్నాయి. క్యాజువల్ లేదా కాక్‌టెయిల్ పార్టీ ఏదైనా సందర్భానికి తగినట్టు వీటిని ఎంచుకోవచ్చు.

ఆభరణాల ఊసు
కాటన్ మెటీరియల్ పైగా వేసవి టైమ్ కాబట్టి ఉడెన్, టెర్రకోట జ్యువెలరీతో అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఎక్కువ అలంకరణ హంగామా లేకుండా సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్స్ అనిపించేలా రెడీ అవడానికి ఇప్పటి నుంచి ప్రిపేర్ అయిపోవచ్చు.

బ్లాక్ ప్రింట్ గౌన్స్
కాటన్‌పై వేసిన బ్లాక్ ప్రింట్ మెటీరియల్‌తో ఏ స్టైల్ డ్రెస్ అయినా డిజైన్ చేసుకోవచ్చు. ఇవి వేసుకోవడానికి సౌకర్యంగానే కాదు, ఎంతమందిలో ఉన్నా ప్రత్యేకంగానూ కనిపిస్తాయి.

బ్యూటిప్స్



తులసి ఆకులను మెత్తగా గ్రైండ్ చేసి ఆ పేస్టును కాని రసాన్ని కాని ముఖానికి రాసి ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. క్రమం తప్పకుండా రోజూ చేస్తుంటే మొటిమలు, వాటి మచ్చలు పూర్తిగా పోవడంతో పాటుచర్మం నునుపుదేలుతుంది.

తేనెను గోరువెచ్చగా చేసి అందులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడగాలి. తేనెను ఎప్పుడూ నేరుగా మంట మీద వేడి చేయకూడదు. తేనె ఉన్న పాత్రను ఎండలో కాని, వేడి నీటి గిన్నెలో కాని పెట్టి వేడి చేయాలి.

సిట్రస్ ఫ్రెషనర్‌తో ముఖాన్ని శుభ్రం చేస్తుంటే రోజంతా తాజాగా ఉంటుంది. ఇందుకోసం రెండు కప్పుల నీళ్లు, నిమ్మరసం, నిమ్మ తొక్కలు కావాలి. ఒక పాత్రలో నీటిని మరిగించి అందులో నిమ్మ తొక్కలను వేసి మూత పెట్టి రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటిరోజు ఉదయం నిమ్మ తొక్కలను తీసివేసి ఆ నీటిలో తాజా నిమ్మ రసాన్ని కలిపి స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. దీనిని ముఖం మీద స్ప్రే చేసుకుని పది నిమిషాల తర్వాత తుడిచేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా ఉంటుంది. స్ప్రే బాటిల్ తప్పనిసరి కాదు. ఈ మిశ్రమంలో దూదిని ముంచి ముఖానికి పట్టించినా కూడా సాంత్వన లభిస్తుంది. నిమ్మ తొక్కలకు బదులుగా ఆయా కాలాల్లో దొరికే కమలా, బత్తాయి వంటి పండ్ల తొక్కలను కూడా వాడుకోవచ్చు.

రిపబ్లిక్ డే స్పెషల్

ఢిల్లీ పరేడ్‌కు అసామాన్యులు



ఈసారి గణతంత్ర దినోత్సవ ఉత్సవాలకు తెలంగాణ నుంచి 'అసామాన్యులు' హాజరై తెలంగాణకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఒకరు హైదరాబాద్ స్వీపర్ నారాయణమ్మ. మరొకరు కోదాడ మొబైల్ షీ టాయిలెట్ నిర్వహిస్తున్న నాగలక్ష్మి. ప్రజల కోసం భిన్నమైన ఉపాధుల్లో అంకితభావంతో పని చేస్తున్న వీరిద్దరూ 'శ్రమయేవ జయతే'కు నిజమైన ప్రతీకలు. నారాయణమ్మ, నాగలక్ష్మిల పరిచయం.

నారాయణమ్మ దినచర్యను చూస్తే కర్మయోగుల దినచర్యలా అనిపిస్తుంది. తెల్లవారుజాము నాలుగ్గంటలకు నిద్ర లేస్తుందామె. స్నానపానాదులు ముగించుకుని గంటసేపు గురుధ్యానం చేసి కొద్దిగా టీ తాగి ఆరు గంటలకంతా బంజారాహిల్స్‌లోని కాలనీలో రోడ్లు ఊడ్చే పనిలోకి వస్తుంది. పెదాల మీద ఏదో ఒక జానపద గీతమో, గురు తత్వమో, స్మరణో లేకుండా నారాయణమ్మ కనిపించదు. అందుకే ఆమెను అందరూ 'సింగింగ్ స్వీపర్' అంటారు. 22 సంవత్సరాలుగా నగరాన్ని తన చేతులతో శుభ్రం చేస్తూ స్వస్థతనిస్తూ మరోవైపు వీలున్నప్పుడల్లా భజనలకు, భక్తి కార్యక్రమాలకు హాజరయ్యి ముక్తిమార్గాన్ని చూపుతూ నారాయణమ్మ చేస్తున్న సేవ సామాన్యం కాదు. అందుకే ఆమెను రిపబ్లిక్ డేకి ఢిల్లీ పంపాలని జి.హెచ్.ఎం.సి. అధికారులు నిశ్చయించారు. 'ఇది విని మావాళ్లంతా చాలా సంతోషించారు. మంచి కర్మల ఫలితం ఇది' అంటుంది నారాయణమ్మ.

బావులు తవ్వుతూ
రంగారెడ్డి జిల్లా యాచారంకు చెందిన నారాయణమ్మ భర్తతో కలిసి బావులు తవ్వే పనికి వెళ్లేది. అది చాలా శ్రమతో కూడిన పని. అయినా పదిహేను ఇరవై రోజుల్లో బావిని తవ్వి జలను బయటకు తేవడంలో ఆమెకు తృప్తి కలిగేది. తర్వాత జెసీబీలు వచ్చాయి. బావుల స్థానంలో బోర్లు వచ్చాయి. దాంతో పొట్ట చేత్తో పట్టుకుని హైదరాబాద్ చేరుకుంది నారాయణమ్మ. అప్పటికే తల్లి స్వీపర్‌గా చేస్తుండంతో తన పని కూతురికి అప్పజెప్పింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ అదే పనిలో కొనసాగుతూ ఉంది నారాయణమ్మ. నెలకు 14 వేలు వస్తాయి. కొడుకు లారీ డ్రైవర్‌గా చేస్తున్నాడు. కూతురిని స్వీపర్ ఉద్యోగంలోనే పెట్టించింది.

జీవుడే దేవుడు
నారాయణమ్మకు భక్తి ఎక్కువ. పెళ్లయినప్పటి నుంచి భర్తతో కలిసి దేశంలోని గుళ్లన్నీ తిరిగేది. సంపాదించినది అంతా తీర్థయాత్రలకే ఖర్చు పెట్టింది. 'కాని గుళ్లన్నీ తిరిగాక జీవుడిలోనే దేవుడు ఉన్నాడని గ్రహించాను. కరీంనగర్ జిల్లాకు చెందిన నిత్యానంద రాజేశ్వరాచార్యుల దగ్గర గురుబోధ తీసుకున్నా. నన్ను నేను ఆత్మజ్ఞానిగా మార్చుకున్నా. మనిషి చిత్తం విచిత్రం. అతను లోకాన్ని తరచి చూసి ముక్తిపొందాలంటే గురువును తెలుసుకుని గురుబోధతో నడుచుకోవాలి. అజ్ఞానాన్ని తవ్వి బయట పారేయాలి' అంటుంది నారాయణమ్మ. ఆమెకు రోకటి పాటల దగ్గరి నుంచి మంగళ హారతి పాటల వరకూ కరతామలకం. రామయణ, భారతాలను కూడా పాటలుగా పాడుతుంది. వేమన పద్యాల నుంచి సంస్కృత పద్యాల వరకూ అన్నీ చెబుతుంది. ఆమె ధారణకు, ఆధ్యాత్మిక అవగాహనకు ఎవరైనా నమస్కరించాల్సిందే.


నారాయణమ్మ

కోదాడలో అమూల్యసేవ
సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాగలక్ష్మి నిర్వహించే మొబైల్ షీ టాయిలెట్ కనిపిస్తుంది. 30 ఏళ్ల ఈ డబుల్ డిగ్రీ హోల్డర్ కోదాడ మునిసిపల్ ఉద్యోగిగా మొబైల్ టాయిలెట్‌ను నిర్వహించడానికి, తిప్పడానికి ఏ మాత్రం సిగ్గుపడదు. 'ఐదేళ్లుగా ఈ టాయిలెట్‌ను నిర్వహిస్తున్నాను. ఆటోకు బిగించిన టాయిలెట్‌ను రోజూ నేను ఉదయం ఎనిమిదన్నర నుంచి పట్టణంలో తిప్పుతాను. గుళ్ల దగ్గర, బస్టాండ్ దగ్గర, మార్కెట్ దగ్గర అవసరాన్ని బట్టి ఉంచుతాను. పనుల కోసం పల్లెల నుంచి వచ్చిన స్త్రీలు తగిన టాయిలెట్‌లు లేక ఇబ్బంది పడతారు. వారు నా మొబైల్ టాయిలెట్‌ను చూడగానే ఎంతో రిలీఫ్ ఫీలవుతూ ఉపయోగిస్తారు. నేను గమనించేదేమిటంటే ఆ ఒత్తిడి తీరాక వారు చల్లగా బతకమ్మా అని ఆశీర్వదించడం. ముఖ్యంగా గర్భిణి స్త్రీలు ఎంతో సంతోషపడతారు' అంటుంది నాగలక్ష్మి. ఈ మొబైల్ టాయిలెట్ ఉపయోగించుకోవడానికి ఏమీ రుసుము చెల్లించనక్కర లేదు. మధ్యాహ్నం వరకూ ఈ వాహనాన్ని నడిపే నాగలక్ష్మి మధ్యాహ్నం భోజన విరామం తీసుకుని మళ్లీ సాయంత్రం వరకూ తిప్పుతుంది. 'మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా ఎంతో ఉంది' అంటుందామె. ఆమె అంకిత భావాన్ని గమనించిన జి.హెచ్.ఎం.సి. అధికారులు ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలకు తెలంగాణ ప్రతినిధిగా ఢిల్లీకి పంపుతున్నారు.


నాగలక్ష్మి

అకృత్యాలకు అడ్డుకట్ట కార్నర్ మీటింగ్స్

చైతన్యం

ముంబైలోని మురికివాడల్లో ఉదయం పూట మహిళాపోలీసులు 'కార్నర్ మీటింగ్స్' నిర్వహిస్తున్నారు. ప్రతి వీధిలోని ఒక మూల మీద అక్కడ పోగైన స్త్రీలకు, పిల్లలకు 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'తో మొదలు డ్రగ్స్, ట్రాఫికింగ్, సైబర్ క్రైమ్‌ల గురించి వివరిస్తున్నారు. పెద్దగా చదువులేని మహిళలకు ఈ వీధిమలుపు మీటింగ్‌లు మేలుచేస్తున్నాయి. నిజానికి ప్రతి రాష్ట్రంలో, ప్రతి బస్తీల్లో ఇలాంటి కార్నర్ మీటింగ్‌ల అవసరం ఉంది.



నగరాల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లో ఉన్న స్త్రీల భద్రత గురించి కొంతైనా నిశ్చింత ఉంది. కాని ఇవే నగరాల్లో, పెద్ద పట్టణాల్లోని మురికివాడల్లోని, బస్తీల్లోని స్త్రీల, పసి పిల్లల భద్రత చాలా కష్టతరమైనది. చట్టపరంగా ఎంత కట్టుదిట్టాలు ఉన్నా స్వీయ అవగాహన లేకపోతే ప్రమాదం తప్పదు. మన దేశంలో నిత్యం పసి పిల్లల మీద అకృత్యాలు పెరుగుతూనే ఉన్నాయి. తప్పిపోతున్న పిల్లల సంఖ్య తీవ్రంగా ఉంది. మరోవైపు అసంఘటిత రంగాల్లో స్త్రీలపై లైంగిక దాష్టీకాలు కొనసాగుతూనే ఉన్నాయి. చదువు లేని స్త్రీలు ఈ విషయమై ఎవరితో చెప్పుకోవాలో తెలియక బాధ పడతారు, ఆందోళన చెందుతారు. అందుకే ముంబైలో మహిళా పోలీసులు 'కార్నర్ మీటింగ్'లు నిర్వహిస్తున్నారు.

సంవత్సరం క్రితం
సంవత్సరం క్రితం పోలీసు అధికారుల సూచన మేరకు మహిళా పోలీసులతో మొదలైన ఈ పని సత్ఫలితాలను ఇస్తోంది. ముంబైలోని అతి పెద్ద మురికివాడలకు రోజూ ఉదయం పూట మహిళా పోలీసు బృందాలు చేరుకుని వీధి మూలల్లో ఆడవాళ్లను కూడేసి జాగ్రత్తలు చెప్పడమే ఈ కార్నర్ మీటింగ్‌ల ఉద్దేశం. ఆడపిల్లలకు అర్థమయ్యేలా 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'ల గురించి చెప్పడం మరో ముఖ్య ఉద్దేశం. అపరిచితులకు పిల్లల్ని అప్పగించి పనుల్లోకి వెళ్లకుండా చూడటం, మొబైల్ ఫోన్లలో వచ్చే కేటుగాళ్ల కాల్స్ వల్ల ఆర్థికంగా నష్టపోకుండా చూడటం కూడా కార్నర్ మీటింగ్‌ల ముఖ్యవిధిగా ఉంది. 'రోజూ పది నుంచి పదకొండు గంటల మధ్య బస్తీ స్త్రీలు ఖాళీగా దొరుకుతారు. వారికి అన్ని విధాలా కౌన్సెలింగ్ ఇచ్చి అలెర్ట్ చేస్తాం. చిన్నచిన్న ఫ్యాక్టరీల్లో పని చేసే స్త్రీలు లైంగికపరంగా వేధింపులను ఎదుర్కొంటే ఫిర్యాదు చేయమని చెబుతాం. దీని వల్ల దౌర్జన్యకారుల్లో భయం ఏర్పడుతోంది' అంటున్నారు మహిళా పోలీసులు. అలాగే వ్యభిచార వృత్తిలోకి ఈడ్చబడే స్త్రీల, బాలికలను కాపాడే బాధ్యత వారి గురించి సమాచారం ఇచ్చే చైతన్యం కూడా బస్తీ మహిళలకు కలిగిస్తున్నారు. మత్తు పదార్థాల వల్ల జరిగే హాని చెబుతున్నారు. నిజానికి ఈ పని ముంబైలోనే కాదు దేశంలోని ప్రతి నగరంలో చదువులేని బీదసాదలు ఉండే అన్నీ ఊళ్ల వాడల్లో జరగాలి. సత్ఫలితాలు ఇస్తున్న ఈ పనిని మిగిలిన రాష్ట్రాల్లోని పోలీసులు కూడా అనుసరిస్తే బాగుంటుంది.

> ఈ సంపద, ఈ సంతానం... కేవలం ఐహిక జీవితపు అలంకారాలు మాత్రమే! శాశ్వతంగా నిలిచేవి సత్కార్యాలే! అవే నీ ప్రభువు దృష్టిలో ప్రతిఫలానికి ఉత్తమమైనవి.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 19 జనవరి 2024

చైనా మెచ్చని తైవాన్ తీర్పు

కొన్ని ఎన్నికలు, వాటి ఫలితాల ప్రభావం అంతర్జాతీయ స్థాయిలో అమితంగా ఉంటుంది. జనవరి 13న తైవాన్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలాంటివే. ఈ ఎన్నికల్లో అక్కడి 'ప్రజాస్వామ్య అభ్యుదయ పార్టీ' (డీపీపీ) వరుసగా మూడోసారి చరిత్రాత్మక విజయం సాధించడం అనేక విధాల ప్రత్యేకమైనది. ద్వీపదేశమైన తైవాన్‌పై ఆధిపత్యం కోసం చైనా జోరుగా ప్రయత్నిస్తున్న వేళ, ఇండో- పసిఫిక్ ప్రాంతంలో క్లిష్ట పరిస్థితులు నెలకొన్నవేళ వచ్చిన ఎన్నికల ఫలితాలు ఇక్కడి భౌగోళిక రాజకీయాల్లో కీలకమైనవి. 1.4 కోట్ల తైవానీయులు స్వయంప్రతిపత్తి గల ప్రజాస్వామ్యంగానే దేశం కొనసాగాలనీ, చైనాతో బంధంలో మార్పు అవసరం లేదనీ భావిస్తున్నట్టు ఫలితాలను వ్యాఖ్యానించవచ్చు.

ఉపాధ్యక్షుడైన విలియమ్ లై చింగ్-తె తాజా ఎన్నికల్లో అధ్యక్ష పదవికి డీపీపీ తరఫున పోటీపడి, చైనాతో సర్దుబాటు కోరుతున్న ప్రధాన ప్రతిపక్షమైన కెఎంటి (కుయో మిన్ తాంగ్) అభ్యర్థిపై గెలిచారు. అయితే, మునుపటి 2020 ఎన్నికల్లో అప్పటి డీపీపీ అభ్యర్థి 57 శాతం ఓట్లు సాధిస్తే, ఈసారి అది 40 శాతానికి తగ్గింది. డీపీపీ పార్లమెంటరీ ఆధిక్యాన్ని కోల్పోయి, అతిపెద్ద పార్టీ కిరీటాన్ని ప్రతిపక్ష కెఎంటి పాల్జేయడం గమనార్హం. కొత్త విధానసభలో డీపీపీ 51, కెఎంటి 52 స్థానాలు గెలిచాయి. ఈ రెండు పార్టీల ద్విధాధిపత్యానికి గండికొడుతూ కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన 'తైవాన్ పీపుల్స్ పార్టీ' (టీపీపీ) 20 శాతానికి పైగా ఓట్లతో, 8 స్థానాలు గెలిచింది. దేశీయ విధానంలో, చైనాతో వ్యవహారంలో అధికార పార్టీకి ఇది ఇబ్బందే. సభలో పట్టుకై ఇతర పార్టీలతో దోస్తీ కట్టాల్సి ఉంది. అలాగే, చైనా దూకుడు చూపుతున్నందున సైన్యాధిపతి అయిన తైవాన్ అధ్యక్షుడు ఇటు చైనా, అటు అమెరికాలతో నేర్పుగా వ్యవహరించాలి.

నిజానికి స్వయంపాలక ప్రజాస్వామ్య దేశమైన తైవాన్ ఎన్నడూ కమ్యూనిస్టు చైనా నియంత్రణలో లేదు. అయితే, తైవాన్ ప్రజాభీష్టంతో సంబంధం లేకుండా, ఆ దేశంపై తమదే ఆధిపత్యమంటూ డ్రాగన్ అహంకారం చూపుతోంది. ఎన్నికలను వ్యూహాత్మకంగా చక్కటి అవకాశంగా భావించిన బీజింగ్ ఫలితాలను ప్రభావితం చేసేందుకు శతవిధాల ప్రయత్నించింది. ఆర్థిక నిర్బంధాల మొదలు అసత్య ప్రచారాలు, భద్రతా సవాళ్ళ దాకా అనేక అస్త్రాలు ప్రయోగించింది. తైవాన్‌ను కలిపేసుకోవాలని చైనా అసహనంతో తొందరపడుతుంటే, 'ఒకే దేశం – రెండు వ్యవస్థల' విధానం హాంగ్‌కాంగ్‌లో విఫలమవడం చూసిన తైవాన్ అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తోంది.

చరిత్ర చూస్తే 1895 నుంచి 1945 దాకా 50 ఏళ్ళు జపాన్ ఏలుబడిలో తైవాన్ ఉంది. శరవేగంగా అభివృద్ధి చెందింది. తీరా 1945 ఆగస్ట్‌లో జపాన్ లొంగిపోవడంతో, తైవాన్ అప్పటి చైనా ప్రధాన భూభాగాన్ని ఏలుతున్న కెఎంటి పార్టీ హయాంలోకి వచ్చింది. అప్పట్లో తైవాన్‌లోని జపనీస్ ఆస్తులను కెఎంటి సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. దాంతో, స్థానిక తైవానీయుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. తైవాన్ జాతీయవాదుల ఉద్యమంగా మారిన ఆ నిరసనను 1947 ఫిబ్రవరి 28న కెఎంటి అణిచివేసింది. కెఎంటి సైన్యం 28 వేల మందిని పొట్టనబెట్టుకుంది. చియాంగ్ కై-షెక్ సారథ్యంలోని కెఎంటి జాతీయవాదులు 1949లో అంతర్యుద్ధంలో ఓటమి పాలై, తైవాన్‌కు తరలిపోయారు. అలా దాదాపు 20 లక్షల మంది కెఎంటితో కలసి చైనా నుంచి తైవాన్‌కు వలస వచ్చారు. ఇవాళ్టికీ 2.4 కోట్ల తైవాన్ జనాభాలో నాలుగోవంతు మంది ఈ 'మెయిన్‌ల్యాండర్లే'. అంటే, చైనా భూభాగం నుంచి వలసదారులు, వారి సంతతే. కెఎంటి నియంతృత్వ పాలనలోనూ ఎలక్ట్రానిక్స్‌పై దృష్టి పెట్టిన తైవాన్ తన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకుంది. 1975 వరకు అధ్యక్ష పాలనలోనే 'రిపబ్లిక్ ఆఫ్ చైనా'గా నడిచింది. తరువాతి పరిణామాల్లో రాజకీయ సరళీకరణ ఆరంభమైంది.

1991 నాటికి ప్రజాస్వామ్య ప్రక్రియ ఊపందుకుంది. ఉపాధ్యక్షుడి నుంచి అధ్యక్షుడిగా ఎదిన లీ తెంగ్-హుయి దేశాన్ని పూర్తి ప్రజాస్వామ్య దిశగా నడిపించడానికి ఉద్యుక్తుడయ్యేసరికి డ్రాగన్ తోక తొక్కినట్టయింది. 1996లో తొలిసారి స్వేచ్ఛాయుత అధ్యక్ష ఎన్నికలు జరుగుతుండగా తైవాన్ జలసంధిలో చైనా వందలాది క్షిపణులు ప్రయోగించింది. తైవాన్‌కు మద్దతుగా అమెరికా యుద్ధనౌకలను పంపాల్సి వచ్చింది. ఆ ఎన్నికల్లో లీ అపూర్వ విజయం అందుకున్నారు. కాలక్రమంలో స్థానిక తైవానీయుల ప్రయోజనాలకు కట్టుబడ్డ డీపీపీ వేగంగా జనాదరణ పొందింది. లీ పదవీ విరమణ తర్వాత 2000లో డీపీపీ అభ్యర్థే అధ్యక్షుడిగా గెలిచారు. గమనిస్తే, తైవాన్‌లో ప్రజాస్వామ్యం ఏర్పాటు నుంచి ఇప్పటి దాకా 2008, 2012లోనే కెఎంటి 'మెయిన్‌ల్యాండర్' అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో కెఎంటి అభ్యర్థి సహా అధ్యక్ష పదవికి పోటీపడ్డ ముగ్గురూ మెయిన్ ల్యాండర్లు కాకపోవడం గమనార్హం. ఒకరకంగా ఇది అధికార డీపీపీ తైవానీ అస్తిత్వ రాజకీయాలకు రాజముద్ర.

ఆసియా భౌగోళిక రాజకీయ చిత్రపటంలో తైవాన్ కీలకం. ప్రపంచ సాంకేతిక నాయకత్వ భవితవ్యంలోనూ ఆ దేశం అవిస్మరణీయం. ప్రపంచ సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో 60 శాతం పైగా, అత్యాధునిక చిప్‌లలో 90 శాతం పైగా అక్కడ చేసేవే. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్ల నుంచి కార్లు, ఉపగ్రహాల దాకా ఎలక్ట్రానిక్ ఉపకరణాలన్నిటికీ అవే ప్రాణాధారం. స్వయంప్రతిపత్తి గల తైవాన్ మనకు సహజ మిత్రదేశం. అలా తాజా ఎన్నికల ఫలితాలు సానుకూల పరిణామమే. గత 8 ఏళ్ళలానే వచ్చే నాలుగేళ్ళూ ఢిల్లీతో బంధానికే తాయ్‌పే ఆసక్తి చూపుతుంది. దౌత్య సంబంధాలు లేకున్నా ఇప్పటికే 250కి పైగా తైవానీ కంపెనీలు భారత్‌లో 400 కోట్ల డాలర్ల మేర పెట్టు బడులు పెట్టాయి. అందుకే, తైవాన్ జలసంధిలో సుస్థిరత, ప్రశాంతత కొనసాగితే భారత్‌కు అది శుభవార్త. తరచూ సైనిక విన్యాసాలతో అస్థిరత రేపుతున్న చైనా సైతం తైవాన్ ప్రజాభీష్టాన్ని గౌరవిస్తే మేలు.

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వర్ధిల్లాలి!

సందర్భం



దినేశ్ సి. శర్మ

ఏటా జనవరిలో జరగాల్సిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు ఈసారి రద్దుకావడం అవాంఛనీయ పరిణామం. భారతీయ శాస్త్ర సమాజం ఒక పొందికతో పురోగమించేందుకు... నూటా పదేళ్లుగా సాగుతున్న ఈ సమావేశాలూ ఒక కారణమంటే అతిశయోక్తి కాదు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అనేది ఓ విభిన్న వేదిక. ప్రత్యేక అంశాలు ఇతివృత్తంగా ఏర్పాటు చేసే శాస్త్రీయ సెమినార్లలో ఆ యా రంగాల్లో నిష్ణాతులైన శాస్త్రవేత్తలు మాత్రమే పాల్గొంటారు. సైన్స్ కాంగ్రెస్‌లో మాత్రం అన్ని రంగాలకు సంబంధించిన చర్చోపచర్చలూ జరుగుతాయి. శాస్త్రవేత్తలతో పాటు సామాన్యులు, డిగ్రీ కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులు కూడా హాజరవుతారు. ఇవి వారికి ఎంతో స్ఫూర్తిదాయకం. అందుకే ఈ సమావేశాలు నిరాటంకంగా కొనసాగాలి.

భారతీయ శాస్త్ర పరిశోధన రంగానికి జనవరి నెల చాలా ముఖ్యమైంది. ఏటా ఈ నెలలోనే 'ఇండియన్ సైన్స్ కాంగ్రెస్' సమావేశాలు ఘనంగా జరుగుతాయి. భారత ప్రధాని చేతుల మీదుగా ప్రారంభమయ్యే ఈ వార్షిక ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి వేలాది మంది శాస్త్రవేత్తలు, విద్యార్థులు హాజరవుతారు. కానీ ఈ ఏడాది సైన్స్ కాంగ్రెస్‌కు ఆతిథ్యం ఇవ్వాల్సిన లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ చివరి నిమిషంలో ఊహించని సమస్యల కారణంగా తప్పుకొంది. సమావేశాలకు ఆర్థిక సాయం అందించే కేంద్ర ప్రభుత్వం కూడా వెనక్కి తగ్గడంతో ఈ ఏడాది కార్యక్రమాలు అనివార్యంగా రద్దయ్యాయి.

కీలకమైన అంశాలపై మేధోమథనం జరిపేందుకు, ఆ విషయాలపై ప్రభుత్వాలకు సూచనలిచ్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఉంటాయి. ఇలాంటి సలహా, సూచనలు గతంలో విధాన రూపకల్పనకు ఉపయోగపడిన ఉదాహరణలు కోకొల్లలు. కేంద్రంలో పర్యావరణ విభాగం (తరువాతి కాలంలో మంత్రిత్వ శాఖ స్థాయికి ఎదిగింది) ఏర్పాటుకూ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ డెవలప్‌మెంట్ (ప్రస్తుతం ఎర్త్ సైన్సెస్ మినిస్ట్రీ) ఏర్పాటుకూ సైన్స్ కాంగ్రెస్ ఇచ్చిన సలహాలే కారణం. వీటన్నింటికీ మించి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేలా అత్యంత కీలకంగా వ్యవహరించింది.

నూరేళ్లకు పైగా అప్రతిహతంగా...

1914లో ఏర్పాటైంది మొదలు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు ఏటా అప్రతిహతంగా కొనసాగాయి. కోవిడ్ కాలం నాటి పరిస్థితులు ఒక్కటే మినహాయింపు. అప్పట్లో లక్నోలోని కానింగ్ కాలేజ్ అధ్యాపకులు పి.ఎస్. మెక్‌మోహన్, మద్రాస్‌లోని ప్రెసిడెన్సీ కాలేజీ అధ్యాపకులు జేఎల్ సైమన్‌సెన్ మానస పుత్రికగా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆవిర్భవించింది. 'బ్రిటిష్ అసోసియేషన్ ఫర్ ద అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్' తరహాలో వారు ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ప్యూర్, అప్లైడ్ సైన్స్ రంగాలపై అభినివేశం ఉన్న వారందరికీ ఒక వేదిక కల్పించడం దీని ప్రధానోద్దేశం. సమాజానికీ, సైన్స్‌కూ మధ్య ఒక వారధిగానూ ఈ సంస్థ ఉపయోగపడుతుందని వారు భావించారు. గణిత, ఖగోళ, భౌతిక, రసాయన, భౌగోళిక, జీవ శాస్త్రాల్లో పరిశోధనలు చేస్తున్న వారందరికీ తొలి ఉమ్మడి వేదిక కూడా ఇదే. ఆయా శాస్త్ర రంగాలకు సంబంధించిన కొత్త ఆలోచనలు పంచుకునేందుకు సైన్స్ కాంగ్రెస్ ఎంతో ఉపయోగపడింది. దశాబ్దాల సైన్స్ కాంగ్రెస్ సమావేశాల కారణంగా దేశంలో మరిన్ని శాస్త్రీయ సొసైటీలు, వృత్తినైపుణ్యమున్న సంస్థలు ఏర్పడ్డాయి.

ఈ వేదిక ఈ కాలానికి సరిపోయేది కాదనీ, పాతకాలపు పద్ధతులనే కొనసాగిస్తోందనీ కొందరు అంటూంటారు. దేశంలో శాస్త్ర రంగాల అభివృద్ధితో పరుగులు పెడుతూనే, వేర్వేరు దశల్లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ఎలా ఎదిగిందో విస్మరించేవారే ఇలాంటి విమర్శలు చేయగలరు.



ప్రాక్ – పశ్చిమాల మేళవింపు...

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ప్రస్థానంలో తొలిదశ 1914–47 మధ్యకాలమని చెప్పవచ్చు. ఈ సమయంలో భారతీయ, యూరోపియన్ శాస్త్రవేత్తల మధ్య సమాచార వినిమయం ఎక్కువగా ఉండేది. యూరోపియన్ శాస్త్రవేత్తలు అనేకులు భారతీయ పరిశోధన సంస్థల్లో పనిచేస్తూండేవారు. తమ ఆలోచనలు పంచుకునేందుకు వీరికి ఉన్న ఒకే ఒక్క వేదిక ఇండియన్ సైన్స్ కాంగ్రెస్సే. దీనికి సమర్పించే అన్ని పరిశోధన వ్యాసాలనూ సమకాలీన శాస్త్రవేత్తలు సమీక్షించేవారు. ఈ రకమైన సమీక్ష, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు అన్న భావన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ద్వారానే ఏర్పడ్డాయి. భారత్‌లో సైంటిఫిక్ జర్నల్స్ ప్రచురణ కూడా సైన్స్ కాంగ్రెస్ పుణ్యమే. ప్రఖ్యాత శాస్త్రవేత్త మేఘనాథ్ సాహా ప్రచురించిన 'సైన్స్ అండ్ కల్చర్' జర్నల్ దీనికి ప్రబల ఉదాహరణ.

దేశంలో స్వాతంత్ర్య ఉద్యమం బాగా నడుస్తున్న 1930లలో జాతీయ నాయకత్వం దేశ భవిష్యత్తు కోసం ప్రణాళికలు రచించడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో దేశాభివృద్ధిలో సైన్స్‌ను వినియోగించడంపై దీని వేదికగా అనేక కొత్త ఆలోచనలపై చర్చ జరిగింది. పారిశ్రామికీకరణ, సమాజం పట్ల సైన్స్ బాధ్యత వంటి ఆలోచనలు పురుడు పోసుకున్నది ఇక్కడే. 1937లో జరిగిన సమావేశాల్లోనే జవహర్‌లాల్ నెహ్రూ ''ఈ కాలపు స్ఫూర్తి సైన్స్. ఆధునిక ప్రపంచాన్ని శాసిస్తున్నదీ ఇదే. సైన్స్‌తో మిత్రత్వం నెరిపేవారిది, సమాజ పురోభివృద్ధికి దాని సాయం తీసుకునేవారిదే భవిష్యత్తు'' అన్న వ్యాఖ్యలు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947లోనూ ఈ సమావేశాలకు నెహ్రూ అధ్యక్షుడిగా ఉన్నారు. 1964లో ఆయన మరణించేంత వరకూ కొనసాగారు. ఆ తరువాతి కాలంలో ఈ సమావేశాల్లో దేశ ప్రధాని శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించే సంప్రదాయం మొదలైంది. చాలా సందర్భాల్లో దేశ ప్రధానులు ఈ వేదికపై నుంచి కొన్ని కీలకమైన విధాన నిర్ణయాలను కూడా ప్రకటించేవారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో శాస్త్ర పరిశోధనల పునాదులకు శ్రీకారం చుట్టారు. జాతీయ పరిశోధన సంస్థలు, రీసెర్చ్ కౌన్సిళ్లు పనిచేయడం మొదలైంది. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కూడా ఒక కొత్త దశలోకి అడుగుపెట్టింది. శాస్త్ర పరిశోధనలపై చర్చలకు వేదికగా నిలుస్తూనే ప్రణాళిక, ఆహార సంక్షోభం, ఆరోగ్యాభివృద్ధి వంటి విస్తృత స్థాయి విధానపరమైన అంశాలపై కూడా చర్చలు మొదలయ్యాయి. యూనివర్సిటీ వ్యవస్థలోని పరిశోధకులతో పాటు జాతీయ పరిశోధన సంస్థలు, శాస్త్ర విభాగాలకు చెందినవారు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ప్రక్రియలో ఎక్కువగా పాలుపంచుకోవడం మొదలైంది. ఈ క్రమంలోనే కొన్ని దశాబ్దాల తరువాత ఆయా రంగాలకు ప్రత్యేకమైన సంస్థలు ఏర్పడటంతో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ తన ప్రాభవాన్ని కొంత కోల్పోయిందని చెప్పాలి. ఆయా రంగాల పరిశోధన పత్రాలను మునుపటిలా సైన్స్ కాంగ్రెస్‌లో కాకుండా ప్రత్యేక సంస్థలకు సమర్పించడం మొదలైంది.

శాస్త్రీయ దృక్పథం పెరగాలంటే...

ప్రస్తుతానికి వద్దాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో, సైన్స్ రంగంలో పోటీని దృష్టిలో పెట్టుకుంటే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ఫలితాలను పంచుకోవాలని అనుకోవడం అత్యాశే అవుతుంది. అందుకే ఈ సమావేశాలపై కొంతమంది పెదవి విరుస్తున్నారు. నిర్వాహకుల నిర్లక్ష్యం అనండి... ఇంకేమైనా కానివ్వండి... సైన్స్ వ్యతిరేకులు కొందరికి ఈ సైన్స్ కాంగ్రెస్ వేదికగా మారడం ఇటీవలి పరిణామం.

ఒక్కటైతే నిజం. యువతరంతో తమ పరిశోధనల వివరాలను పంచుకోవాలని అనుకునే శాస్త్రవేత్తలకు, ఇతర రంగాల్లోని సహోద్యోగులతో ఆలోచనలు పంచుకోవాలనుకునేవారికి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అవసరం ఇప్పటికీ ఉంది. నోబెల్ అవార్డు గ్రహీతలు ఇక్కడ చేసే ప్రసంగాలు ఎంతోమంది యువకులు, విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయనడంలో సందేహం లేదు. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుంటే ఈ సమావేశాలు భవిష్యత్తులోనూ కొనసాగాలి. సామాజిక మాధ్యమాల ద్వారా సూడోసైన్స్ కూడా సైన్స్ పేరిట చలామణి అవుతున్న ఈ సమయంలో దేశంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి వేదికలు అనేకం అవసరం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ 2024 సైన్స్ కాంగ్రెస్ సమావేశాలకు ఆర్థిక సాయాన్ని ఎందుకు నిలిపేసిందో వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఉమ్మడి చైతన్యదీప్తి



ఇది మధ్యప్రదేశ్ ఉత్తేజం. పన్నెండేళ్ల వయసు ఆది శంకరాచార్యుడికి 36 అడుగుల పొడవైన 'ఏకత్వ' విగ్రహం నెలకొల్పారు. సరిహద్దులకు అతీతంగా భారత నేలలోని విలువలను, సంస్కృతిని ఏకీకరించి, ఉమ్మడి చైతన్యాన్ని వ్యాపింపజేశారు శంకరాచార్య. అలాంటి ఏకత్వానికి ప్రతినిధిగా ఉండటం సంతోషదాయకం!

– ఎరిక్ సోల్‌హెయిమ్, 'వన్‌నెస్' అంబాసిడర్

చెప్పేవాడికి...



నేను చని పోయేలోగా ఒక్కసారైనా 'దావోస్'లోలా చేయాలనుంది. ఈ క్రూరమైన, అన్యాయమైన ప్రపంచంలో ఒక పేదవాడిగా ఎలా సమర్థంగా నెగ్గుకురావాలో మిలియనీర్లు, బిలియనీర్లు ఇచ్చే సలహాలను వినాలనుంది.

– శోభా డె, కాలమిస్ట్

నేటి ప్రపంచం



హమాస్ వర్సెస్ ఇజ్రాయెల్. హెజ్బొల్లా వర్సెస్ ఇజ్రాయెల్. ఇజ్రాయెల్ వర్సెస్ హెజ్బొల్లా (లెబనాన్). ఇరాకీ పారసైన్యం వర్సెస్ యూఎస్ స్థావరాలు. హౌతీలు వర్సెస్ ఓడలు. హౌతీలు వర్సెస్ యూఎస్, యూకే. ఇరాక్, సిరియా పారసైన్యాలు వర్సెస్ యూఎస్. టర్కీ వర్సెస్ పీకేకే (కుర్దులు). ఐసిస్ వర్సెస్ ఇరాన్. సిరియా వర్సెస్ ఇరాన్. పాకిస్తాన్ వర్సెస్ ఇరాన్. ఇరాన్ వర్సెస్ ఇరాకీ కుర్దులు. ఇంకా ఏమైనా మిస్సయ్యానా?

– రాశా అల్ అఖీదీ, రచయిత్రి

గ్రహించాల్సిన విషయం



దక్షిణ భారత దేశంలో మోదీ ఎన్నిసార్లు పర్యటించినా, ఎన్ని ఆలయాలు దర్శించినా అక్కడొకటి... ఇక్కడొకటి లోక్‌సభ సీటు రావడం తప్ప ఫలితం ఉండదు. దక్షిణ భారతీయులు ధార్మిక జీవులే గానీ మోదీ కోరుకునే మతాంధత వాళ్లకు లేదు.

– రాజేంద్ర కుంభట్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

మన వైఖరి



రెండు ఘోరమైన పక్షాలు (ఇరాన్, పాకిస్తాన్) పోరాడుతున్నప్పుడు మనం ఎవరి పక్షమూ వహించము. తగినంత దూరం పాటిస్తూ, ఎవరు ఓడినా ప్రపంచానికి కొంత చీదర తగ్గిందని ఉత్సవం చేసుకుంటాం.

– అమిత్ శాండిల్య, కాలమిస్ట్

నిజమైన ప్రజాకవి

తెలుగువారు గర్వించదగిన గొప్ప సామాజిక కవి వేమన. 19వ శతాబ్దం మొదటి భాగంలో బ్రిటిష్ అధికారి చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వేమన రాసిన పద్యాలను సేకరించి పుస్తక రూపంలోకి తెచ్చి ఆయన గొప్పదనం ప్రపంచానికి తెలియడానికి కారకులయ్యారు.



వేమన

సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణం. వేమన స్పృజించని అంశం లేదు. సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లో దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని తన పద్యాలలో ప్రదర్శించాడు. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించటం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు ఒకటేమిటి... కనిపించిన ప్రతి సామాజిక అవకతవకల మీద వేమన్న కలం ఝళిపించాడు. పద్యాలన్నీ ఆట వెలది ఛందస్సులోనే చెప్పాడు.

మనుషుల మధ్య సమానత్వం ఉండాలని చెబుతూ 'ఉర్వి వారి కెల్ల నొక్క కంచంబు బెట్టి/పొత్తు గుడిపి కులము పొలయజేసి/తలను చెయ్యిబెట్టి తగ నమ్మ జెప్పరా/ విశ్వదాభిరామ వినురవేమ' అన్నాడు. సమాజంలో ఉన్న బాధలకు, దుఃఖాలకు, దురహంకారానికి, దౌర్జన్యానికి, గర్వానికి మూల కారణం వర్ణ వ్యవస్థ అన్న సత్యాన్ని వేమన తెలుసుకున్నాడు. మానవులంతా ఒక్కటే అన్న సత్యాన్ని చాటి చెప్పాడు. మానవులలో ఎక్కువ తక్కువలు ఉన్నంత కాలం చిక్కులు తప్పవు అంటాడు.

ఇంతటి గొప్పవాడు కాబట్టే కేంద్ర సాహిత్య అకాడమీ వారు వేమన జీవిత చరిత్రను వ్రాయించి 14 భాషల్లో అనువదింపజేశారు. ఐక్యరాజ్యసమితి-యునెస్కో విభాగం వారు ప్రపంచ భాషా కవులలో గొప్ప వారిని ఎంపిక చేసే సందర్భంలో వేమనను ఎంపిక చేసి ఆయన రచనలను పలు భాషల్లోకి అనువదింప చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా, కదిరి తాలూకాలోని కటారుపల్లిలో వేమన సమాధి గుర్తుగా ఒక శిలా ఫలకం ఉంది. వేమన ఈ గ్రామంలోనే మరణించాడని విశ్వసిస్తారు.

– పి.బి. చారి, ఈసీఐఎల్ విశ్రాంత అధికారి, హైదరాబాద్
(నేడు ప్రజాకవి వేమన జయంతి)

సామాజిక విప్లవ చైతన్యమూర్తికి నీరాజనం

సందర్భం



ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

విగ్రహాలు జాతి జీవన వికాస చారిత్రక ప్రతిబింబాలు. సమాజాన్ని చైతన్యపరచే విగ్రహాలు మౌన సందేశాలకు ప్రతిరూపాలు. భారతదేశం మినహా ప్రపంచదేశాల్లో ఇప్పటికి లక్షకు పైగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఉన్నాయని అధికారిక అంచనా. ప్రపంచ దేశాలు అంబేడ్కర్ జ్ఞాన సంపదకూ, సమసమాజ నిర్మాణ రచనా చాతుర్యానికీ, సమయస్ఫూర్తి గల వాగ్ధాటికీ ముగ్ధులై నిత్య నీరాజనాలు పలుకుతున్నాయంటే అది భారతదేశానికి గర్వకారణం. అంబేడ్కర్ సమాజం కోసం జీవించాడు. సమాజ పురోగతి కోసం నిరంతర పోరాటం జరిపిన అసమాన ప్రతిభావంతుడు. తాను నేర్చిన విద్య, విజ్ఞాన సంపద అంతా సమాజం కోసమే వినియోగించాడు. దీన్నే 'పేబాక్ టు ది సొసైటీ' అంటారు. అందుకే ఆయన విధానాలను పలు దేశాలు అనుసరిస్తున్నాయి. 'నా జీవన పోరాటమే నా సందేశం' (మేరా జీవన్ సంఘర్ష్ హీ మేరా సందేశ్) అని చెప్పిన మాటలే విశ్వ సందేశంగా వినువీధుల్లో వినిపిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు అంబేడ్కర్ విగ్రహాలు నెలకొల్పి తమకున్న గౌరవాన్ని చాటుకున్నాయి. అమెరికాలో మిచిగన్ విశ్వవిద్యాలయం (1993)లో ఒక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 2023 అక్టోబరు 14న మేరీలాండ్‌లో 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ' అనే పేర 19 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని నిలిపారు. 1996లో టొరంటో విశ్వవిద్యాలయం (కెనడా) కూడా అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొంది. ఇక బ్రిటన్‌లో చాలానే ఉన్నాయి. లండన్, బర్మింగ్ హామ్, మాంచిస్టర్‌లలో పలు విగ్రహాలను నెలకొల్పారు. అలాగే అంబేడ్కర్ చదివిన 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్' ముఖద్వారంలో 2000లో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. జర్మనీలోని బెర్లిన్, మ్యూనిక్, ఫ్రాంక్‌ఫర్ట్‌లలో; జపాన్‌లోని టోక్యో, ఒకాసా, కొయెటోలల్లో; దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్ బర్గ్, కేప్‌టౌన్, డర్బన్‌లలో; ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్ బోర్న్, బ్రిస్బెయిన్ వంటి నగరాల్లో; న్యూజిలాండ్‌లోని ఆక్లండ్ తదితర ప్రాంతాల్లో, మారిషస్ (2018), శ్రీలంక (కొలంబో), నేపాల్ (ఖాట్మండు 2019), బంగ్లాదేశ్ (ఢాకా 2021), దుబాయ్‌తో సహా మరెన్నో దేశాల్లో అంబేడ్కర్ విగ్రహాలు నెల కొన్నాయి.

తెలంగాణలో గతేడాది ఏప్రిల్ 14న అంబేడ్కర్ మునిమనుమడు ప్రకాష్ అంబేడ్కర్‌చే 125 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించబడింది. లక్నోలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పార్క్‌కు 'డాక్టర్ భీమ్‌రావ్ సామాజిక్ పరివర్తన్ స్థల్'గా నామకరణం చేసి అక్కడ ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ప్రదేశంలోనే జ్యోతిరావ్ పూలే, నారాయణగురు, బిర్సా ముండా, శాయాజీ మహరాజ్, కాన్షీ రామ్ విగ్రహాలున్నాయి. ఇక్కడే 124 ఏనుగుల విగ్రహాలు కొలువుదీరి సందర్శకులకు ఆహ్లాదం కలుగచేస్తున్నాయి.



నేడు విజయవాడలో 206 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

ఆంధ్రప్రదేశ్‌లో లెక్కకు మించిన అంబేడ్కర్ విగ్రహాలున్నాయి. వీటికి తోడు విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూ. 400 కోట్లకు పైగా ఖర్చుతో నిర్మించిన 206 అడుగుల విగ్రహాన్ని ఈ రోజు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్నారు. ఈ విగ్రహ పీఠం 81 అడుగుల ఎత్తు ఉంది. దానిపై ప్రతిష్ఠించిన 125 అడుగుల ప్రధాన విగ్రహంతో మొత్తం 206 అడుగుల అంబేడ్కర్ శిల్పం విజయవాడ నలుదిక్కులకూ కనిపిస్తూ, చూడగానే ఆకర్షించేలా ఉంది. ఈ విగ్రహ ప్రదేశం ఒక స్మృతివనంగా భాసిస్తుంది.

మూడు అంతస్తులున్న విగ్రహం కింది భాగంలో నాలుగు ఏసీ హాల్స్ ఉన్నాయి. నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మినీ థియేటర్, మ్యూజియం, మరో రెండు హాల్స్‌లో అంబేడ్కర్‌కు దక్షిణ భారతదేశంతో ఉన్న అనుబంధంతో కూడిన ఛాయాచిత్రాలు, మరో మ్యూజియం ఉంది. వీటికి తోడు రెండు వేలమంది కూర్చోవడానికి సరిపడే మరో ఓపెన్ ఎయిర్ థియేటర్‌తో పాటు అందమైన పార్కు, మరో అందమైన ఫౌంటెన్ సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. విగ్రహం రంగు మాసిపోకుండా పాల్యూరెథేన్ కోటింగ్ వేయటం మరో ప్రత్యేకత! 15 మంది ఎక్కడానికి సరిపడ రెండు లిఫ్టులను ఏర్పాటుచేశారు. మూడు అంతస్తుల్లో నిర్మితమైన ఈ ప్రదేశం ఒక పర్యాటక కేంద్రంగా వర్ధిల్లుతుందనటంలో ఎలాంటి అనుమానం లేదు. అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠతో విజయవాడలో నూతన సాంస్కృతిక వికాసం మరింతగా వృద్ధిచెందుతుంది. దీనివల్ల సమాజ వికాసంతోపాటు దళిత అస్తిత్వానికీ, సర్వమత సామరస్యానికీ, సకల మానవ సౌభ్రాతృత్వానికీ మరింత దోహదం చేకూరుతుంది. ఈ విగ్రహ ప్రాంగణం నిత్యమూ విజ్ఞాన మేధామథనంతోపాటు సకల కళలు అభివృద్ధి చెందే సాంస్కృతిక కేంద్రంగా మారు తుంది. ఈ కేంద్రంలో ఏర్పరచే నూతన పుస్తక భాండాగారం పుస్తక ప్రియులకూ, పాఠకులకూ ఒక విజ్ఞాన వికాస కేంద్రంగా నిత్యం అందుబాటులో ఉంటుంది.

అంబేడ్కర్ విగ్రహంతో పోరాటాల పురిటిగడ్డ విజయవాడ నగరానికి కొత్త అందాలు పురివిప్పుకుంటాయి. ఆయన జీవిత సందేశం అడుగడుగునా ప్రతిబింబించి ప్రగతిపథంలో పయనించే ప్రజలకు మార్గదర్శి కాగలదు.

వ్యాసకర్త ప్రముఖ సాహితీవేత్త । 98481 23655

అందరివాడు



మహరు కులమందు మహనీయుడై జన్మించాడు
అసమానతల మేఘాలు మధ్య ఆదిత్యుడై ప్రభవించె
అవమానాలు, బాధలను అభిమాన ధనుడై భరియించె
పేదరికాన్ని స్వీయ మేధావితనంతో జయించె
బుద్ధి మంతుడై ఘన బౌద్ధ మతాన్ని స్వీకరించాడు
అందరి వాడు అంబేడ్కరు... నీలాంబరాన్ని తాకేను అతని పేరు!

పుస్తకాలను ప్రేమించె అస్తమానం ఆరాధకుడిలా
విశ్వమంతా చదివేను వినుగు విశ్రాంతి లేకుండా
మస్తకాలలో నింపుకొనే బస్తాల కొద్దీ పరిజ్ఞానాన్ని
డిగ్రీ పట్టా లెన్నో పొందినాడు డీప్ పరిశోధకుడిలా!

ప్రాచీన భారతాన్ని నిశితంగా అధ్యయనం చేసి
కుల, మతాల భూతాలను పొలిమేరల నుంచి తరిమికొట్టె!
సమతా విత్తనాలను సర్వత్రా మేదినిలో వెదజల్లి
యువ భారతం కోసం నవ రాజ్యాంగాన్ని విరచించేను!

ఎవరెస్టు శిఖరం కన్న ఎత్తైన వ్యక్తిత్వం అతనిది
సముద్రం కంటే లోతైన సహృదయం ఆయనిది
ఆకాశ మంటేను అతగాడి ఆలోచనా లోచనాలు
కడిగిన జాతిరత్నమై కూడలిలో నిటారుగా నిలిచి
దారి చూపుతున్నాడు దళిత వర్గాలకు మార్గదర్శిగా!

– జి. సూర్య నారాయణ । 62817 25659

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్లు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.నవమి రా.11.23 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** అశ్వని ఉ.7.14 వరకు, తదుపరి భరణి తె.6.09 వరకు (తెల్లవారితే శనివారం), **వర్జ్యం:** సా.4.25 నుండి 5.53 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.49 నుండి 9.37 వరకు, తదుపరి ప.12.34 నుండి 1.22 వరకు, **అమృతఘడియలు:** రా.1.43 నుండి 3.16 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.39, **సూర్యాస్తమయం:** 5.44.

III
సాక్షి బిజినెస్
శుక్రవారం
19-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
314	110
71,187	21,462

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,029	△ 173
డోజోన్స్	37,263	△ 4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,451	△ 7
డాక్స్	16,560	△ 128
షాంఘై	2,846	△ 12
నికాయ్	35,466	▽ 11

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,970 ▽ 307
బంగారం (99.5 స్వచ్ఛత)	61,722 ▽ 306
వెండి (కిలో)	70,898 ▽ 293

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.77	106.34
€	యూరో	ఒకటి	89.28	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.85	57.12
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.75	55.67
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.21	62.67
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.73	23.53
¥	చైనా యువాన్	పదింటికి	10.43	12.51

విమానయానం ఉజ్వలం

- ఐదో అతిపెద్ద మార్కెట్‌గా భారత్
- ఏడేళ్లలో మరో 50 విమానాశ్రయాలు
- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి
- ప్రారంభమైన వింగ్స్ ఇండియా–24

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 'మనుషులను, మనసులను విమానయాన రంగం అనుసంధానిస్తోంది. జీవితాల్లో మార్పు తెచ్చింది. సామాజిక, ఆర్థిక పురోగతిలో పాలుపంచుకుంటోంది. నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత విమానయాన పరిశ్రమ వెలుగులమయం' అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గురువారం అన్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో రెండేళ్లకోసారి జరిగే వైమానిక ప్రదర్శన వింగ్స్ ఇండియా–2024 ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సామాన్యుడికీ విమానయాన అవకాశాన్ని అందించే ఉడాన్ 5.3 స్కీమ్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

దేశీయంగా 30 కోట్లకు..

పౌర విమానయాన రంగంలో ప్రపంచంలో అయిదవ స్థానంలో భారత్ నిలిచిందని జ్యోతిరాదిత్య తెలిపారు. '2014లో దేశీయంగా 6 కోట్ల మంది విమాన ప్రయాణం చేశారు. 2023లో ఈ సంఖ్య 15.3 కోట్లకు ఎగసింది. 2030 నాటికి ఇది 30 కోట్లను తాకుతుంది. విమాన ప్రయాణికుల విస్తృతి ప్రస్తుతం కేవలం 3–4 శాతమే. ఏడేళ్లలో ఇది 10–15 శాతానికి చేరుతుందన్న అంచనాలు ఉన్నాయి. మిగిలిన 85 శాతం మేర అవకాశాలను అందుకోవడానికి కసరత్తు చేస్తున్నాం. అడ్డంకులు తొలగించడంతోపాటు మౌలిక వసతుల కల్పన చేపడుతున్నాం' అని వివరించారు.

కొత్త విమానాశ్రయాలు..

దేశవ్యాప్తంగా 2014 నాటికి 74 విమానాశ్రయాలు, హెలిప్యాడ్స్, వాటర్ డ్రోమ్స్ ఉన్నాయి. ఇవి రావడానికి 65 ఏళ్ల సమయం పట్టిందని సింధియా తెలిపారు. 'గడిచిన 10 ఏళ్లలో 75 విమానాశ్రయాలు, హెలిప్యాడ్స్, వాటర్ డ్రోమ్స్ జోడించాం. దీంతో ఈ కేంద్రాల సంఖ్య 149కి చేరుకుంది. 2030 నాటికి ఇవి 200 దాటతాయి. ప్రతి జిల్లా కేంద్రంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలన్నది ప్రణాళిక. ప్రస్తుతం భారతీయ విమానయాన సంస్థల వద్ద 713 విమానాలు ఉన్నాయి. వచ్చే దశాబ్దిలో వీటి సంఖ్య 2,000 దాటుతుంది. విమానాల కొనుగోలులో యూఎస్, చైనా తర్వాతి స్థానాన్ని భారత్ కైవసం చేసుకుంది' అని అన్నారు.



రికార్డు స్థాయిలో మహిళా పైలట్లు..

ప్రయాణికుల వృద్ధి రేటు దేశీయంగా 15.3 శాతం, అంతర్జాతీయంగా 6.1 శాతం ఉంది. 15 ఏళ్లలో విమానాల్లో సరుకు రవాణా దేశీయంగా 60 శాతం, విదేశాలకు 53 శాతం అధికమైందని సింధియా గుర్తు చేశారు. 'గతేడాది 1,622 మంది కమర్షియల్ పైలట్ లైసెన్స్ అందుకున్నారు. వీరిలో 18 శాతం మహిళలు కావడం విశేషం. భారత్‌లో ఉన్న పైలట్లలో మహిళల వాటా 15 శాతం ఉంది. ఇది ప్రపంచ రికార్డు. డ్రోన్స్ రంగంలో ప్రపంచ కేంద్రంగా భారత్‌ను నిలబెట్టేందుకు నిబంధనలు సరళీకరించాం, ప్రోత్సాహకాలు ప్రకటించాం' అని చెప్పారు. కార్యక్రమంలో పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జనరల్ (రిటైర్డ్) వి.కె.సింగ్, తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్లలో 2,840 విమానాలు కావాలి

- దేశీయంగా సోర్సింగ్ రెట్టింపు చేస్తాం
- భారత మార్కెట్‌పై ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్ రెమీ మిలార్డ్



రాబోయే రోజుల్లో అంతర్జాతీయ ఏవియేషన్ రంగానికి భారత్ దన్నుగా నిలుస్తుందని విమానాల తయారీ దిగ్గజం ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్ రెమి మిలార్డ్ తెలిపారు. గణనీయంగా వృద్ధి చెందుతున్న భారత మార్కెట్‌కు వచ్చే 20 ఏళ్లలో 2,840 కొత్త విమానాలు అవసరమన్నారు. అలాగే 41,000 మంది పైలట్లు, 47,000 మంది టెక్నికల్ సిబ్బంది కావాల్సి ఉంటుందని గురువారం వింగ్స్ ఇండియా 2024 కార్యక్రమంలో ఆయన చెప్పారు. వచ్చే 20 ఏళ్ల పాటు ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలుస్తుందని అంచనాలు ఉన్నట్లు రెమీ తెలిపారు. భారత్ నుంచి రెట్టింపు స్థాయిలో కొనుగోలు చేయనున్నట్లు రెమీ వివరించారు. ప్రస్తుతం 750 మిలియన్ డాలర్లుగా ఉన్న సోర్సింగ్‌ను ఈ దశాబ్దం చివరికి 1.5 బిలియన్ డాలర్లకు పెంచుకోనున్నట్లు చెప్పారు. భారత్ నుంచి గతేడాది 750 విమానాలకు ఆర్డర్లు రాగా 75 ఎయిర్‌క్రాఫ్ట్‌లను దేశీ విమానయాన సంస్థలకు డెలివరీ చేసినట్లు వివరించారు. వీటిలో 41 విమానాలు ఇండిగో సంస్థకు, ఎయిరిండియాకు 19, విస్తారకు 14, గో ఫస్ట్‌కు ఒకటి చొప్పున అందించినట్లు రెమీ చెప్పారు. తమ ఏ350 రకం విమానాలు భారత్‌లో అంతర్జాతీయ ప్రయాణాలకు ఊతమివ్వగలవని పేర్కొన్నారు. గతేడాది ఎయిరిండియాకు ఆరు ఏ350 విమానాలను అందించినట్లు చెప్పారు. భారత్‌లో విమానాల నిర్వహణ, రిపేర్లు, ఓవరాలింగ్ వ్యవస్థ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు.

కర్నూలులో పైలట్ల శిక్షణ కేంద్రం

కర్నూలు విమానాశ్రయంలో పైలట్ల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. ఇప్పటికే అయిదారు సంస్థలు ఆసక్తి కనబరిచాయని ఏపీ ప్రభుత్వ ఏవియేషన్ సలహాదారు, ఏపీ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ వి.ఎన్. భరత్ రెడ్డి సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. టెండర్లకు జనవరి 31 వరకు గడువు ఉందని ఆయన పేర్కొన్నారు. ఇది కార్యరూపం దాలిస్తే ఏటా 40–50 మంది శిక్షణ తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

గడువు కంటే ఆరు నెలల ముందే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. 2025 మే నాటికి ఇది సిద్ధం అవుతుందని వెల్లడించారు. తొలి దశలో ఏటా 60 లక్షల మంది, తుది దశ పూర్తి అయ్యే నాటికి ఏటా 4 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నట్టు వివరించారు. భోగాపురం విమానాశ్రయాన్ని పీపీపీ విధానంలో జీఎంఆర్ నిర్మిస్తోంది. 2,200ల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో సుమారు రూ.5,000 కోట్లు వ్యయం అవుతోందని భరత్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎయిర్‌పోర్టులను అనుసంధానిస్తూ కొత్త రూట్లలో సర్వీసులను అందించాల్సిందిగా కోరుతూ పలు విమానయాన సంస్థలతో ఇటీవల చర్చలు జరిపామని చెప్పారు.

వింగ్స్ ఇండియా హైలైట్స్

హెరిటేజ్ ఏవియేషన్
ఎయిర్‌క్రాఫ్ట్ చార్టర్ కంపెనీ హెరిటేజ్ ఏవియేషన్ తాజాగా హెచ్125, హెచ్130 హెలికాప్టర్ల కోసం ఎయిర్‌బస్‌కు ఆర్డరు ఇచ్చింది. వీటిని ప్రాంతీయ కనెక్టివిటీ స్కీము ఉడాన్ కింద సర్వీసుల కోసం ఉపయోగించనున్నట్లు సంస్థ సీఈవో రోహిత్ మాథుర్ తెలిపారు. ఎత్తైన, వేడిమి ఎక్కువగా ఉండే వాతావరణాల్లో ప్రయాణాలకు హెచ్125 హెలికాప్టర్ ఉపయోగపడుతుంది. ఇక సైట్ సీయింగ్, అత్యవసర వైద్య సర్వీసులు మొదలైన వాటి కోసం హెచ్130 సహాయకరంగా ఉంటుంది.

ఎయిర్ ఇండియా
గురుగ్రామ్‌లో 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసియాలో అతిపెద్ద ఏవియేషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఎయిర్‌బస్, బోయింగ్ కోసం 20కిపైగా సిమ్యులేటర్స్‌తో పైలట్లకు శిక్షణ.

జీఎంఆర్ ఏరో
జ్యోతిరాదిత్య సింధియా చేతుల మీదుగా ఏవియేషన్ స్కూల్ వర్చువల్‌గా ప్రారంభం.

టీఏఎస్ఎల్
విడిభాగాల తయారీకై మహీంద్రా ఏరోస్పేస్‌తో కలిసి ఎయిర్‌బస్ నుంచి ఆర్డర్లను పొందింది.

ఆకాశ ఎయిర్
బోయింగ్ 737 మ్యాక్స్ రకం 150 విమానాలకు ఆర్డర్ ఇచ్చింది.



టారో.. సన్ ఫార్మా సొంతం

- మిగిలిన 21.52 శాతం వాటా కొనుగోలు
- ఇందుకు రూ.2,892 కోట్ల వ్యయం

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్‌కు చెందిన టారో ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ పూర్తిగా సన్‌ఫార్మా సొంతం కానుంది. ఇప్పటికే టారో ఫార్మాలో సన్ ఫార్మాకు 78.48% వాటా ఉంది. కంపెనీలో మిగిలిన 21.52% వాటాను కూడా కొనుగోలు చేయనున్నట్టు సన్ ఫార్మా ప్రకటించింది. ఇందుకు రూ.2,891.76 కోట్లు వ్యయం చేయనున్నట్టు తెలిపింది. టారో ఫార్మాలో మిగిలిన షేర్లను ఒక్కోటీ 43 డాలర్ల చొప్పున సొంతం చేసుకునేందుకు అంగీకారం కుదిరినట్టు పేర్కొంది. జనరిక్ డెర్మటాలజీ మార్కెట్లో టారో కీలక సంస్థగా ఉన్నట్టు సన్‌ఫార్మా తెలిపింది.

బీఎస్‌ఈలో సన్‌ఫార్మా షేరు 3 శాతం లాభపడి రూ.1,336 వద్ద ముగిసింది.

మూడో రోజూ వెనకడుగు

- సెన్సెక్స్ 314 పాయింట్ల పతనం
- నిఫ్టీకి 110 పాయింట్ల నష్టం



ముంబై: స్టాక్ మార్కెట్ మూడోరోజూ నష్టాలు చవిచూసింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు మూడోరోజూ అమ్మకాల ఒత్తిడికి లోనవడం, ఐటీ షేర్ల బలహీన ట్రేడింగ్, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు సందేహాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 314 పాయింట్లు నష్టపోయి 71,187 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 110 పాయింట్లు పతనమై 21,462 వద్ద స్థిరపడింది. ఉదయం ఆసియాలో జపాన్, సింగపూర్, థాయిలాండ్ సూచీలు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు 1% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు మూడోరోజూ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్ఈలో 3% నష్టపోయి రూ.1,487 వద్ద స్థిరపడింది. బుధ, గురువారాల్లో 11% నష్టపోవడంతో బ్యాంకు మార్కెట్ విలువ రూ.1.45 లక్షల కోట్లు కోల్పోయి రూ.11.28 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ షేరు 6% నష్టపోయి రూ.486 వద్ద ముగిసింది. మూడో క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడం ఇందుకు కారణం.
- క్యూ3 ఫలితాలు అంచనాలకు అందుకోలేకపోవడంతో ఎల్‌టీఐమైండ్‌ట్రీ షేరు 11% నష్టపోయి రూ.5,602 వద్ద స్థిరపడింది.

మారుత్ డ్రోన్స్, స్కైడ్రైవ్ ఎంవోయూ



హైదరాబాద్: మారుత్ డ్రోన్స్, స్కైడ్రైవ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. వ్యాపారాభివృద్ధితోపాటు, ఎలక్ట్రిక్ వెర్టిక్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (ఈవీటాల్) ఎయిర్‌క్రాఫ్ట్ (ఎయిర్ ట్యాక్సీ/ఫ్లయింగ్ ట్యాక్సీ) విభాగంలో అవకాశాల అన్వేషణకు ఇది వీలు కల్పించనుంది. తప్పనిసరి మినహాయింపులు, సర్టిఫికెట్‌లను సొంతం చేసుకోవడంతోపాటు, ప్రభుత్వ మద్దతు పొందడం, పైలట్, మెకానిక్‌లకు శిక్షణ, కీలక భాగస్వాముల గుర్తింపు విషయంలో మారుత్ డ్రోన్స్‌కు ఈ సహకారం తోడ్పడనుంది. మారుత్ డ్రోన్స్ ఇప్పటికే డ్రోన్ల కోసం అన్‌మ్యాన్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను అభివృద్ధి చేసింది. ఇప్పుడు ఈ ఎంఓయూతో ఎయిర్‌ట్యాక్సీ కార్యకలాపాల్లోకీ విస్తరించనుంది.

సాక్షి స్పోర్ట్స్



విజయం వాకిట్లో ఆసీస్

వెస్టిండీస్‌తో తొలి టెస్టులో ఆస్ట్రేలియా విజయం దిశగా పయనిస్తుంది. ఓవర్‌నైట్ స్కోరు 59/2తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 283 పరుగుల వద్ద ఆలౌటైంది. హెడ్ (119: 12 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీ చేశాడు. 95 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ఆడిన వెస్టిండీస్ హాజల్‌వుడ్ (4/18) దెబ్బకు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లకు 73 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే విండీస్ మరో 22 పరుగులు చేయాలి.

మళ్లీ ఓడిన భారత్

ఆసియా కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నీలో భారత జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. గ్రూప్ 'బి'లో భాగంగా దోహాలో గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 0–3 గోల్స్ తేడాతో ఉజ్బెకిస్తాన్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఈ ఓటమితో భారత జట్టుకు నాకౌట్ దశకు అర్హత సాధించే అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. ఈనెల 23న జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో సిరియాతో భారత్ ఆడుతుంది.



క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రెండో సీడ్ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–14, 21–15తో చింగ్ యావో లు–పో హాన్ యాంగ్ (చైనీస్ తైపీ) జంటపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. భారత్‌కే చెందిన ప్రియాన్షు రజావత్‌తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 20–22, 21–14, 21–14తో గెలుపొందాడు.

నేడు జపాన్‌పై గెలిస్తేనే భారత జట్టుకు 'పారిస్' బెర్త్



రాంచీ: మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ సెమీఫైనల్లో భారత జట్టుకు ఓటమి ఎదురైంది. జర్మనీతో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో టీమిండియా 'షూటౌట్'లో 3–4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఈ గెలుపుతో జర్మనీ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. తొలి సెమీఫైనల్లో అమెరికా 2–1తో జపాన్‌ను ఓడించి పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మూడో బెర్త్ కోసం నేడు భారత్, జపాన్ జట్లు తలపడతాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తుంది. జర్మనీతో జరిగిన సెమీఫైనల్లో నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), ఇషిక (59వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. జర్మనీ జట్టుకు చార్లోటి (27వ, 57వ ని.లో) రెండు గోల్స్ అందించింది. 'షూటౌట్'లో తొలి ఐదు షాట్‌లు ముగిశాక రెండు జట్లు 3–3తో సమంగా నిలిచాయి. ఫలితం తేలడానికి 'సడెన్‌డెత్'ను నిర్వహించగా... తొలి ప్రయత్నంలో రెండు జట్లు విఫలమయ్యాయి. రెండో ప్రయత్నంలో భారత ప్లేయర్ సంగీత గురి తప్పగా... జర్మనీ ప్లేయర్ లీసా నోల్టి గోల్ చేసి జర్మనీ విజయాన్ని ఖరారు చేసింది.

భళా బ్లింకోవా

- మూడో సీడ్ రిబాకినాపై సంచలన విజయం
- గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలోనే సుదీర్ఘంగా సాగిన టైబ్రేక్‌లో రష్యా ప్లేయర్‌దే పైచేయి
- 31 నిమిషాలపాటు కొనసాగిన టైబ్రేక్‌లో 22–20తో నెగ్గిన బ్లింకోవా


బ్లింకోవా
రిబాకినా

మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో సంచలనాల పర్వం కొనసాగుతోంది. ఐదో రోజు గురువారం టాప్–10లోని ఇద్దరు క్రీడాకారిణులు రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. గత ఏడాది రన్నరప్, ప్రపంచ మూడో ర్యాంకర్, మూడో సీడ్ రిబాకినా (కజకిస్తాన్)... ప్రపంచ ఐదో ర్యాంకర్, ఐదో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) రెండో రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రస్తుతం టాప్–10లో నలుగురు క్రీడాకారిణులు టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్), రెండో సీడ్ సబలెంకా (బెలారస్), నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా), పదో సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా) మాత్రమే బరిలో నిలిచారు.

42 పాయింట్ల టైబ్రేక్...

రష్యాకు చెందిన 25 ఏళ్ల అనా బ్లింకోవా 2 గంటల 46 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో 6–4, 4–6, 7–6 (22/20)తో రిబాకినాపై గెలుపొందగా... క్లారా బురెల్ (ఫ్రాన్స్) 70 నిమిషాల్లో 6–4, 6–2తో పెగూలాను ఓడించి తమ కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. బ్లింకోవా–రిబాకినా మ్యాచ్ చరిత్ర పుటల్లోకి ఎక్కింది. నిర్ణాయక మూడో సెట్‌లో జరిగిన టైబ్రేక్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలోనే సుదీర్ఘంగా సాగిన టైబ్రేక్‌గా నిలిచింది. 31 నిమిషాలపాటు సాగిన 42 పాయింట్ల టైబ్రేక్‌లో చివరకు బ్లింకోవా 22–20తో విజయాన్ని ఖరారు చేసుకుంది. మూడో సెట్ ఏకంగా 93 నిమిషాలు సాగింది. గత ఏడాది వింబుల్డన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో లెసియా సురెంకో (ఉక్రెయిన్)–అనా బొగ్డాన్ (రొమేనియా) మధ్య మూడో రౌండ్ మ్యాచ్‌లోని మూడో సెట్‌లో టైబ్రేక్ 38 పాయింట్లపాటు జరిగింది. చివరకు సురెంకో ఈ టైబ్రేక్‌ను 20–18 పాయింట్లతో గెల్చుకుంది. రిబాకినాతో జరిగిన మ్యాచ్‌లో బ్లింకోవా ఏకంగా ఆరుసార్లు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని నెగ్గడం విశేషం. మరోవైపు రిబాకినా తొమ్మిదిసార్లు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్నా పదోసారి పరాజయం తప్పలేదు.

శ్రమించి నెగ్గిన స్వియాటెక్

ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) మూడో రౌండ్ చేరడానికి 3 గంటల 14 నిమిషాలు శ్రమించింది. ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురి పెట్టిన స్వియాటెక్ రెండో రౌండ్‌లో 6–4, 3–6, 6–4తో 2022 రన్నరప్ డానియెలా కొలిన్స్ (అమెరికా)పై కష్టపడి గెలిచింది. మరో మ్యాచ్‌లో 14వ సీడ్ కసత్‌కినా 6–4, 3–6, 3–6తో స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా) చేతిలో, 2021 యూఎస్ ఓపెన్ చాంపియన్ ఎమ్మా రాడుకానూ (బ్రిటన్) 4–6, 6–4, 4–6తో యాఫాన్ వాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయారు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో 11వ సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా) 6–0, 3–6, 6–4తో ఐలా తొమ్లాజనోవిచ్ (ఆస్ట్రేలియా)పై, 12వ సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) 6–3, 6–3తో కేటీ బుల్టర్ (బ్రిటన్)పై, 19వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 6–1, 6–3తో తొమోవా (బల్గేరియా)పై గెలిచారు.

హోల్గర్ రూనెకు చుక్కెదురు

పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) రెండో రౌండ్‌లో నిష్క్రమించాడు. ఆర్థర్ కజాక్స్ (ఫ్రాన్స్) 7–6 (7/4), 6–4, 4–6, 6–3తో రూనెపై గెలిచాడు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ అల్కరాజ్ (స్పెయిన్) 6–4, 6–7 (3/7), 6–3, 7–6 (7/3)తో సొనెగో (ఇటలీ)పై, ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 7–5, 3–6, 4–6, 7–6 (7/5), 7–6 (10/7)తో లుకాస్ క్లీన్ (స్లొవేకియా)పై, 11వ సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) 6–3, 6–7 (5/7), 6–3, 3–6, 7–6 (10/7)తో మాక్స్ పర్సెల్ (ఆస్ట్రేలియా)పై కష్టపడి గెలిచారు.

పోరాడి ఓడిన సుమిత్ నగాల్



భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన ప్రపంచ 137వ ర్యాంకర్ సుమిత్ నగాల్ గురువారం జరిగిన రెండో రౌండ్‌లో 6–2, 3–6, 5–7, 4–6తో ప్రపంచ 140వ ర్యాంకర్ జున్‌చెంగ్ షాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 50 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ 22 అనవసర తప్పిదాలు చేశాడు. రెండో రౌండ్‌లో ఓడిన సుమిత్ నగాల్‌కు ఓవరాల్‌గా 2,45,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 1 కోటీ 33 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 7–6 (7/5), 4–6, 7–6 (10/2)తో డక్‌వర్త్–పాల్మన్స్ (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది. అనిరుధ్–విజయ్ ప్రశాంత్ (భారత్) ద్వయం 3–6, 4–6తో మరోజ్‌సన్–పుచోవిక్స్ (హంగేరి) జోడీ చేతిలో ఓడింది.



ఆరో టైటిల్ లక్ష్యంగా...

- బరిలో యువ భారత్
- నేటి నుంచి అండర్–19 ప్రపంచకప్
- రేపు బంగ్లాదేశ్‌తో టీమిండియా మ్యాచ్

రాబోయే క్రికెట్‌లో కాబోయే స్టార్లు అయ్యేందుకు అండర్–19 వన్డే ప్రపంచకప్‌కు మించిన టోర్నీ ఏదీ లేదు. అంతర్జాతీయ కెరీర్‌కు కచ్చితంగా సోపానమయ్యే ఈ టోర్నీలో సత్తా చాటేందుకు కుర్రాళ్లంతా సై అంటే సై అంటున్నారు. నేటి నుంచి దక్షిణాఫ్రికాలో జరిగే ఈ మెగా ఈవెంట్‌లో ఐదుసార్లు విజేత అయిన భారత జట్టు ఆరో టైటిల్ లక్ష్యంగా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

బ్లూమ్‌ఫొంటీన్ (దక్షిణాఫ్రికా): గతంలో యువరాజ్ సింగ్ (2000–ప్రపంచకప్)... ప్రస్తుతం రోహిత్ శర్మ (2006), కోహ్లి (2008)... ఇకపై ఇషాన్ కిషన్ (2016), గిల్ (2018) భారత క్రికెట్ చరిత్రలో బంగారు బాట వేసుకున్నారు. వీళ్లంతా అండర్–19 ప్రపంచకప్ నుంచి వెలుగులోకి వచ్చినవారే! వీళ్లే కాదు... మనీశ్ పాండే, ఉన్ముక్త్ చంద్, యశ్ ధుల్, మన్‌జోత్ కల్రా, కమలేశ్ నాగర్‌కోటి ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మందే ఉన్నారు. క్రికెట్ క్రేజీ భారత్‌ను మరో స్థాయిలో నిలబెట్టారు. అందువల్లే భారత్ కుర్రాళ్ల మెగా ఈవెంట్‌లో ఎప్పటికప్పుడు హాట్ ఫేవరెట్‌గా ఉంది. ఇప్పుడు కూడా డిఫెండింగ్ చాంపియన్ హోదాతో సఫారీలో ఆరో ప్రపంచకప్ టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత్ తమ తొలి మ్యాచ్‌ను శనివారం బంగ్లాదేశ్‌తో ఆడనుంది. భారత్ మిగతా రెండు లీగ్ మ్యాచ్‌లను ఈనెల 25న ఐర్లాండ్‌తో, 28న అమెరికాతో ఆడుతుంది.

ఇదీ ఫార్మాట్...

ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు బరిలో ఉన్నాయి. వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ దశలో ఒక్కో జట్టు మూడు లీగ్ మ్యాచ్‌లను ఆడుతుంది. ఈ నెల 24వ తేదీ వరకు గ్రూప్ దశలో 24 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఓ రోజు విశ్రాంతి అనంతరం 30 నుంచి 'సూపర్ సిక్స్' దశ పోరు ఉంటుంది. అనంతరం ఫిబ్రవరి 6, 8 తేదీల్లో రెండు సెమీఫైనల్ పోటీలు జరుగుతాయి. టైటిల్ పోరు 11న జరుగనుంది.

ఎఫ్ఐఎం ఇ–ఎక్స్‌ప్లోరర్‌లో భారత జట్టు

బరిలోకి దిగనున్న ఇండి రేసింగ్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మోటార్ సైక్లింగ్ సమాఖ్య (ఎఫ్ఐఎం) నిర్వహించే ప్రతిష్టాత్మక ఇ–ఎక్స్‌ప్లోరర్ ఈవెంట్‌లో తొలిసారి భారత జట్టు ప్రాతినిధ్యం వహించనుంది. 2024 సీజన్‌లో భారత్‌కు చెందిన 'ఇండి రేసింగ్' టీమ్ బరిలోకి దిగుతుంది. అధికారికంగా ఎఫ్ఐఎం అనుమతించిన రేసింగ్ పోటీల్లో పాల్గొనే తొలి టీమ్ 'ఇండి రేసింగ్' అవుతుంది. ఈ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి ఈ విషయాలు వెల్లడించారు. తాజా సీజన్ రేసులు జపాన్‌లో వచ్చే ఫిబ్రవరిలో మొదలవుతాయి. నవంబర్‌లో హైదరాబాద్‌లోనే రేసింగ్ నిర్వహించే అవకాశం ఉంది. ఇండి రేసింగ్ టీమ్ తరఫున ఐశ్వర్య పిస్సే, స్పెన్సర్ విల్టన్, సాంద్రా గోమెజ్ పోటీ పడతారు. భారత్‌లో మోటార్ స్పోర్ట్స్‌పై ఆసక్తి ఇటీవల చాలా పెరిగిందని, అయితే పోటీల్లోకి వచ్చేసరికి మన టీమ్‌కు ప్రాతినిధ్యం లేదని కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ వ్యవస్థాపకుడు అభిషేక్ రెడ్డి అన్నారు. ఇప్పుడు తమ జట్టు ఇండి రేసింగ్ ఆ అవకాశం కలిగిస్తుందని, ఎక్కువ మంది దీనివైపు మళ్లేలా తమ ప్రయత్నం ఉపకరిస్తుందని ఆయన చెప్పారు.

యువర్స్





● దీపెన్

దారి దీపం

సమస్య గురించి నిట్టూర్చేవారు కొందరు. సమస్యకు పరిష్కారం వెదకాలని ప్రయత్నించేవారు కొందరు. దీపెన్ బబారియా రెండో కోవకు చెందిన వ్యక్తి. కాలేజీ రోజుల్లో ఎదురైన సమస్య స్టార్టప్ ఐడియాకు ఊపిరి పోసింది. ఇనోవేటర్‌గా, 'రోడ్‌మాట్రిక్స్' రూపంలో సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా దీపెన్‌ను మార్చింది...

దీపెన్ బబారియా అతని ఫ్రెండ్ ఒకరోజు రాత్రి పనిపై బైక్‌పై ఎక్కడికో వెళుతున్నారు. లొకేషన్ తెలియక నావిగేషన్ కోసం గూగుల్ మ్యాప్స్‌ను ఓపెన్ చేశారు. 'ఫాస్టెస్ట్ రూట్' అని చూపించింది. తీరా చూస్తే అది గుంతలతో కూడిన రోడ్డు. మరోవైపు స్ట్రీటు లైట్లు లేకపోవడంతో బైక్ ముందుకు వెళ్లడానికి ఇబ్బంది ఎదురైంది.

'దూరం, వేగాన్ని లెక్కలోకి తీసుకొని ఈ మ్యాప్స్ షార్టెస్ట్ రూట్‌ను గుర్తిస్తాయి తప్ప అధ్వానంగా ఉన్న రోడ్లను మాత్రం గుర్తించవు' అంటున్న దీపెన్ ఈ సమస్యకు ఏఐ ద్వారా పరిష్కారం చూపాలని కాలేజీరోజులలో గట్టిగా అనుకున్నాడు. సూరత్(గుజరాత్)కు చెందిన దీపెన్ ఏఐ స్పెషలైజేషన్‌తో ఇంజనీరింగ్ చదువుకుంటున్న రోజుల్లో రోడ్ల స్థితిగతులను తెలిజేసే అప్లికేషన్‌ను మొబైల్ ఫోన్‌ల కోసం రూపొందించాలనుకున్నాడు. ఈ ఆలోచన క్రమంగా పెరిగి పెద్దదై స్టార్టప్ రూపం తీసుకుంది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనే కలతో స్టార్టప్‌ల కేంద్రం అయిన బెంగళూరులో అడుగు పెట్టాడు దీపెన్. అక్కడ దీపెన్ ఐడియాపై నిఖిల్ ప్రసాద్ ఆసక్తి చూపించాడు. యూఎస్‌లో ఆటోమోటివ్ కారు కంపెనీలలో పని చేసిన నిఖిల్ ఇండియాకు తిరిగి వచ్చాడు. స్టార్టప్ కో-ఫౌండర్‌లలో నిఖిల్ ఒకరు.

తక్కువ సమయంలోనే ఈ స్టార్టప్‌పై ఇన్వెస్టర్‌లు ఆసక్తి ప్రదర్శించారు. 100ఎక్స్.వీసి ఫస్ట్ ఫండింగ్ చేసింది.

రోడ్ మేనేజ్‌మెంట్ ప్లానును అందించే ఏఐ-బేస్డ్ స్టార్టప్ 'రోడ్‌మెట్రిక్స్' బెంగళూరు కేంద్రంగా ప్రారంభమైంది.

'కాలేజీరోజుల్లో ఎన్నో ప్రాజెక్ట్‌ల్లో పనిచేసిన నాకు ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం ఇదే మొదటిసారి. చాలా సంతోషంగా అనిపించింది. రోడ్డు సేఫ్టీ అనేది ముఖ్యమైన అంశం. అయితే రోడ్డు హెల్త్‌ను తెలియజేసే సాఫ్ట్‌వేర్‌లు మన దగ్గర లేవు. ఈ లోటును పూరించేలా రోడ్‌మెట్రిక్స్‌ను తీసుకువచ్చాం' అంటాడు దీపెన్.

మొబైల్ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని మొదట్లో అనుకున్న ఐడియాపై వర్క్ చేశాడు దీపెన్. మొబైల్ అప్లికేషన్‌గా పనిచేసే సెన్సర్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం బాగున్నప్పటికీ వైబ్రేషన్స్‌ను క్యాప్చర్ చేయడానికి రోడ్డు ప్రతి భాగంలో డ్రైవ్ చేయాల్సి ఉంటుంది. ఇదొక సమస్య.

దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇతర కో-ఫౌండర్‌లతో కలిసి దీపెన్ మరింత రిసెర్చ్ చేసి ఇమేజ్ బేస్డ్, కంప్యూటర్ విజన్ బేస్డ్ సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేశాడు. వీరు రూపొందించిన ఏఐ అల్గారిథమ్ పది రకాల రోడ్ డిఫెక్ట్స్‌ను గుర్తిస్తుంది. ఫాస్టెస్ట్, మోస్ట్ కంఫర్టబుల్, ట్రాఫిక్‌లెస్ రోడ్లను గుర్తించడానికి వినియోగదారులకు ఉపకరించే రోడ్‌మెట్రిక్స్ మ్యాప్స్‌ను కూడా అభివృద్ధి చేశారు. మొదట బెంగళూరు, ముంబై రోడ్లను మ్యాపింగ్ చేసిన తరువాత అస్సాం, బిహార్‌లలో కూడా పనిచేశారు.

'మా సాఫ్ట్‌వేర్ అంచనా వేసిన డ్యామేజ్ రిపోర్ట్‌ల ఆధారంగా మున్సిపాలిటీలు, ప్రైవేటు సంస్థలు నిధుల కేటాయింపు గురించి సరియైన నిర్ణయం తీసుకోవచ్చు' అంటున్న దీపెన్ రోడ్డు సమస్యలను గుర్తించడంలో జంషెడ్‌పూర్‌లోని టాటాగ్రూప్‌నకు సహాయం అందించాడు.

టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్‌తో కలిసి పనిచేస్తున్న 'రోడ్‌మెట్రిక్స్' ప్రభుత్వ మున్సిపాలిటీలతో పనిచేయడానికి చర్చలు జరుపుతోంది. మన దేశంలో వేలాది కిలోమీటర్‌లు కవర్ చేసిన కంపెనీ ఇక్కడితో ఆగిపోలేదు. 'సిటీ ఆఫ్ లండన్' మ్యాపింగ్ కూడా స్టార్ట్ చేసింది.అక్కడ కూడా స్టార్టప్‌కు క్లయింట్స్ ఉన్నారు.

'మన రహదారులను సాధ్యమైనంత సురక్షితంగా మార్చాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలనుకుంటున్నాం' అంటున్నాడు దీపెన్ బబారియ. 'రోడ్ మెట్రిక్స్' స్టార్టప్ మొబిలిటీ ఏఐ గ్రాండ్ ఛాలెంజ్, బెస్ట్ ఏఐ స్టార్టప్ అవార్డ్‌తో సహా ఎన్నో అవార్డ్‌లను సొంతం చేసుకుంది.



● మ్యూజిక్ వరల్డ్

సుమధుర ధ్వని

స్కూలు, కాలేజి రోజుల నుంచి రోజుల తరబడి పాటలు వినేది ధ్వని భానుశాలి. అందరూ తనను సరదాగా 'సాంగ్ ఈటర్' అని పిలిచేవారు. రికార్డ్ బ్రేకింగ్ సాంగ్ 'వాస్తే'తో లైమ్‌లైట్‌లోకి వచ్చిన ధ్వని సింగర్‌గా బాలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకుంది. మంత్రముగ్ధులను చేసే అందమైన గానంతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. చిత్రపరిశ్రమలో గొప్ప సంగీతదర్శకులతో కలిసి పనిచేసే అదృష్టాన్ని సొంతం చేసుకుంది. ధ్వని పాడిన 'దిల్బార్' పాట బిల్‌బోర్డ్ యూట్యూబ్‌లో మ్యూజిక్ ర్యాంకింగ్‌లో మూడో స్థానంలో నిలిచిన తొలి భారతీయ సింగిల్‌గా చరిత్ర సృష్టించింది. 'ఒక ఆర్టిస్ట్ నుంచి స్ఫూర్తి తీసుకోవచ్చు. కానీ వారి శైలిని కాపీ కొట్టకూడదు' అంటున్న ధ్వని సంగీతప్రపంచంలో తనదైన అందమైన సంతకాన్ని సృష్టించుకుంది. ధ్వని ఇండస్ట్రీలోకి అడుగు పెట్టినప్పుడు ప్రోత్సాహకంగా మాట్లాడిన వారు తక్కువే. దీని గురించి ఇలా స్పందిస్తుంది ధ్వని...'ఒక్కొక్కరికీ ఒక్కో అభిప్రాయం ఉంటుంది. రకరకాల అభిప్రాయాలు వినడం వల్ల మనం ఎంచుకున్న దారి సరియైనదేనా అనే డౌటు వచ్చి అయోమయంలోకి వెళతాం. ఇలాంటి సమయంలో మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. నా ప్రయాణంలో నేను అది కోల్పోలేదు' అంటుంది ధ్వని భానుశాలి.

● టెక్.. టాక్

వన్‌ప్లస్ 12 ఆర్



డిస్‌ప్లే: 6.78 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా: 16 ఎంపీ
బ్యాటరీ: 5500 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్ 14
ర్యామ్: 12జీబి ; స్టోరేజ్: 256 జీబి
వోఎస్: ఆండ్రాయిడ్ 14 ; రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్

మొబైల్ టేబుల్‌టాప్ స్టాండ్



- బ్రాండ్: స్యాప్‌కార్ట్ ● కలర్: వైట్
- ఫామ్ ఫ్యాక్టర్: టేబుల్ స్టాండ్
- మల్టీ ఫంక్షన్ క్లిప్
- మల్టీపర్పస్ మొబైల్ యాక్సెసరీ

గూగుల్ అసిస్టెంట్‌లో...



గూగుల్ తన ఏఐ-పవర్డ్ అసిస్టెంట్ అప్‌డేటింగ్‌లో భాగంగా కొన్ని అండర్ యుటిలైజ్‌డ్ ఫీచర్‌లను తొలిగించనుంది. వాటిలో కొన్ని: ప్లేయింగ్ అండ్ కంట్రోలింగ్ ఆడియో బుక్స్, సెట్టింగ్ మీడియా అలారమ్స్, మ్యానేజింగ్ కుక్‌బుక్స్, యూజింగ్ వాయిస్ కాల్స్ అండ్ ఇ-మెయిల్, రీషెడ్యూలింగ్ ఈవెంట్స్, వాయిస్ కంట్రోల్ ఫర్ యాక్టివిటీస్, వ్యూయింగ్ యువర్ స్లీప్ సమ్మరిస్, రిక్వెస్టింగ్ స్పెసిఫిక్ యాక్షన్స్ వయా వాయిస్-మేకింగ్ పేమెంట్స్, రిజర్వేషన్స్, సోషల్ మీడియా పోస్ట్స్, రిక్వెస్టింగ్ ఇన్‌ఫర్‌మేషన్ ఎబౌట్ యువర్ కాంటాక్ట్స్, కమ్యూట్ టు వర్క్ టైమ్ ఎస్టిమేట్స్.

మైక్రోసాఫ్ట్ కొత్త ఏఐ బటన్

మైక్రోసాఫ్ట్ తన విండోస్ కీబోర్డులకు కొత్త ఏఐ బటన్‌ను యాడ్ చేస్తుంది. రిబ్బన్-షేప్‌డ్ బటన్ ప్రెస్ చేయడం ద్వారా ఏఐ-పవర్డ్ చాట్‌బాట్ కోపైలట్ ఆన్‌లైన్‌లో ఫర్నిచర్ సెర్చింగ్, డ్రాఫ్ట్ టెక్ట్స్, ఇమేజ్‌లను క్రియేట్ చేయడం, ఐడియాలను సాంగ్స్‌గా మలచడానికి యూజర్‌లకు ఉపయోగపడుతుంది. కొత్త బటన్ స్పేస్‌బార్‌కు కుడి వైపున ఉంటుంది.





రీమార్కబుల్ 2 ఇ-ఇంక్ ట్యాబ్

రీమార్కబుల్ 2 ఇ-ఇంక్ ట్యాబ్ మన దేశంలో లాంచ్ అయింది. ఈ ఇ-ఇంక్ ట్యాబ్ రోజువారీ నోటుబుక్‌లాగే పనిచేస్తుంది. నోటుబుక్ రాసిన అనుభూతిని ఇస్తుంది. నోట్స్ తీసుకోవడానికి, డాక్యుమెంట్‌లను రివ్యూ చేయడానికి... రకరకాలుగా ఇది ఉపయోగపడుతుంది. కొన్ని వివరాలు... ● 10.3 అంగుళాల మోనో క్రోమ్ డిజిటల్ పేపర్ డిస్‌ప్లే ● రిజల్యూషన్: 1,872X1,404 పిక్సెల్స్ ● 1.2 జీహెచ్ డ్యూయల్-కోర్ ఏఆర్‌ఎం చిప్‌సెట్ ● వై-ఫై ● బ్యాటరీ: 3.000 ఎంఏహెచ్

● గేమింగ్ | నేడు విడుదల



ఎవర్‌గ్రీన్ ఎనర్జీ

'వెల్‌కమ్ టు హమ్‌బోల్డ్ బొటానికల్ గార్డెన్' అంటూ ఆహ్వానిస్తోంది ది కబ్. అడ్వెంచర్ గేమ్ 'ది కబ్' నేడు విడుదల అవుతుంది. 'ది జంగిల్ బుక్' 'లయన్ కింగ్'లాంటి ఎన్నో క్లాసిక్స్‌ను స్ఫూర్తిగా తీసుకొని నేటి కాలానికి తగినట్లుగా రూపొందించిన గేమ్ ఇది. ఈమధ్య విడుదలైన గేమ్ ట్రైలర్ ప్లేయర్స్‌కు ఉత్సాహం కలిగించేలా ఉంది.
పబ్లిషర్స్: అన్‌టోల్డ్ టేల్స్, గేమర్‌స్కైగేమ్స్ ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ఎక్స్‌బాక్స్ వన్, ప్లేస్టేషన్4, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ జానర్స్: ప్లాట్‌ఫామ్ గేమ్, అడ్వెంచర్ గేమ్.

ఎట్ సీ

అయోమయంలో ఉండి ఏమీ చేయాలో తెలియని పరిస్థితుల్లో వాడే మాట... ఎట్ సీ.
ఉదా: ఐయామ్ కంప్లీట్లీ ఎట్ సీ విత్ ది న్యూ కంప్యూటర్ సిస్టం.

నెసెసరీ ఇవిల్

ఒక విషయం నచ్చకపోయినా, తప్పనిసరి పరిస్థితుల్లో ఒప్పుకోవడం.
ఉదా: మోస్ట్ అమెరికన్స్ యాక్సెప్ట్ ట్యాక్సెస్ యాజ్ ఏ నెసెసరీ ఇవిల్.



సినిమా



● ఎన్టీఆర్



● ధనుష్, శేఖర్ కమ్ముల

క్రేజీ కాంబినేషన్‌కి క్లాప్

హీరోలు ధనుష్, నాగార్జున అక్కినేని క్రేజీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ కోసం చేతులు కలిపారు. ఈ చిత్రానికి శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. 'డీఎన్‌ఎస్' (ధనుష్, నాగార్జున, శేఖర్ కమ్ముల) వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో రష్మికా మందన్న కథానాయిక. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ధనుష్‌తో కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణతో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టారు. ''నా సామిరంగ'తో నాగార్జున, 'కెప్టెన్ మిల్లర్'తో ధనుష్ సంక్రాంతికి బ్లాక్ బస్టర్‌లను అందించారు. వీరిద్దరూ కలిసి నటిస్తున్న ఈ మల్టీ స్టారర్ ప్రాజెక్ట్‌పై ఎగ్జయిట్‌మెంట్ రెట్టింపు అయ్యింది. 'ఫిదా, లవ్ స్టోరీ' వంటి వరుస బ్లాక్‌బస్టర్స్ తర్వాత శేఖర్ కమ్ముల బిగ్ కాన్వాస్‌పై యునిక్ కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలి నారంగ్, కెమెరా: నికేత్ బొమ్మి.

రెండున్నరేళ్లు బాధ్యతతో పని చేశాం

- హీరో సందీప్ కిషన్

''ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతి ఇవ్వాలని దాదాపు రెండున్నరేళ్లు 'ఊరు పేరు భైరవకోన' సినిమా కోసం ఒక బాధ్యతతో పని చేశాం. ఈ చిత్రం పెద్ద విజయం సాధించడం మా యూనిట్‌కి చాలా అవసరం. ఆ బాధ్యతని, అవసరాన్ని గుర్తు చేసుకుంటూ పని చేశాం'' అని సందీప్ కిషన్ అన్నారు. వీఐ ఆనంద్ దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా, వర్ష బొల్లమ్మ, కావ్య థాపర్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 9న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకలో ఈ చిత్రం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''ఊరు పేరు భైరవకోన' కమర్షియల్లీ ఫుల్ ప్యాకేజ్డ్ ఎంటర్‌టైనర్'' అన్నారు. ''ఈ సినిమా నా కెరీర్‌లో ఓ సవాల్. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది'' అన్నారు వీఐ ఆనంద్. ''ఈ మూవీలో ప్రేమకథ, కామెడీ, ఫ్యాంటసీ, యాక్షన్.. ఇలా అన్ని అంశాలున్నాయి. సినిమాపై చాలా నమ్మకంగా ఉన్నాం'' అన్నారు రాజేశ్ దండా. ''గొప్ప థియేట్రికల్ అనుభూతినిచ్చే మూవీ ఇది. థియేటర్స్‌లోనే ఈ సినిమా చూడండి'' అన్నారు వర్ష, కావ్య. ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: రాజ్ తోట.



● వర్ష, సందీప్ కిషన్, కావ్య థాపర్

మళ్లీ షురూ



● అల్లు అర్జున్

మళ్లీ యాక్షన్ షురూ చేశాడు పుష్పరాజ్. తనకు ఎదురొచ్చిన శత్రువుల బెండు తీస్తున్నాడు. అది ఏ రేంజ్‌లో అనేది ఆగస్టు 15న థియేటర్స్‌లో చూడాలి. అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పుష్ప'. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పుష్ప రాజ్ పాత్రలో నటిస్తున్నారు అల్లు అర్జున్. 'పుష్ప' సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్'కి మలి భాగంగా 'పుష్ప: ది రూల్' రూపొందుతోంది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించారు. కాగా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో ప్రారంభమైందని తెలిసింది. పదిహేను రోజులకు పైగా ఈ షెడ్యూల్ సాగుతుందట. అల్లు అర్జున్ పాల్గొనగా ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారట. ఈ షెడ్యూల్‌లోనే కొన్ని కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారట. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సునీల్, అనసూయ, ఫాహద్ ఫాజిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.



● సమంత

ఆ విషయంలో నేను విఫలమయ్యాను

హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాల నుంచి కాస్త విరామం తీసుకున్నారు. అయితే సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటున్నారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఏదో ఒక పోస్ట్ పెడుతుంటారు. అంతేకాదు.. వీలు కుదిరిన ప్రతిసారీ అభిమానులతో చిట్‌చాట్ చేస్తుంటారు. అందులో భాగంగా తాజాగా ఫ్యాన్స్‌తో చిట్ చాట్ చేసిన సమంత ఆ సమయంలో చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 'మీ జీవితంలో చేసిన అతి పెద్ద పొరపాటు ఏంటంటే మీ సమాధానం ఏంటి?' అని ఓ అభిమాని సమంతను ప్రశ్నించగా ఆసక్తికరంగా జవాబిచ్చారు సమంత. ''నేను నా ఇష్టాలు, అయిష్టాలను తెలుసుకోవడంలో విఫలమయ్యా. ఈ విషయాన్ని నేను చాలా ఆలస్యంగా గ్రహించాను. ఆ సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడం నేను చేసిన అతి పెద్ద పొరపాటుగా భావిస్తున్నాను. నాతో ఉన్నవారితో, నా జీవిత భాగస్వామి వల్ల ఎక్కువగా ప్రభావితం అయ్యి నా ఇష్టాలను, అయిష్టాలను గుర్తించలేకపోయాను. క్లిష్ట సమయం నుంచే మనం విలువైన పాఠం నేర్చుకోగలమనే విషయం అర్థమైన తర్వాతే నా వ్యక్తిగత జీవితం ఎదుగుదల మొదలైంది'' అన్నారు సమంత. ఇక ప్రస్తుతం సమంత సినిమాలకు విరామం ప్రకటించి ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ పెట్టారు. ఆమె నటించిన 'సిటాడెల్' (ఇండియన్ వెర్షన్) వెబ్ సిరీస్ త్వరలో రిలీజ్ కానుంది. కాగా ఇటీవల సమంత 'ట్రలాలా మూవీ పిక్చర్స్' పేరుతో ఓ నిర్మాణ సంస్థను ప్రారంభించిన విషయం తెలిసిందే.

సెట్స్‌లో దేవర

'దేవర' తాజా షెడ్యూల్‌లో జాయిన్ అయ్యారట ఎన్టీఆర్. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'దేవర'. ఈ చిత్రంతో జాన్వీ కపూర్ తెలుగు చిత్ర పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభమైందని తెలిసింది. ఓ భారీ సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. ఈ షెడ్యూల్‌లో ముఖ్యంగా టాకీ పార్ట్ తీస్తారని తెలిసింది. అలాగే ఈ షెడ్యూల్‌లోనే ఓ పాట కూడా చిత్రీకరించే ఆలోచనలో ఉందట యూనిట్. న్యూ ఇయర్, సంక్రాంతి సెలవుల తర్వాత ఎన్టీఆర్ 'దేవర' షూటింగ్‌లో జాయిన్ కావడం ఇదే. రెండు భాగాలుగా కల్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న 'దేవర' తొలి భాగం ఏప్రిల్ 5న విడుదల కానుంది.

రాముడు... కుంభకర్ణుడు?



● రణ్‌బీర్ కపూర్



● బాబీ డియోల్

'యానిమల్' సినిమాలో రణ్‌విజయ్ సింగ్‌గా రణ్‌బీర్ కపూర్, అబ్రార్‌గా బాబీ డియోల్ అదిరిపోయే పెర్ఫార్మెన్స్ చేశారు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కాగా రణ్‌బీర్, బాబీ డియోల్‌లు మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారన్నది బాలీవుడ్‌లో వినిపిస్తున్న తాజా కబురు. రామాయణం ఆధారంగా హిందీలో దర్శకుడు నితీష్ తివారి 'రామాయణ్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమాను మూడు భాగాలుగా తెరకెక్కించనున్నారనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. రెండేళ్లుగా నితీష్ ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ చేస్తున్నారని, ఈ పనులు తుది దశకు చేరుకున్న తరుణంలో నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారని టాక్. ఈ నేపథ్యంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయిపల్లవి, హనుమంతుడి పాత్రలో దేవ్ దత్తా, రావణుడి పాత్రలో యశ్ నటించనున్నారనే వార్తలు తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ సినిమాలోని కుంభకర్ణుడి పాత్రలో బాబీ డియోల్, కైకేయి పాత్రలో లారా దత్తా కనిపించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. అన్నీ కుదిరి 'రామాయణ్' సినిమాలో రణ్‌బీర్, బాబీ డియోల్ సెట్ అయితే.. 'యానిమల్' తర్వాత ఈ ఇద్దరూ కలిసి నటించే సినిమా ఇదే అవుతుంది. ఇక ఈ సినిమా షూటింగ్ వేసవిలో ప్రారంభమయ్యే అవకాశం ఉందట. మధు మంతెన, నమిత్ మల్హోత్రా, అల్లు అరవింద్‌లు కలిసి ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారనే వార్తలు గతంలో వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది.

హాలీవుడ్‌కి హాయ్

దాదాపు నాలుగు దశాబ్దాల పాటు హిందీ తెరను ఏలిన అలనాటి తారల్లో నూతన్‌కి ప్రముఖ స్థానం ఉంది. 1950లలో చిత్రసీమలోకి అడుగుపెట్టి, 40 ఏళ్ల కెరీర్‌లో దాదాపు 80 చిత్రాల్లో నటించి, చెరగని ముద్ర వేసుకున్నారు నూతన్. ఆమె వారసురాలిగా ప్రనూతన్ బహల్ హిందీ చిత్రం 'నోట్‌బుక్' (2019)తో నటిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'హెల్మెట్'(2021) చిత్రంలో నటించిన ప్రనూతన్ బహల్ ఇప్పుడు హాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. అమెరికన్ యాక్టర్ రహ్సాన్ నూర్ నటిస్తూ, స్వీయ దర్శకత్వం వహించనున్న సినిమా 'కోకో అండ్ నట్'. ఇంగ్లిష్, హిందీ భాషల్లో తెరకెక్కనున్న ఈ లవ్‌స్టోరీ సినిమా చిత్రీకరణ జూన్‌లో చికాగోలో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో ఇండియన్, ఇంగ్లిష్ నటీనటులు నటించనున్నారు. ''ఓ రొమాంటిక్ డ్రామాతో హాలీవుడ్‌కు పరిచయం అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాలో నా క్యారెక్టర్ కొత్తగా ఉంటుంది'' అని పేర్కొన్నారు ప్రనూతన్. ''నోట్‌బుక్'లో ప్రనూతన్ యాక్టింగ్ ప్రతిభను చూసినప్పట్నుంచి ఆమెతో కలిసి నటించాలనుకుంటున్నాను. ఈ సినిమాలో తన పెళ్లి విషయంలో కొంతమందితో పోరాడే అమ్మాయి పాత్రలో ప్రనూతన్ కనిపిస్తారు'' అని పేర్కొన్నారు రహ్సాన్ నూర్.



● ప్రనూతన్ బహల్